
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

వరంగల్ : fb.com/vaartha Digital

Published from Warangal, Karimnagar, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

8-5-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 97 పేజీలు: 8+16 వెల: 6.50



పుదుచ్చేరి సిఎం రంగస్వామి రాజీనామా 3

హార్మూజ్ తెరిచేందుకు ఇరాన్, అమెరికా ఒప్పందం 5




నితీశ్ కుమారునికి మంత్రి పదవి

బీహార్ కేబినెట్‌ను విస్తరించిన సిఎం సామ్రాట్ చౌదరి

ముగ్గురు మాజీ సిఎంల తనయులు కొత్త కేబినెట్‌లోకి

5



కేరళం సిఎం రేసులో త్రిముఖ పోరు

సతీషన్, వేణు గోపాల్, రమేష్ చెన్నితాల మధ్య పోటీ

5



సువేందు పిఎ హత్య కేసుపై సిఐడి దర్యాప్తు

# ప్రతి పేదవాడికి సొంత ఇల్లు

## భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం

## గృహ విప్లవం, రెవెన్యూ సంస్కరణలతో తెలంగాణలో నవశకానికి శ్రీకారం

## ఉమ్మడి నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాల సమీక్షలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



గురువారం హౌజింగ్ కార్పొరేషన్ సమీక్షలో మంత్రులు పొంగులేటి, ఉత్తమ్ కుమార్, అడ్లూరి లక్ష్మణ్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే7:** ప్రతి పేదవాడికి సొంత ఇల్లును సమకూర్చడం, భూ యాజమానులకు తమ భూమి పై స్పష్టమైన హక్కులను కల్పించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం పేదల జీవితాల్లో శాశ్వతమార్పు తీసుకురావాలనే లక్ష్యంతో ముందుకు

>>2



## తెరపైకి మళ్లీ రిసార్టు రాజకీయాలు

## 15 మంది అన్నా డిఎంకె ఎమ్మెల్యేలను పుదుచ్చేరి తరలించిన పళనిసామి

## టివికె ఎమ్మెల్యేలు మామల్లపురం రిసార్టుకు..

## తమిళనాట రసవత్తరంగా కోలీవుడ్ సస్పెన్స్ థ్రిల్లర్

# అందీ అందని అందలం!



## ఇంకా డోలాయమానంలోనే విజయ్ ప్రభుత్వం ఏర్పాటు

## మెజారిటీ ఎమ్మెల్యేల జాబితాతో రావాలన్న గవర్నర్

**చెన్నై, మే 7:** తమిళనాట రాజకీయాలు ఇపుడు కోలీవుడ్ సస్పెన్స్ థ్రిల్లర్ సినిమాను తలపిస్తున్నాయి. ఏకైక అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ మెజార్టీ మార్కును చేరుకోలేకపోవడంతో టివికె విజయ్ తన ప్రయత్నాలను ముమ్మరంచేసారు. రాష్ట్ర గవర్నర్ ఆర్లేకర్‌ను కలిసి ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించాలని కోరిన విజయ్‌కు చుక్కెదురే అయింది. మెజార్టీ మార్కు కనిపించడంలేదని 118 మంది ఎమ్మెల్యేల జాబితాతో రావాలని అయితే అప్పటివరకూ మరో పార్టీని ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించబోమని కూడా గవర్నర్ విజయ్‌కు హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇప్పటికే రెండుపర్యాయాలు గవర్నర్‌ను కలిసిన టివికె విజయ్ ఆపార్టీనేతలకు అదే సమాధానం రావడంతో భవిష్యత్తు కార్యాచరణపై న్యాయనిపుణులను కూడా విజయ్ పార్టీ సీనియర్లు సంప్రదింపులు జరిపారు. మరోపక్క రెండేసి స్థానాలు గెలిచిన విసికె, సిపిఐ పార్టీలు తమ నిర్ణయాన్ని హైకమాండ్ వద్దచర్చించి చెపుతామని శుక్రవారానికి వాయిదావేసారు. ఇదిలా ఉంటే ఏకైక అతిపెద్ద పార్టీగా ఉన్న టివికెను ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయాలని ఆహ్వానించకపోవడం దురదృష్టకరమని బిజెపి చెప్పుచేతల్లో నడుస్తున్నారంటూ యువజన కాంగ్రెస్ లోక్‌భవన్‌వద్ద ధర్నాకు పిలుపునిచ్చింది. శుక్రవారంలోపు ప్రభుత్వం ఏర్పాటుకు విజయ్‌ను ఆహ్వానించకపోతే తాము ఆందోళన చేస్తామని ప్రకటించింది. కాంగ్రెస్‌పార్టీ మద్దతిచ్చినందువల్లనే గవర్నర్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని విమర్శించింది. మరోపక్క అన్నా డిఎంకెకు చెందిన 12 మంది ఎమ్మెల్యేలతో ఎంపి షణ్ముగం రిసార్టుకుతరలించి ప్రత్యేక సమాలోచనలు చేస్తున్నారు. అన్నాడిఎంకెలో మెజార్టీభాగం టివికెకు మద్దతివ్వాలని మతతత్వ

>>7



# మమత సర్కార్ డిస్మిస్

## ఆమె సిఎం పదవికి రాజీనామా చేయకపోవడంతో తన అధికారాలను వినియోగించిన గవర్నర్ రవి

## మమత పదిహేనేళ్లపాలనకు తెర

## రేపు కొలువుదీరనున్న కొత్త సర్కారు

## సువేందు అధికారికే సిఎం ఛాన్స్?

**కోల్‌కతా, మే 7:** బెంగాల్ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. సీఎం పదవికి రాజీనామా చేయనని భీష్మించుకు కూర్చున్న మమతా బెనర్జీకి గవర్నర్ ఆర్‌ఎన్ రవి షాక్ ఇచ్చారు. మమతా బెనర్జీ

>>2



గురువారం ఈగల్‌ఫోర్స్‌పై సమీక్షలో డిజిపి ఆనంద్

# డ్రగ్స్ కేసులపై పిడి యాక్ట్

## నార్కోటిక్స్‌పై పూర్తి అలర్ట్

## డ్రగ్స్ నియంత్రణకు అత్యంత ప్రాధాన్యం

## ఈగల్ ఫోర్స్‌పై డిజిపి ఆనంద్ సమీక్ష

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే7:** రాష్ట్రంలో డ్రగ్స్ కట్టడి చేయడమే తమ తొలి ప్రాధాన్యమని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. రిపీటెడ్‌గా డ్రగ్స్ కేసులో పట్టుబడితే పీడీ యాక్ట్ తరహా చట్టాన్ని ఉపయోగిస్తామన్నారు. రాష్ట్ర డీజీపీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత గురువారం తొలిసారిగా ఈగల్ ఫోర్స్‌పై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. పోలీస్ శాఖలోని 35 విభాగాలపై సమీక్ష నిర్వ హించామని తెలిపారు. నార్కోటిక్స్‌పై అలర్ట్‌గా

>>2

# పదేళ్లలో గ్లోబల్ సిటీగా హైదరాబాద్

## అంతర్జాతీయ పెట్టుబడులు భారీగా ఆకర్షించేలా ప్రణాళికలు

## ముంబయి నాస్కామ్ జిసిసి సమ్మిట్‌లో మంత్రి శ్రీధర్ బాబు



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే7:** అంతర్జాతీయ పెట్టుబడులను భారీగా ఆకర్షించేలా... పదేళ్లలో హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దేందుకు తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. మహా నగరాల అభివృద్ధిలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించేలా... భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యమిస్తోందని వివరించారు. గురువారం ముంబైలో నిర్వహించిన 'నాస్కామ్ జీసీసీ సమ్మిట్ 2026'లో 'బియాండ్ పాలసీ: డిజైన్డ్ టు విన్ ది గ్లోబల్ జీసీసీ రేస్' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... 2047 నాటికి దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచాలనే సంకల్పంతో 'తెలంగాణ రైజింగ్

>>2



ఎమ్మెల్యే కారును ధ్వంసం చేస్తున్న దృశ్యం



# కౌశిక్ రెడ్డిపై దాడి!

## క్యాంపు కార్యాలయాలపై పెద్దఎత్తున దాడి జరిపిన బిజెపి కార్యకర్తలు

## కారు అద్దాలు ధ్వంసం

## కరీంనగర్‌లో వేడెక్కిన రాజకీయం

## పోలీసులు పూర్తిగా విఫలం: కౌశిక్ రెడ్డి

**కరీంనగర్ బ్యూరో,ప్రభాతవార్త:** ఉమ్మడి కరీంనగర్ జిల్లా రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి లక్ష్యంగా జరిగినదాడి జిల్లాలో పెను సంచలనం సృష్టించింది. గురువారం కరీంనగర్‌ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం

>>2

# నేడు తుమ్మిడిహెట్టి సందర్శనకు మంత్రులు

## నీటి లభ్యత, ముంపు ప్రభావాన్ని పరిశీలించనున్న మంత్రులు వివేక్, జూపల్లి

**హైదరాబాద్, మే 7, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావించి నిర్మించతలపెట్టిన తుమ్మిడిహట్టి ప్రాజెక్టును మంత్రులు వివేక్ వెంకటస్వామి, జూపల్లి కృష్ణారావు సందర్శించనున్నారు. సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం ఇరువురు మంత్రులు తుమ్మిడి హట్టిని సందర్శించనున్నారు. బ్యారెజి నిర్మాణ సానుకూలతలు, నీటి లభ్యత, ముంపు ప్రాంతం, సాగునీటి అవసరాలపై అధికారులతో లోతుగా సమీక్షించనున్నారు. శుక్రవారం ఉదయం 7.30గంటలకు తుమ్మిడిహట్టి ప్రాంతంలో మంత్రులు వివేక్, జూపల్లి క్షేత్రస్థాయి పరిశీలన చేయనున్నారు. పర్యటనలో భాగంగా సంబంధిత నీటిపారుదలశాఖ అధికారులతో మంత్రులు భేటి కానున్నారు. ప్రాణహిత ప్రాజెక్టు వద్ద నీటి లభ్యత గణాంకాలు, రైతులకు అందాల్సిన ప్రయోజనాలపై అధికారులకు దిశానిర్దేశం చేయనున్నారు. కాగా.. తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి తెలంగాణ ప్రభుత్వం వేగంగా చర్యలు చేపడుతోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు తుమ్మిడిహట్టి వద్ద 150 మీటర్ల ఎత్తుతో బ్యారేజీ నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ బ్యారేజీ ద్వారా దాదాపు 100 టీఎంసీల నీటిని నిల్వచేసి, గ్రావిటిద్వారా ఎల్లంపల్లికి



>>2



# రేపటి నుంచి టిజిఎప్‌సెట్ పరీక్షలు

## మూడు రోజులు నిర్వహణ

**హైదరాబాద్, మే 7, ప్రభాతవార్త:** ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే టిజి ఎప్‌సెట్-2026 పరీక్షల నిర్వహణకు జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జెఎన్‌టియు) అన్ని

>>2

# వేగంగా డిండి ఎత్తిపోతలు

## ఎస్ఎల్‌బిసి కాలువల సామర్థ్యం పెంచాలి

## డిండి లిఫ్ట్ బ్యారేజ్ పనులు 15కు ప్రారంభించాలి

## 3.61 లక్షల ఎకరాలకు సాగునీరు

## 4 ఆన్‌లైన్, 4 ఆఫ్‌లైన్ రిజర్వాయర్ల నిర్మాణం: మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి



గురువారం 'డిండి'పై సమీక్ష చేస్తున్న మంత్రి ఉత్తమ్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

**హైదరాబాద్, మే 7, ప్రభాతవార్త:** డిండి ఎత్తిపోతల పథకం ఆఫ్‌టెక్ పాయింట్‌కు సంబంధించిన లెవల్ ఫిక్సేషన్‌ను తక్షణమే పూర్తి చేసి ప్రాజెక్టును వేగంగా పూర్తి చేయాలని ఉన్నతాధికారులను రాష్ట్ర నీటిపారుదల శాఖామంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆదేశించారు. ఎఎంఆర్‌పి, ఎస్‌ఎల్‌బిసి కాలువల సామర్థ్యాన్ని పెంచాలని సూచించారు. డిండి ఎత్తిపోతల పథకం పనుల పురోగతిపై గురువారం సచివాలయంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డితో కలసి ఆయన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి సంబంధించిన ఏదుల్ల రిజర్వాయర్ నుండి ఎత్తిపోతల పథకం అప్రోచ్ ఛానల్‌కు నీటిని ఏ స్థాయిలో తీసుకు రావాలనే అంశంపై తుదినిర్ణయం తీసుకోవాలని

>>2



# ఎండొచ్చిందని ఆరబెడితే వానొచ్చి ముంచేసింది

## కొనుగోలు కేంద్రాల్లో తడిసిముద్దవుతున్న వరి, మొక్కజొన్న

## టార్పాలిన్లు కప్పినా ఈదురుగాలులకు కొట్టుకుపోయిన వైనం

## కరీంనగర్, ఆదిలాబాద్, భూపాలపల్లి జిల్లాల్లో రైతన్న కుదేలు

**హైదరాబాద్, మే 7, ప్రభాతవార్త:** అకాల వర్షాలు అన్నదాతలను ఆగమాగం చేస్తున్నాయి. పలుజిల్లాల్లో ఈదురు గాలులతో కూడిన అకాల వర్షాల ధాటికి కల్లాల్లోని వరి, మొక్కజొన్న ధాన్యం తడిసిముద్దయింది. ఉదయం నుంచి తీవ్ర ఎండలు కాయగా గురువారం సాయంత్రం ఒక్కసారిగా రాష్ట్రంలో వాతావరణం మారిపోయింది. ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో గురువారం సాయంత్రం, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో బుధవారం రాత్రి అకాల వర్షాలు కురిశాయి. కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి వరి ధాన్యం తడిసిముద్దయింది. కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యాన్ని కాపాడుకోవడానికి రైతులు నానా పాట్లు పడాల్సి వచ్చింది. వర్షానికి తోడు

>>2



న్యూఢిల్లీలో గురువారం నెహ్రూ ప్లేస్ తపాలా భవవాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రులు జ్యోతిరాదిత్య సింధియా, పెమ్మసాని, ఢిల్లీ సిఎం రేఖా గుప్తా

# నేడు తుమ్మిడిహెట్టి సందర్శనకు మంత్రులు

>> తరలించాలని ప్రణాళిక సిద్ధం చేశారు. బ్యారేజీ నిర్మాణంలో భాగంగా మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరిపి, అవసరమైన ఒప్పందాలను చేసుకోవడానికి సీఎం రేవంత్‌రెడ్డి సిద్ధమవుతున్నారు. ఇప్పటికే తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ, సుందిళ్ల వరకు కాల్వల తవ్వకాలకు సంబంధించి సర్వే పనులు, డీపీఆర్ తయారీ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు పూర్తయితే ఉత్తర తెలంగాణలో సాగునీటి కష్టాలు తీరుతాయని ప్రభుత్వం చెబుతోంది. కాగా.. ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టు కోసం గతంలో సుమారు రూ. 11,000 కోట్లు వెచ్చించామని.. సుమారు 71.5 కిలోమీటర్ల మేర కాల్వల నిర్మాణం కూడా పూర్తయిందని నీటిపారుదలశాఖ చెబుతోంది. వృథాగా ఉన్న నిర్మాణాలను సద్వినియోగం చేసుకోవాలంటే తుమ్మిడిహెట్టి నిర్మాణమే ఏకైక మార్గమని ప్రభుత్వం భావిస్తోంది. బ్యారేజీ ఎత్తుపై ఇంజనీరింగ్ నిపుణులు ఇప్పటికే సిఎం రేవంత్‌రెడ్డికి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఆధారంగా కూలంకషంగా వివరించారు. 148 మీటర్ల ఎత్తుకు మహారాష్ట్ర గతంలోనే అంగీకరించిందని, అయితే 152 మీటర్ల ఎత్తు పెంచితే ముంపు ప్రభావం ఎక్కువగా ఉంటుందని నీటిపారుదలశాఖ చెబుతోంది. ఈ నేపథ్యంలో మధ్యేమార్గంగా 150 మీటర్ల ఎత్తున బ్యారేజీ నిర్మిస్తే కనీసం 100 టీఎంసీల నీటిని వినియోగించుకునే వీలుంటుందని సిఎం నిర్ణయించారు. శ్రీపాద ఎల్లంపల్లి రిజర్వాయర్‌కు అతి తక్కువ ఖర్చుతో విద్యుత్ లేకుండానే గ్రావిటి ద్వారానీటిని తరలించవచ్చని ఆయన భావిస్తున్నారు.ప్రాణ హిత- చేవెళ్ల ప్రాజెక్టు అదిలాబాద్‌తో పాటు ఉత్తర తెలంగాణ మెట్ట ప్రాంతాలకు వరప్రదాయినిగా మారుతుందని సిఎం స్పష్టం చేస్తున్నారు.

# టిజిఎప్‌సెట్ పరీక్షలు

>> ఏర్పాట్లు పూర్తి చేసింది. మే 9 నుంచి మే 11 వరకు మూడు రోజులపాటు పరీక్షలు జరగనున్నాయని కన్వీనర్ డాక్టర్ కె.విజయ్ కుమార్‌రెడ్డి గురువారం ప్రకటించారు. ఈ ఏడాది ఇంజనీరింగ్ స్ట్రీమ్ కోసం మొత్తం 2,10,766 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, వారి కోసం రాష్ట్రవ్యాప్తంగా 125 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రవేశ పరీక్షలను ప్రతిరోజూ రెండు సెషన్లలో నిర్వహించనున్నారు. ఉదయం సెషన్ 9 గంటల నుంచి నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం సెషన్ 3 గంటల నుంచి సాయంత్రి 6 గంటల వరకు జరుగుతాయి. పరీక్ష ప్రారంభ సమయానికి ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా అభ్యర్థులను ఎట్టి పరిస్థితుల్లోనూ పరీక్షా హాల్‌లోకి అనుమతించబోమని కన్వీనర్ స్పష్టం చేశారు. అభ్యర్థులను ఉదయం సెషన్‌కు 7.30 నుంచి మధ్యాహ్నం సెషన్‌కు 1.30 నుంచి పరీక్షా కేంద్రం లోపలికి అనుమతిస్తామని, పరీక్ష పూర్తయ్యే వరకు ఎవరినీ బయటకు పంపబోమని వెల్లడించారు.
విద్యార్థులు పరీక్షా కేంద్రానికి వచ్చేటప్పుడు తమ హాల్ టికెట్‌తోపాటు కనీసం ఒక ఒరిజినల్ ఫోటో, గుర్తింపు కార్డు, నలుపు లేదా నీలం రంగు బాల్ పాయింట్ పెన్ను వెంట తెచ్చుకోవాలన్నారు. పరీక్షా హాల్‌లోకి సెల్ ఫోన్లు, చేతి గడియారాలు, క్యాలిక్యులేటర్లు, ఇతర ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్ తీసుకురావడం నిషేధమని స్పష్టం చేశారు. పరీక్ష ముగిసిన వెంటనే అభ్యర్థులు సాధించిన మార్కులు కంప్యూటర్ స్క్రీన్‌పై కనిపిస్తాయన్నారు. అయితే తుది కీ ఆధారంగా మార్కులను నార్మలైజ్ చేసిన తర్వాతే ర్యాంకులను కేటాయిస్తామని అధికారులు వెల్లడించారు. విద్యార్థులు ముందుగానే తమ పరీక్షా కేంద్రాలను సందర్శించి, హాల్ టికెట్‌లోని సూచనలను క్షుణ్ణంగా చదవాలని కన్వీనర్ విజ్ఞప్తి చేశారు. మరిన్ని వివరాల కోసం జెన్‌టియు అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

# ఎండొచ్చిందని ఆరబెడితే వానొచ్చి ముంచేసింది

>> వేగంగా గాలి వీచడంతో ధాన్యం కుప్పలపై కప్పిన టార్పాలిన్ కవర్లు ఎగిరిపోయాయి. అకాల వర్షానికి జగిత్యాల జిల్లా మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్లో మొక్కజొన్న, వరి ధాన్యం తడిసిపోయింది. ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కారణంగా నిర్మల్ జిల్లా దస్తురాబాద్, కడెం, జన్నారం మండలంలో పంట కల్లాల్లో ఆరబోసిన ధాన్యం పూర్తిగా తడిసిపోయింది.
కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండల కేంద్రంలో అకాల వర్షం రైతన్నకు కన్నీళ్లను మిగిల్చింది. నిర్మల్ జిల్లా కడెం మండలం అంబర్‌పేట గ్రామంలో రోడ్డు ప్రమాదం జరిగింది. ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో ధాన్యానికి కవర్లను కప్పడానికి రైతు బైక్ పై వెళుతుండగా ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం కనబడక ఢీకొని కిందపడడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. అన్నదాత పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. అకాల వర్షానికి ఆదిలాబాద్ జిల్లా మార్కెట్లో రైతులు ఆరబెట్టిన మొక్కజొన్న పంటకు తీరని నష్టం జరిగింది. జిల్లాలోని లోకేశ్వరం మండలంలోని కనకాపూర్, అబ్దుల్లాపూర్, వాస్తాపూర్, జోహార్‌పూర్, వాటోలి తదితర గ్రామాల్లో గురువారం సాయంత్రం అకస్మాత్తుగా భారీ వర్షం కురవడంతో కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన వరి ధాన్యం తడిసిపోయింది. వర్షం నుంచి ధాన్యాన్ని కాపాడుకోవడానికి రైతులు ఉరుకులు పరుగులు పెట్టారు. ధాన్యం పై కప్పిన టార్పాలిన్ కవర్లు భారీ ఈదురు గాలులకు లేచిపోయాయి. ఆకాశంలో ఒక్కసారిగా మబ్బులు కమ్ముకుని భారీ వర్షం కురవడంతో ధాన్యాన్ని కాపాడుకునే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో రైతులు కళ్ల ముందే ధాన్యం తడిసిపోతుండగా ఏమీ చేయలేని పరిస్థితిలో ఉండిపోవాల్సి వచ్చింది. ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండల కొనుగోలు కేంద్రంలో అకాల వర్షానికి మక్కలు తడిసి ముద్దయ్యాయి. కాగా.. జగిత్యాల మార్కెట్‌యార్డ్‌లో మక్కలు, వరి ధాన్యం తడిసిపోవడంతో రైతులు ఆందోళనకు దిగారు. జగిత్యాల - నిజామాబాద్ ప్రధాన రహదారిపై రైతులు ధర్నా చేశారు. కాగా.. ఇప్పటికైనా ప్రభుత్వం ఇకనైనా కొనుగోళ్లను వేగవంతం చేయాలని పలు జిల్లాల అన్నదాతలు డిమాండ్ చేస్తున్నారు. కాగా.. సమయానికి తూకం వెయ్యకపోవడంతోనే అకాల వర్షానికి పంట తడిచిపోతోందని పలు జిల్లాల రైతులు స్పష్టం చేస్తున్నారు. ఇప్పటికైనా కొనుగోలు కేంద్రాల్లో వేగంగా ధాన్యం తూకం వేసి మిల్లులకు తరలించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. వర్షానికి తడిసిన ప్రతి ధాన్యపు గింజలు ప్రభుత్వం కొనుగోలు చేయాలని స్పష్టం చేస్తున్నారు.

# వేగంగా డిండి ఎత్తిపోతలు

>> చెప్పారు. పోతిరెడ్డిపల్లి గ్రామంలో డిండి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ బ్యారేజ్ పనులను మే 15 నాటికి ప్రారంభించాలన్నారు. ఎఎంఆర్‌పి,ఎస్ఎల్‌బిసి ప్రధాన కాలువ సామర్థ్యాన్ని 2400 క్యూసెక్కుల నుంచి 4000 క్యూసెక్కులకు పెంచాల్సిన అవసరాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. అనంతరం సిమెంట్ కాంక్రీట్ లైనింగ్ పనులను చేపట్టాలని సూచించారు. ప్రాజెక్టు పూర్తయిన తర్వాత ఈ సామర్థ్యాన్ని 6000 క్యూసెక్కులకు మరింత పెంచాల్సిన అవసరం ఉండొచ్చని పేర్కొన్నారు. ఎస్ఎల్‌బిసి హై లెవల్ కాలువకు సిమెంట్ కాంక్రీట్ లైనింగ్ పనుల కోసం ప్రభుత్వం రూ.443 కోట్లు మంజూరు చేసిందన్నారు. అయితే లైనింగ్ పనుల కంటే ముందుగా కాలువ విస్తరణకు ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి స్పష్టం చేశారు. డిండి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ ద్వారా 228 ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాలను కవర్ చేస్తూ, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో నీటి సమస్యలకు పరిష్కారం లభించనుందని తెలిపారు. అదేవిధంగా 3.61 లక్షల ఎకరాలకు సాగు నీరు అందనుందన్నారు. ఈ పథకం కింద మొత్తం 25.31 టిఎంసిల నిల్వ సామర్థ్యం తో నాలుగు ఆన్‌లైన్ రిజర్వాయర్లు, అయిదు ఆఫ్‌లైన్ రిజర్వాయర్లు నిర్మించనున్నట్లు చెప్పారు. హెడ్‌వర్క్స్‌ను నాలుగు ప్యాకేజీలుగా విభజించగా అందులో పోతిరెడ్డిపల్లి గ్రామంలోని బ్యారేజ్, 16 కిలోమీటర్ల టన్నెల్ కూడా ఉన్నాయన్నారు. డిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు సంబంధించిన పనుల్లో ప్రభుత్వం ఇప్పటివరకు 95% పనులు పూర్తిచేసిందని మంత్రి ఉత్తమ్ చెప్పారు. ఇందులో అధికభాగం ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సాధించిన పురోగతేనని స్పష్టం చేశారు. అయితే మూడు గ్రామాల పునరావాస సమస్యలు, నల్గొండ, నాగర్ కర్నూల్ జిల్లాల్లో 180.14 హెక్టార్ల అటవీ భూమికి సంబంధించిన సమస్యల కారణంగా స్పిల్‌వేలో ఒక భాగం ఇంకా పూర్తి కాలేదని పేర్కొన్నారు. అటవీ భూమికి సంబంధించిన తొలి దశ అనుమతులు మరో నెల రోజుల్లో వచ్చే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. దిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు గేట్ల ఏర్పాటు కోసం వెంటనే టెండర్లు పిలవాలని అధికారులను ఆదేశించారు. పెండ్లిపాక బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పూర్తి చేసేందుకు సవరించిన అంచనాల తయారి పురోగతిని కూడా మంత్రి ఉత్తమ్ సమీక్షించారు. ఈ అంచనాలను హై పవర్డ్ కమిటీ ముందు ఉంచాలని అభిప్రాయపడ్డారు. తదుపరి మంత్రివర్గ సమావేశం నాటికి నివేదికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

## వారం - వర్జ్యం

08-05-2026, శుక్రవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
వైశాఖమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, కృష్ణపక్షం, కృత్తిక కార్తె
షష్ఠి మ.12.19
ఉత్తరాషాఢ రా.9.17
వర్జ్యం : రా.1.38-రా.3.22
దు.ఉ.8.13-ఉ.9.04,
2) మ.12.29-మ.1.20
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:** దైవం తోడు ఉంటే కాలం కలిసి వస్తుందని సమయం కోసం వేచి ఉంటారు. పోటీ పరీక్షలలో పాల్గొంటారు.

**వృషభం:** రాజకీయ యత్నాలు, చర్చలు ఫలిస్తాయి. సంతాన అభివృద్ధికి ఎంతో కృషి చేస్తారు. ఉద్యోగావకాశాలు పొందుతారు.

**మిథునం:** పూర్వం కన్నా భిన్నంగా ప్రవర్తిస్తారు. దైనందిన జీవితంలో మార్పులు చేస్తారు. ఆ మార్పులు కలిసి వస్తాయి.

**కర్కాటకం:** వృత్తి, వ్యాపారాలలో లాభం నామ మాత్రం గానే ఉంటాయి. సొంత ఆలోచనలు మేలు చేస్తాయి. వివాదాలకు దూరంగా ఉండండి.

**సింహం:** పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని గతంలో వద్దనుకున్న అవకాశాలు తిరిగి అనుకూలం చేసుకునే యత్నాలు చేస్తారు.

**కన్య :** విదేశీయానం, ఉద్యోగం వంటి ముఖ్యమైన విషయాలు కలిసి వస్తాయి. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు.

**తుల :** పలువిషయాలలో అభిప్రాయ భేదాలు, వాగ్వివాదాలు సంభవించడం చికాకు కలిగిస్తుంది. ఆరోగ్యం జాగ్రత్త.

**వృశ్చికం:** ఆరోగ్యపరంగా తీసుకునే జాగ్రత్తలు మంచి ఫలితాలనిస్తాయి. ఇతరులకు సహాయం చేసి విరోధులవుతారు.

**ధనుస్సు:** పొదుపు చేసిన ధనాన్ని పెట్టుబడి రూపంలో చూసుకోవలసి ఉంటుంది. కాంట్రాక్టులు దక్కుతాయి. వస్త్రలాభం.

**మకరం:** మీ కృషి వల్ల మీరు సుఖపడకపోయినా మీ వాళ్ళు సౌఖ్యంగా ఉంటారు. ఆశ్చర్యకరమైన ఆహ్వానాలు అందుతాయి. వాహనసౌలభ్యం.

**కుంభం:** వాతావరణంలో వచ్చే మార్పులు ప్రభుత్వ విధానాలు ఆందోళన కలిగిస్తాయి. సామాజిక కార్యక్రమాలలో పాల్గొంటారు.

**మీనం:** కుటుంబ సభ్యుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొన్న కొన్ని అవమానాలు భరించాల్సి వస్తుంది. ప్రయాణాలు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ప్రతి పేదవాడికి సొంత ఇల్లు

>> సాగుతోందన్నారు. ఇల్లు, భూమి ప్రతి కుటుంబానికి ఆత్మగౌరవానికి ప్రతీకని పేదవాడికి భద్రమైన భవిష్యత్తు కల్పించడమే ప్రభుత్వ సంకల్పం అని మంత్రి పేర్కొన్నారు. పేదల జీవితాల్లో గౌరవప్రదమైన మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వం లోని ప్రజాప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు అనే మహత్తర కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. ఈ పథకం కింద పేద కుటుంబాలకు వారి సొంత స్థలాల్లో ఇళ్ల నిర్మాణం కోసం ఒక్కొక్క ఇంటికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. దాదాపు 4 లక్షల ఇళ్లను మంజూరు చేసి, రాష్ట్రవ్యాప్తంగా గృహ విప్లవానికి శ్రీకారం చుట్టామని చెప్పారు. హౌసింగ్, రెవెన్యూ అంశాలపై జిల్లాల వారీగా ప్రజా ప్రతినిధులతో జరుపుతున్న సమీక్షలో భాగంగా గురువారం హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఉమ్మడి నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాలకు చెందిన ఇన్ ఛార్జి మంత్రులు, మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, హౌసింగ్, రెవెన్యూ, ఫారెస్టు అధికారాలతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాల్లో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, నల్గొండ ఇన్ ఛార్జి మంత్రి ఎస్సీ,ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్, వాకాటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, ప్రణాళిక బోర్డు వైస్ చైర్మన్ జి.చిన్నారెడ్డి, ప్రభుత్వ సలహాదారులు జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో క్షేత్ర స్థాయిలోని పరిస్థితులపై స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయంతో వ్యవహరించాలని, జిల్లా స్థాయిలో అధికార యంత్రాగమంతా సమన్వయంతో పనిచేస్తే అక్కడికక్కడే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా కలెక్టర్లు పనిచేయాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలులో అత్యధిక శాతం అధికారాలను కలెక్టర్లకే దఖలు పరిచామన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి ఒకసారి ప్రొసీడింగ్స్ ఇచ్చి, మొదటి బిల్లు వారి ఖాతాల్లో జమ అయిన లబ్ధిదారులందరికీ తదుపరి విడతల బిల్లులన్నిటిని సకాలంలోనే విడుదలయ్యేలా చూడాలని మంత్రి కలెక్టర్లను ఆదేశించారు. అలాగే ఇందిరమ్మ ఇండ్ల విషయంలో ఎటువంటి అక్రమాలకు తావివ్వకుండా, పూర్తి పారదర్శకంగా జవాబుదారీ తనంతో పనిచేస్తూ అర్హులైన వారికే ఫలాలు దక్కేలా చూడాలని ఈ విషయంలో ఎక్కడ పొరపాటు జరిగినా ఉపేక్షించేది లేదన్నారు. గతంలో ఇందిరమ్మ ఇండ్ల కోసం సేకరించి పూర్తి స్థాయిలో వినియోగించకుండా మిగిలి ఉన్న భూముల్లో అర్హులైన వారికి ఇండ్ల పట్టాలు ఇచ్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్లకు ఆదేశాలిచ్చారు. గతంలో ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఇల్లు మంజూరైనా వివిధ కారాణలతో నిర్మాణాలను పూర్తి చేయని వారికి కూడా వెసులుబాటు కల్పించే యోచనలో ఉన్నామని తెలిపారు. ముఖ్యంగా జిల్లాల్లో గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరక్టర్లు పూర్తి బాధ్యతాయుతంగా విధులను నిర్వహించాలని, లబ్ధిదారులు, ఉన్నతాధికారుల మధ్య సమన్వయకర్తలుగా వ్యవహరిస్తూ సమస్యల పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని , ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. అలాగే డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణపు పనులు ఏ స్థాయిలో ఉన్నా, ఈ నెల 20వ తేదీలోగా లబ్ధిదారుల ఎంపికను పూర్తి చేయాలని, ఈ విషయంలో స్థానిక ప్రజాప్రతినిధులు కూడా చొరవ చూపాలని మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారు సూచించారు. అర్హులైన పేదలనే లబ్ధిదారులుగా ఎంపిక చేయాలన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో రెవెన్యూ, రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు నూతన భవనాలను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఈ కార్యాలయాలన్నిటిని ప్రజలకు అందుబాటులో ఉండే ప్రదేశాల్లో నెలకొల్పేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. అలాగే లక్షకు పైగా జనాభా ఉన్న మండలాల్లో, అవసరానికి అనుగుణంగా, అదనంగా మరో తహాశీల్దార్ ను నియమించనున్నామని మంత్రి తెలిపారు. ఇందుకు సంబంధించిన జిల్లా కలెక్టర్లు ప్రతిపాదనలను సిద్ధం చేయాలన్నారు. రెవెన్యూ, అటవీ తదితర శాఖల మధ్య ఉన్నభూ వివాదాల సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం ఆయా విభాగాలు ఉమ్మడిగా సర్వే చేయడమే మార్గమన్నారు. ఈ దిశలో మరింత వేగవంతమైన చర్యలు తీసుకోవాలని అటవీ, రెవెన్యూ అధికారులకు మంత్రి స్పష్టం చేశారు. గతంలో ఎన్నడూ లేనట్లుగా రెవెన్యూ విభాగంలో అనేక సంస్కరణలు తీసుకుని వచ్చి ఆర్డీవోలకు విస్తృతమైన అధికారాలు కల్పించామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కాకుండా, ఇతర ప్రయోజనాలకు వీటిని వినియోగిస్తే అత్యంత కఠినంగా వ్యవహరిస్తామని పేర్కొన్నారు రాష్ట్రంలో భూ పరిపాలనను బలోపేతం చేయడంలో భాగంగా సర్వే, సెటిల్మెంట్స్,భూ రికార్డుల శాఖ ద్వారా సమగ్ర సంస్కరణలు అమలు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. భూ రికార్డుల్లో పారదర్శకత, ఖచ్చితత్వం తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి నాయకత్వంలో ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. పేదలకు న్యాయం జరిగేలా వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని అన్నారు.

# పదేళ్లలో గ్లోబల్ సిటీగా హైదరాబాద్

>> విజన్ 2047'కు శ్రీకారం చుట్టామని వివరించారు. ప్రపంచంలోని అనేక నగరాలు అస్తవ్యస్త పట్టణీకరణ వల్ల 'అర్బన్ కొలాప్స్' కోరల్లో చిక్కుకున్నాయని, అలాంటి చారిత్రక తప్పిదాన్ని హైదరాబాద్ విషయంలో తాము చేయాలనుకోవడం లేదన్నారు. అందుకే... భవిష్యత్తు కోసం ఎదురు చూడకుండా, దాన్ని నిర్మించే బాధ్యతను తీసుకున్నామన్నారు. ఆ దిశగానే భారత్ ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ, మెట్రో విస్తరణ, కొత్త విమానాశ్రయాల అభివృద్ధి, ఆర్ఆర్ఆర్, మూసీ ప్రక్షాళన, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, ఐకం ఇన్నోవేషన్ హబ్ తదితర కీలక ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టామన్నారు. కేవలం టెక్ కంపెనీలే కాకుండా... బ్యాంకింగ్, లైఫ్ సైన్సెస్, సెమీ కండక్టర్లు, రక్షణ రంగం, ఎఫ్ఎంసీజీ, స్పేస్ టెక్, ఆతిథ్యం తదితర బహుళ రంగాలకు చెందిన దిగ్గజ సంస్థలు జీసీసీల ఏర్పాటుకు హైదరాబాద్ ను తమ మొదటి ప్రాధాన్యంగా ఎంచుకుంటున్నాయన్నారు. గతేడాది 70కి పైగా జీసీసీలు ప్రారంభమయ్యాయని, దేశంలో ఇదే అత్యధికమని వివరించారు. ఈ ఏడాది కొత్తగా 100 జీసీసీలను ప్రారంభించి... వాటిల్లో కొత్తగా లక్ష మందికి ఉపాధి కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. జీసీసీలను కేవలం బ్యాక్ ఆఫీస్ ఆపరేషన్లకే పరిమితం చేయకుండా... వాటిని 'గ్లోబల్ వాల్యూ సెంటర్లు'గా మార్చేలా ప్రత్యేక 'కాంప్రహెన్సివ్ రోడ్డు మ్యాప్'ను సిద్ధం చేస్తున్నామన్నారు. పారిశ్రామికాభివృద్ధికి అన్ని రకాలుగా అనుకూలంగా ఉన్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని పారిశ్రామికవేత్తలను మంత్రి శ్రీధర్ బాబు కోరారు. హైదరాబాద్‌లో ఉన్న 'సిలికాన్ డెన్సిటీ (విభిన్న రంగాల నిపుణుల లభ్యత)ని అందిపుచ్చుకుని 'మేడిన్ తెలంగాణ' బ్రాండ్ ను విశ్వవ్యాప్తం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం తరఫున అన్ని రకాలుగా అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో నాస్కాం చైర్మన్ శ్రీకాంత్, ప్రెసిడెంట్ రాజేష్ నంబియార్ తదితరులు పాల్గొన్నారు.




'ఆపరేషన్ సిందూర్' మొదటి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఉధంపూర్‌లో వేసిన రంగవల్లిక వద్ద భద్రతా సిబ్బందితో విద్యార్థులు

# కౌశిక్ రెడ్డిపై దాడి!

>> వద్ద చోటుచేసుకున్న ఈ పరిణామాలు జిల్లాలో లా అండ్ ఆర్డర్ వైఫల్యాన్ని ఎండగడుతున్నాయనే ఆరోపణలు లేకపోలేదు.. జిల్లా కేంద్రంలో హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రెస్ మీట్ నిర్వహించిన అనంతరం బండి సంజయ్ ముఖ్య అనుచరుడి నేతృత్వంలోబిజెపి కార్పొరేటర్లు,నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంతో పాటు కౌశిక్ రెడ్డి కారును ధ్వంసం చేసినట్లు తెలుస్తోంది... ఇటీవలే కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రెస్ మీట్ నిర్వహించి కెసిఆర్, కేటీఆర్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు చేసినటువంటి విషయం విధితమే...ఆ విషయమై కౌశిక్ రెడ్డి ప్రెస్ మీట్ నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను తప్పుపట్టారు..ఆ వ్యాఖ్యలను ఖండిస్తూ ప్రతి విమర్శలు చేశారు. బండి సంజయ్ శైలిని తప్పుబడుతూ కౌశిక్ రెడ్డి మాట్లాడిన తీరు బీజేపీ శ్రేణుల్లో ఆగ్రహాన్ని తెప్పించినట్లు తెలుస్తోంది... కౌశిక్ రెడ్డి ప్రెస్ మీట్ ముగిసిన కొద్దిసేపటికే, భారీ సంఖ్యలో తరలివచ్చిన బిజెపి నాయకులు,కార్యకర్తలు ఒక్కసారిగా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంపైకి దూసుకెళ్లారు.ఆగ్రహంతో ఊగిపోయిన కార్యకర్తలు కార్యాలయం కిటికీలను,వస్తువులను ధ్వంసం చేశారు.అదేవిదంగా ఎమ్మెల్యే కారుపై రాళ్లు,కర్రలతో దాడి చేయడంతో కారు అద్దాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి.పోలీసులు రంగప్రవేశం చేసినప్పటికీ, అప్పటికే పరిస్థితి చేయి దాటిపోయింది.ఎట్టకేలకు పోలీసులు పరిస్థితులను అదుపులోకి తీసుకువచ్చి దాడికి పాల్పడిన వారిని అదుపులోకి తీసుకొని,కౌశిక్ రెడ్డిని అక్కడి నుంచి హుజురాబాద్ తరలించారు. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ... దాడి అనంతరం కౌశిక్ రెడ్డి మరోసారి మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం,బిజెపి నాయకులపై, పోలీస్ యంత్రాంగంపై తీవ్ర విమర్శలు చేశారు.రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా గాడి తప్పాయన్నారు. ఒక బాధ్యతాయుతమైన ఎమ్మెల్యేపై, అది కూడా ప్రభుత్వ క్యాంప్ కార్యాలయంలోనే దాడి జరుగుతుందంటే సామాన్యుల పరిస్థితి ఏమిటి అని ప్రశ్నించారు..పోలీస్ శాఖ వైఫల్యం వల్లే నేడు గూండాయిజం రాజ్యమేలుతోందనీ ఆరోపించారు.జిల్లాలో లా అండ్ ఆర్డర్ గాడి తప్పిందనడానికి నిదర్శనం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం తోపాటు తన కారుపై జరిగిన దాడే నిదర్శనం అన్నారు..బిజెపి నాయకుల దాడి హేయమైన చర్య అని తెలిపారు..పోలీస్ శాఖ వైఫల్యంతోనే రాబరీ,దాడులు జరుగుతున్నాయనీ ఆరోపించారు...ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం ఏమిటని ప్రశ్నించారు..ఎమ్మెల్యేకి రక్షణ లేకపోతే ఇక సామాన్య ప్రజల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు...తనమీదకి దాడికి వచ్చిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.. నిఘా వైఫల్యంపై విమర్శలు: కరీంనగర్ ఒక కీలకమైన ప్రెస్ మీట్ జరుగుతున్నప్పుడు, ఉద్రిక్తతలు తలెత్తే అవకాశం ఉందని తెలిసినా పోలీసులు ముందస్తు చర్యలు తీసుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇంటెలిజెన్స్ వర్గాల వైఫల్యంతోనే బీజేపీ శ్రేణులు అంత సులభంగా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలోకి చొరబడ్డాయని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు.
కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ నాయకత్వంలో జిల్లాలో దాడుల సంస్కృతికి తెరలేపారని మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు ఆరోపించారు..బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న పదేళ్లలో ఎప్పుడు ఇటువంటి దాడులు చేయలేదని పేర్కొన్నారు..ఈ దాడులను ఖండిస్తున్నామన్నారు. రాజకీయాల్లో విమర్శలు,ప్రతి విమర్శలు ఉండడం సహజమే కానీ ఈ దాడుల సంస్కృతి ఏంటని ప్రశ్నించారు.

# నేడు సిఎం రేవంత్‌రెడ్డి కొడంగల్ పర్యటన

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే7:** ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి శుక్రవారం కొడంగల్ నియోజకవర్గ పర్యటనకు వెడుతున్నారు. కొడంగల్ లో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. 430 పడకల ఆసుపత్రి నిర్మాణం, దౌల్తాబాద్ వెంకటేశ్వర స్వామి ఆలయం, కోస్గి వేణుగోపాలస్వామి ఆలయాల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభకు హాజరై ప్రసంగించనున్నారు.

# మమత సర్కార్ డిస్మిస్

>> రాజీనామా చేయకపోవడంతో బెంగాల్ టీఎంసీ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేశారు. బెంగాల్ అసెంబ్లీని రద్దు చేస్తున్నట్లు గవర్నర్ ఆర్ఎన్‌రవి ప్రకటించారు. అలాగే గవర్నర్ మొత్తం మంత్రివర్గాన్ని రద్దు చేశారు. దీంతో మమతా బెనర్జీ ముఖ్యమంత్రి పదవి నుంచి వైదొలిగినట్లైంది. రాజ్యాంగం ప్రకారం గవర్నర్ తన విచక్షణాధికారాలను ఉపయోగించారు. మే 7వ తేదీ అర్ధరాత్రితో బెంగాల్ అసెంబ్లీ 5 ఏళ్ల కాలపరిమితి ముగుస్తోంది. మరోవైపు ఓడిపోయినా మమతా బెనర్జీ సీఎం పదవికి రాజీనామా చేయలేదు. ఈ నేపథ్యంలో గవర్నర్ ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా తెలుస్తోంది. ఈ నిర్ణయంతో మమతా 15 ఏళ్ల పాలనకు తెరపడింది బెంగాల్‌లో శనివారం కొత్త ప్రభుత్వం కొలువుదీరనుంది. శుక్రవారం బీజేపీ శాసనసభాపక్షం సమావేశం కానుంది. ఈ సమావేశంలో శాసనసభాపక్ష నేతను ఎమ్మెల్యేలు ఎన్నుకోనున్నారు. అసెంబ్లీ రద్దుతో మమతా బెనర్జీ ప్రభుత్వాన్ని గవర్నర్ రవి బర్తరఫ్ చేసినట్లు అయింది. 294 స్థానాలు ఉన్న పశ్చిమ బెంగాల్ అసెంబ్లీకి రెండు విడతలుగా ఎన్నికలు జరిగాయి. మే 4వ తేదీన ఈ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో అధికారాన్ని బీజేపీకి ఓటర్ కట్టబెట్టాడు. దీంతో సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే స్పష్టమైన మెజార్టీ ఓటర్ ఇచ్చారు. దీంతో ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి బీజేపీ అగ్రనేతలు ముహూర్తం ఖరారు చేశారు. మే 9వ తేదీ ఉదయం10 గంటలకు ప్రతిష్టాత్మక బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరుగుతుందని పశ్చిమ బెంగాల్ బీజేపీ చీఫ్ సమీక్ భట్టాచార్య ప్రకటించారు. టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీపై ఘన విజయం సాధించిన సువెందు అధికారిని ముఖ్యమంత్రిగా నియమిస్తారనే ప్రచారం రాష్ట్రవ్యాప్తంగా జరుగుతుంది. ఇంకోవైపు ఈ ఎన్నికల్లో ఓటమి పాలవడంతో ఎన్నికల సంఘంపై మమతా బెనర్జీ తీవ్ర ఆరోపణలు చేశారు. బెంగాల్ అసెంబ్లీ కాలపరిమితి నేటితో గురువారంతో ముగిసింది. సీఎం పదవికి మమతా బెనర్జీ రాజీనామా చేయలేదు. దీంతో గత ప్రభుత్వాన్ని రద్దు చేస్తున్నట్లు గవర్నర్ ఆర్.ఎన్.రవి ప్రకటించారు.

# డ్రగ్స్ కేసులపై పిడియాక్ట్

>> ఉన్నామని.. డ్రగ్స్ కట్టడి చేయడంలో మొదటి ప్రాధాన్యతతో ఉన్నామన్నారు. రాష్ట్రంతోపాటు దేశవ్యాప్తంగా జరిగిన ఆపరేషన్‌పై ఈ సమీక్షలో చర్చించామని వివరించారు. ఈగల్ ఫోర్స్ ద్వారా మంచి ఫలితాలు వచ్చాయని చెప్పారు. అంతర్జాతీయ స్థాయిలో ఆపరేషన్లు నిర్వహించడం ద్వారా నిందితులను అరెస్ట్ చేసి.. వారి వద్ద నుంచి భారీగా డ్రగ్స్ స్వాధీనం చేసుకుని సీజ్ చేశామన్నారు. డ్రగ్స్ విషయంలో సరఫరాతోపాటు డిమాండ్.. ఈ రెండింటిపై దృష్టి సారించామని పేర్కొన్నారు. ఈగల్‌లో సిబ్బంది కొరత ఉందన్నారు. సివిల్ ఫోర్స్ అవసరం కూడా ఉందని చెప్పారు. డ్రగ్స్ సప్లయర్స్ ఆస్తులను సీజ్ చేయడం వంటి చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ ప్రకటించారు. జిల్లాలో కమిషనర్లు, ఎస్పీలు కూడా డ్రగ్స్ కట్టడిలో కీలక పాత్ర పోషించాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. జిల్లా స్థాయిలో నిఘా లోపించిందని ఈ సమీక్షా ద్వారా బహిర్గతమైందని చెప్పారు. నార్కోటిక్ ఐదు పోలీస్ స్టేషన్లు మంచిగా పని చేసి, ఫలితాలు వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇక నుంచి యూనివర్సిటీలతోపాటు విద్యాసంస్థల్లో డ్రగ్స్ దొరికితే ఆ బాధ్యత యజమాన్యాలదేనని డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ నిధులతో డీ అడిక్షన్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. జిల్లాల్లో అధికారులు డ్రగ్స్ కేసుల దర్యాప్తు చేయడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమైందన్నారు. జిల్లాల్లో డ్రగ్స్ కేసుల విచారణపై అధికారులకు ఈగల్ ఫోర్స్ ద్వారా శిక్షణ ఇస్తామని డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రంలో మాదకద్రవ్యాల సరఫరాను పూర్తిసాయిలో నిర్మూలించాలన్న రాష్ట్ర ముఖయమంతి ఎ రేవంత్ రెడి ఇప్పటికే పోలీసు అధికారులకు ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నో కుటుంబాలను పీడిస్తున్న ఈ మాదక ద్రవ్యాల మహమారిని పూర్తిస్థాయిలో అరికట్టాలని, తద్వారా రాష్ట్రంలోని యువత తన భవిష్యత్తులను తీర్చి దిద్దుకోవాల్సిన పరిస్థితులను కల్పించాలన్నారు. గత కొన్నేళ్లుగా రాష్ట్రంలో డ్రగ్స్ కేసుల నమోదు గణనీయంగా పెరిగిందని 2023లో 1464 కేసులు నమోదు కాగా. 2025 నాటికి ఆ సంఖ్య 2734కు చేరింది. 2023లో 3,157 మందిని అరెస్ట్ చేయగా, 2025లో ఈ సంఖ్య 5,703కు పెరిగాయని తెలియజేశారు. జాతీయ స్థాయిలో ప్రతి కేసులో సగటున 1.3 మంది అరెస్టవుతుంటే, తెలంగాణలో అది 3.1గా ఉందని, కేవలం డ్రగ్స్ సరఫరా చేసేవారినే కాకుండా, వాటి వెనుక ఉన్న ప్రధాన సూత్రదారులను సైతం పట్టుకుంటున్నట్లు స్పష్టమవుతుందన్నారు. సమీక్షా సమావేశంలో ఈగల్ ఫోర్స్ డైరెక్టర్ సందీప్ శాండిల్య, ఎస్పీలు పద్మజ,సీతారాం,రఘువీర్, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

వార్త

అదును చూసి వ్యవహరించడమంటే ఎంతో శ్రమను, సమయాన్ని, వ్యయాన్ని ఆదా చేయటమే.

న-ఆస్కార్‌వైల్డ్

# 'మత్తు' వదిలించలేమా?

మాదకద్రవ్యాల వ్యసనం జాతి వినాశనానికి దారితీస్తున్నదని, దాన్ని సమష్టిగా నిర్మూలించాల్సిన అవసరం ఉందని ఎంతోకాలంగా ప్రపంచవ్యాప్తంగా దేశాధినేతలు పదేపదే చెబుతూనే ఉన్నారు. కానీ అంతకు రెట్టింపు స్థాయిలో ఈ మహమ్మారి యేడాదియేడాదికి విస్తరిస్తున్నది. ముఖ్యంగా ఈ వ్యసనం పద్దెనిమిదేళ్ల లోపు పిల్లలపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. మరోవైపు నేరాల సంఖ్య అదుపులేకుండా పెరిగిపోతున్నది. మాదకద్రవ్యాల మత్తులో వారు ఏంచేస్తున్నారు వారికే తెలియని పరిస్థితుల్లో చేయరాని, చేయకూడని పనులకు పాల్పడుతూ అవి కప్పిపుచ్చుకునేందుకు ఆత్మహత్యలు చేయడానికి కూడా వెనుకాడడం లేదు. ప్రపంచవ్యాప్తంగా డార్క్‌నెట్ ద్వారా జరిగిన మత్తుమందుల కొనుగోళ్లలో ఆసియా ఖండం వాటా దాదాపు పద్దెనిమిదిశాతానికిపైగా పెరిగిపోయిందని చెప్తున్నారు. అందులో చైనా తర్వాత భారత్‌దే అగ్రస్థానం ఉంది. రెండు దశాబ్దాల క్రితం భారత్‌లో కోటిడెబ్భైలక్షల మందికిపైగా వాడకందార్లు ఉండేవారు. ఇప్పుడది పదికోట్లకు పైగా చేరుకున్నట్లు అనధికార అంచనా. మత్తుమందుల వాడకంలో పంజాబ్ అగ్రస్థానంలో ఉన్నట్లు అనేక సర్వేలు వెల్లడిస్తున్నాయి. ఆ రాష్ట్రంలో యేటా దాదాపు పదిహేనువేల కోట్ల రూపాయలకుపైగా మత్తుమందులపై ఖర్చుపెడుతున్నట్లు అంచనా. తెలుగు రాష్ట్రాల్లో కూడా పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. నిత్యం ఎక్కడో ఒక చోట పట్టుబడుతూనే ఉన్నాయి. దీనికితోడు గంజాయి సాగు ఊహించని రీతిలో పెరిగిపోయింది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ లోని విశాఖఏజెన్సీలోను, ఇటు తెలంగాణలోని ఖమ్మం, వరంగల్ తదితర జిల్లాల్లో అటవీ ప్రాంతాల్లో గంజాయి సాగు బాగా విస్తరించినట్లు వార్తలు అందుతున్నాయి. నాలుగేళ్ల క్రితం ఆంధ్ర, ఒడిశా సరిహద్దుల్లో నల్గొండ పోలీసులు చేపట్టిన 'ఆపరేషన్ గంజా' తనిఖీల్లో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ అధికార ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం కూడా జరిగింది. ఈ అక్రమాలను ప్రోత్సహిస్తున్నది మీరంటే మీరు అని పరస్పర ఆరోపణలు చేసుకున్నారు. ఇక విదేశాల నుండి భారీ ఎత్తున డ్రగ్స్ అటు ఆంధ్రప్రదేశ్‌కు, ఇటు తెలంగాణకు చేరుకుంటున్నట్లు పట్టుబడుతున్న సంఘటనలు రుజువు చేస్తున్నాయి. గతంలో గుజరాత్‌లోని ముంద్రా పోర్టులో ఇరవై ఒక్కవేల కోట్ల రూపాయల విలువైన హెరాయిన్ పట్టుబడినప్పుడు విజయవాడ లింకులు వెలుగులోకి వచ్చాయి. కొంతవరకు దర్యాప్తు జరిగినా ఆ తర్వాత ఏమైందో తెలియకుండాపోయింది. ఇక మత్తుమందు సరఫరా కోట్ల డాలర్ల వ్యవహారంలో ఎక్కువ భాగం ఉగ్రవాద సంస్థలకు చేరుతుందని దర్యాప్తు సంస్థలు చెబుతున్నాయి. పాకిస్థాన్, అఫ్ఘనిస్థాన్, ఉజ్బికిస్థాన్‌తో పాటు మరికొన్ని ఆఫ్రికా దేశాలు ఇందులో విరివిగా పాల్గొంటున్నాయి. కశ్మీర్ ఉగ్రవాదులకు పంజాబ్‌లోని మత్తుమందుల సరఫరాదారులకు గట్టి సంబంధం ఉన్నట్లు బయటపడింది. అయితే పట్టుబడుతున్నది పదోవంతు కూడా లేదని చెప్పొచ్చు. అన్నిటికన్నా ప్రధానంగా అత్యంత లాభదాయకం కావడం వల్ల ప్రపంచవ్యాప్తంగా పెద్దపెద్ద నేర ముఠాలు, మాదకద్రవ్యాల ఉత్పత్తి, రవాణాను వ్యాపారంగా మార్చుకుంటున్నాయి. ఈ ముఠాలు కొని సొంతంగా నెట్ వర్క్‌ను ఏర్పాటు చేసుకున్నాయి. లాటిన్ అమెరికాలో తయారవుతున్న మత్తుమందులు ప్రపంచం నలుమూలలకు విస్తరించడంతోపాటు రసాయనికాలు తయారు చేసే యాంఫెటామైన్ థైపిస్ట్‌మెలెన్స్ ఎక్కడికక్కడ తయారవుతున్నాయి. భారతదేశంలో ఈతరహా మత్తుమందులు పెద్దఎత్తునఉత్పత్తి చేస్తున్నారు. గతంలో మత్తుమందులు కొనేవారు తెలిసిన వాడకందార్లు నమ్మకం ఉన్నవ్యాపారినే సంప్రదించేవారు. మత్తుమందులు తీసుకొని డబ్బులు చేతిలోపెట్టేవారు. ఆవ్యాపారంకూడా అత్యంత రహస్యంగా మూడోకంటికి తెలియకుండా మత్తు మందు తెప్పిచ్చి అప్పగించేవాడు. అయితే అత్యంత పగడ్బందీగా జరుగుతున్నా నిఘా విభాగం అధికారులు కన్ను వేయడంతో ఎక్కడో అక్కడ దొరికిపోయేది. ఇప్పుడు ఆ పరిస్థితులులేవు. మత్తుమందు, రవాణా, చెల్లింపులు సులభం కావడంతో విక్రయాలు విపరీతంగా పెరిగిపోయాయి. మెక్సికో కేంద్రంగా రకరకాల మార్గాల్లో అన్ని దేశాల్లోకి ప్రవేశిస్తున్నది. యేటా కొకైన్, బ్రౌన్‌షుగర్ లాంటి మాదక ద్రవ్యాలు రెండువేల టన్నుల వరకు ప్రపంచవ్యాప్తంగా సరఫరా అవుతున్నట్లు అంచనా. లక్షలాది కోట్ల వ్యాపారం జరుగుతున్నది. తెలంగాణ, అటు ఆంధ్రప్రదేశ్‌లోనూ పరిస్థితి ఆందోళనకరంగా తయారవుతున్నది. ముఖ్యంగా పట్టుబడిన కేసుల్లోకూడా పటిష్టంగా వ్యవహరించకపోవడం వల్లనో, లేక చట్టంలో ఉన్న లొసుగులేమోకానీ జైళ్ల నుంచి బయటకు వచ్చి తిరిగి అదే వ్యాపారంలో కొనసాగుతున్నారు. అసలు పట్టుబడుతున్న కేసుల్లో సమర్థవంతంగా దర్యాప్తు జరిపి రుజువు చేయడంలో సంబంధిత అధికారులు విఫలం కావడం వల్ల అధికశాతం కేసులు న్యాయస్థానంలో వీగిపోతున్నాయి. ఈమహమ్మారిని పారద్రోలేందుకు ప్రత్యేక విభాగాలను ఎన్ని ఏర్పాటుచేసినా స్థానిక పోలీసుల సహకారం, తోడ్పాటు లేకుండా లక్ష్యాన్ని సాధించలేరు. స్థానిక పోలీసులను కూడా ఇందులో భాగస్వాములను చేయాలి. వారిపరిధిలో మాదకద్రవ్యాలు పెద్ద ఎత్తున పట్టుబడితే వారిని కూడా బాధ్యులను చేసే విధంగా చర్యలు ఉండాలి. ఏదిఏమైనా మానవజీవనంతో ఆటలాడుకుంటున్న ఈ మాదకద్రవ్యాలను నిరోధించే విషయంలో మాటలకే పరిమితం కాకుండా ఆచరణలో చూపాల్సిన తరుణమిది.



గతాన్ని గుర్తుపెట్టుకోనివారు, తిరిగి గతాన్ని అనుభవించవలసి వస్తుంది.

గౌతమబుద్ధ



ఆత్మ విశ్వాసం కలిగిన కొందరి చరిత్రే ప్రపంచ చరిత్ర.

స్వామి వివేకానంద

## ప్రజావాక్కు

### ఉద్యోగులలో ఆందోళనలు

నేటి సాంకేతిక యుగంలో పెరుగుతున్న ఉద్యోగ కోతలు, కృత్రిమ మేధ వల్ల కలిగే మార్పులు ఉద్యోగులలో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ఈవిఘాతం కేవలం తాత్కాలికం కాదు, ఇది ఒక తక్షణ సవాలు. దీనిని ఎదుర్కోవడానికి కేవలం నిష్క్రియాత్మక సర్దుబాట్లు సరిపోవు. సంస్థలలో పటిష్టమైనపునఃశిక్షణ కార్యక్రమాలుండాలి. ముఖ్యంగా మధ్య స్థాయి ఉద్యోగులు ఏఐ ఆధారిత విధుల్లోకి మారడానికిస్పష్టమైనమార్గాలను యాజమాన్యాలు కల్పించాలి. కొత్త సాంకేతికతలను అందిపుచ్చుకోవడం ద్వారానే వృత్తిపరమైన ఎదుగుదల సాధ్యమవుతుంది. పరిశ్రమల సంఘాలు, ప్రభుత్వం కలిసి సరసమైన ధరకే నాణ్యమైన శిక్షణను అందించాలి. సంస్థలు తమ మానవ వనరుల ప్రణాళికను పారదర్శకంగా ఉంచడం ద్వారా ఉద్యోగులలో నెలకొన్న అనిశ్చితిని తగ్గించవచ్చు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### విద్యార్థులకు అదనపు శిక్షలు

ఏపిలో కూటమి ప్రభుత్వం ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి,నూతన బోధనా ప్రక్రియలు చేపట్టి వార్షిక పరీక్షల ముందే విద్యార్థులకు తగినశిక్షణ, అదనపు ఏర్పాట్లు చేసి తద్వారా వచ్చినఉత్తమ ఫలితాలు తల్లితండ్రులకు,విద్యాభిమానులకు ఆశ్చర్యపరిచింది. ఉత్తమ ర్యాంకర్లను అభినందించేకార్యక్రమాలుపిల్లలకు ఎంతో ఉత్సాహం ,ఆనందం తృప్తిఏర్పడింది. చాలా వరకు ప్రైవేట్ సంస్థల ప్రకటనలు, వారి విద్యార్థుల ఫోటోలతో వస్తున్న మీడియాలో ప్రభుత్వపాఠశాల విద్యార్థుల ప్రతిభను ఉపాధ్యాయులు, అధికార్లు చాటిచెప్పారు. ఇదేరీతిలో ఇంటర్మీడియట్ నుండి కూడా ఆ విద్యార్థులను ప్రభుత్వ కళాశాలలోని చేరేందుకు ప్రోత్సహించి వారికి వీలైన ఆర్థిక సహాయం ప్రభుత్వం అందించి కళాశాల వనరుల అభివృద్ధి మరింత దీటుగా మెరుగు పరచాలి.

- బొల్లోజు మేఘనాదం విశాఖపట్నం

### వృద్ధులు,పసిపిల్లలు జాగ్రత్త

వేసవికాలంలో అధిక ఉష్ణోగ్రతల దృష్ట్యా ఇంట్లోని వృద్ధులు,చిన్నపిల్లలు అత్యవసరమైతే తప్ప ఆరుబయటికి వెళ్లొద్దు. రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతల ప్రభావం వలనవడదెబ్బలకు గురయ్యే అవకాశాలు ఎక్కువ. కావున వీలైనంత వరకు ఆరోగ్యంగా ఉంటూ ఇంట్లోనే సమయాన్ని గడిపేలా చూడాలని వైద్యులు చెబుతున్నారు.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### రాజకీయాల ప్రక్షాళన యువతకే సాధ్యం!

ముఖ్యంగా నేటి రాజకీయాలలో నీతి, నైతిక విలువలు అనేవి పూర్తిగా అడగంటిపోయాయి అనేది ఎవరు కాదనలేని వాస్తవం. ఎందుకంటే ఈసమాజంలో విద్యావంతులైన యువతకు భ్రష్టుపట్టిన నేటి రాజకీయాలలో ఉన్నత స్థానం అంటూ లేకుండా పోయింది. ఒక వేళ చదువుకున్న యువతకు నేటి రాజకీయాలలో అవకాశం వస్తున్న అది బహుస్వల్పమే అంటే నూటికి కేవలం 30 శాతం మాత్రమే. అదేమీ దురదృష్టమో గాని ఎక్కువగా నేటి రాష్ట్ర రాజకీయాలను అవినీతి మకిలి అంటిన వారు, దౌర్జన్యకారులు, ప్రజల ఆస్తులను కొల్లగొట్టే దుర్మార్గపు వ్యవహారశైలి వున్నవారే శాసిస్తుండటం ఈ ప్రజాస్వామ్యానికి సంబంధించి అత్యంత బాధాకరమైన,ఆందోళన కలిగించే విషయం.కాబట్టి ఈ ఆనారోగ్య,అనాగరిక పరిస్థితుల్లో మార్పురావాలంటే మరింతమంది ఉన్నత విద్యావంతులైన యువత రాజకీయాలలోకి రావాలి.

- బుగ్గన మధుసూదనరెడ్డి, నంద్యాల జిల్లా

### సంయమనం పాటించాలి

నేడుదేశంలో హత్యలు,అత్యాచార సంఘటనల్లో బాధితులపై ఎక్కడ,ఎలా జరిగాయని మీడియాలో సవివరంగా వస్తున్నాయి.దర్యాప్తు చేసే పోలీసులకు తెలుపవలసిన వివరాలన్నీ టీవీ, పేపర్ చూసే సామాన్యులకు అవసరంలేదు. సెల్ ఫోన్లలో వచ్చే ఇలాంటి దారుణ సంఘటనల ప్రసారాలన్నీ కూడా ప్రభుత్వం నియంత్రించాలి. లేకపోతే సమాజంలో బాధితుల పరిస్థితి రచ్చకెక్కి పెనంపైనుండి పొయ్యిలో పడ్డట్టవుతుంది. మరోవైపు నిందితులకు వాళ్ల పరువు పోకుండా ముసుగు వేస్తారు. టీవీల్లో 24గంటల వార్తా ప్రసారాల వల్ల సమాజంలో సున్నితత్వం, సెంటిమెంట్స్ తగ్గి తాగుడు, డ్రగ్స్ వంటి వాటి మత్తులో సైకోల హింసోన్మాదం, ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. తాము కూడా అలా నేరాలు చేసి తప్పించుకోవచ్చనే భ్రమతోకొందరు అలాంటి నేరాలకి పాల్పడుతున్నారు. కనుక గతంలోవలె టీవీలు,పత్రికలు సంయమనం పాటించిపైశాచిక సంఘటనలని సమాజానికి క్లుప్తంగా తెలపాలి.

- టి. సాంబశివరావు, గుంటూరు

### అధిక నిధులు కేటాయించాలి

తెలంగాణా రాష్ట్రంలో ఉన్న వివిధ ఆశ్రమం విద్యా సంస్థలకు అధికనిధులు కేటాయించాలి.విద్యార్థులకు త్రాగు నీరు, మరుగు దొడ్లు,బట్టలు, భూట్లు, టీషర్ట్స్,బుక్స్,నోట్స్, స్టడీ మెటీరియల్, ట్రంక్ బాక్స్, బెడ్ షీట్, వివిధ మౌలిక వసతులు కలిపించాలి. విద్య బోధన చేసే గురువులకు నివాసయోగ్యమైన వసతి కలిపించాలి.

-రాపాక రవీందర్,జనగాం

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి | ఎడిట్ పేజీకి.. | ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# దేశ రాజకీయాల్ని షేక్ చేసిన విజయ్

***తమిళనాడులో అక్షరాస్యత శాతం ఎక్కువగా ఉండటం వల్ల నేటి జంజి జనరేషన్‌కి చెందిన యువత కుల మత పార్టీలక తీతంగా టీవీకె పార్టీ విజయ్ నాయకత్వ గుణగణాలుచూసి అతి స్వల్ప కాలంలోనే విజయ్ ద్వారా తమిళనాడులోగొప్ప సామాజిక రాజకీయ పరివర్తన జరగాలని భావించినట్లుగా తాజా రాజకీయ ఫలితాలు నిరూపణ చేస్తున్నాయి. తమిళనాడుకు చెందిన హీరో స్థాయి నుండి ముఖ్యమంత్రి కాబోతున్న దళపతి విజయ్ ఆదర్శంగా తీసుకొని నిబద్ధత కలిగిన రాజీపడని రాజకీయాలని తెలుగు రాష్ట్రాల్లోని దళిత బహుజన నాయకులు చేసినట్లయితే అతి కొద్ది కాలంలోనే తెలుగు రాష్ట్రాల్లో కూడా జనాభా దామాషా ప్రకారం మెజార్టీగా 90శాతంఉన్న బీసీ ఎస్సీ,ఎస్టీలైన రాజ్యాధికారం స్థాపించడం కష్టతరమైన పని ఏమీ కాదు.***

పుల్లెంల గణేష్

రెండువేల ఇరవై ఆరు తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు భారత రాజకీయ చరిత్రలో ఒక నూతన అధ్యాయాన్ని లిఖించాయి. సుదీర్ఘ కాలంగా డీఎంకే , ఏఐఏడీఎంకే మధ్య సాగుతున్న ద్విధ్రువ రాజకీయాలకు తెరదించుతూ, తన తొలి ప్రయత్నంలోనే తమిళగ వెట్రి కళగం అధినేత సి. జోసెఫ్ విజయ్ సంచలన విజయాన్ని నమోదు చేశారు. తమిళనాడులో విజయ్ ప్రస్థానం 2026 ఎన్నికల విశ్లేషణ తమిళనాడు రాజకీయాల్లో సినిమా తారల ప్రభావం కొత్తేమీ కాకపోయినా, ఎంజీఆర్ తర్వాత ఆ స్థాయిలో ప్రజల ఆదరణ పొంది, నేరుగా ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించబోతున్న ఘనత విజయ్‌కే దక్కింది. అధికార డీఎంకే కోటను బద్దలు కొట్టి, టీవీకే పార్టీ ఘన విజయం సాధించడం వెనుక బలమైన కారణాలు ఉన్నాయి. విజయ్ తన మేనిఫెస్టోలో కేవలం హామీలు మాత్రమే కాకుండా, క్షేత్రస్థాయి సమస్యలపై దృష్టి సారించారు. అవే ఆయనను యువతకు, మహిళలకు చేరువ చేశాయి.మహిళా సంక్షేమం కోసం ప్రతి నెలా మహిళలకు 2,500 రూపాయల ఆర్థిక సాయం, పెళ్లి కానుకగా 8 గ్రాముల బంగారం పట్టుచీర హామీ మహిళా ఓటర్లను విశేషంగా ఆకర్షించింది. గ్యాస్ సబ్సిడీ భాగంగా ఏడాదికి 6 గ్యాస్ సిలిండర్లను ఉచితంగా అందజేస్తామని ప్రకటించడం పేద, మధ్యతరగతి కుటుంబాలలో భరోసా నింపింది. యువతకు ఉపాధిని కల్పించడానికి తమిళనాడును ఇండస్ట్రియల్ హబ్‌గా మార్చి లక్షలాది ఉద్యోగాల కల్పన చేస్తామన్న హామీ యువతలో ఉత్సాహం నింపింది. నీట్ రద్దు పోరాటం భాగంగా విద్యార్థుల భవిష్యత్తు కోసం నీట్ పరీక్ష రద్దుకు గట్టిగా నిలబడతామని మాటివ్వడం గ్రామీణ విద్యార్థుల మనసు గెలుచుకుంది. పాత రాజకీయ వ్యవస్థలోని అవినీతిని అంతం చేస్తానని, పారదర్శకమైన 'న్యూ ఏజ్ పాలిటిక్స్' తీసుకొస్తానని విజయ్ ఇచ్చిన పిలుపు సామాన్యులను కదిలించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం తలపతి విజయ్ జన నాయగన్ సినిమాని అనేక కారణాలతో విడుదల కాకుండా అడ్డుపడిన, కేంద్ర సంస్థలైన ఈడీతో విజయ్‌ని ముప్పు తిప్పలు పెట్టిన విజయ్ ఎక్కడ కూడా ఆత్మస్థైర్యం పోగొట్టుకోకుండా, తన అభిమానులు నిరుత్సాహ పడకుండా ఎన్నికల ప్రచారంలో భాగంగా కొండంత ధైర్యాన్ని నూరిపోశాడు. అందుచేత సినిమా ప్రపంచంలో జన నాయగన్ సినిమాని కేంద్ర ప్రభుత్వం అడ్డుకున్నా తమిళ ప్రజల గుండెల్లో కొలువై ఉన్న జోసెఫ్ విజయ్ రాజకీయ పెను భూకంపాన్ని కేంద్ర ప్రభుత్వం ఎదురుకోలేకపోయింది. విజయ్ తన రాజకీయ ప్రస్థానంలో కులం గురించి ప్రస్తావన లేకుండా మానవత్వ మే తన కులంగా చెప్పుకొని కుల మతాలకి అతీతంగా ప్రజాస్వామ్య రాజ్యాంగ మానవతా నైతిక విలువలకి కట్టుబడి తన నాయకత్వాన్ని నిర్మించుకున్నాడు. అందుకే అన్ని వర్గాల ప్రజలు విజయ్ నాయకత్వాన్ని బలపరిచారు.75 ఏళ్ల క్రితం డీఎంకే పార్టీ సాంస్కృతిక పునాదులకి అభి ముఖంగా రెండు సంవత్సరాల క్రితం పార్టీ ఏర్పాటు చేసిన దళపతి విజయ్ తమిళ వేట్రీ కజగం పార్టీ కూడా మహ నీయుల సిద్ధాంత మార్గంలోని తన సాంస్కృతిక రాజకీయ ప్రయాణం ఉంటుందని తమిళ ప్రజలనే కాదు యావత్ భారతీయుని నమ్మించగలిగాడు. ఇది విజయ్‌లోని గుణ గణాలకి నీతినిబద్ధతకి నిజాయితీగల నాయకత్వానికి నిదర్శనంగా చూడాలి. అధికారంలో ఉన్న డీఎంకే పార్టీ ఈ ఎన్నికల్లో వెనుకబడటానికి అనేక కారణాలు విశ్లేషకులు చెబుతున్నారు.



ప్రభుత్వ వ్యతిరేకత ఐదేళ్ల పాలనలో కొన్ని హామీలు నెరవేర్చకపోవడం, నిత్యావసర ధరల పెరుగుదల ప్రజల్లో అసంతృప్తిని పెంచింది. వారసత్వ రాజకీయాలపై విరక్తి పెరిగి, ఉదయనిధి స్టాలిన్ ఎదుగుదల,కుటుంబ పెత్తనంపై కొంతమంది ఓటర్లు అసహనం వ్యక్తం చేశారు. ఇది విజయ్ వంటి కొత్త నాయకుడికి కలిసొచ్చింది. విజయ్ 'మాస్' అప్పీల్ ఏంటి అంటే విజయ్‌కి ఉన్న భారీ ఫ్యాన్ బేస్ కేవలం సినిమాకే పరిమితం కాకుండా, ఒక సైన్యంలా పనిచేసింది. డీఎంకే కేడర్ కంటే టీవీకే కార్యకర్తలు క్షేత్ర స్థాయిలో చురుగ్గా వ్యవహరించారు. ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ స్వయంగా తన సొంత నియోజకవర్గం కొల్తూర్‌లో టీవీకే అభ్యర్థి చేతిలో ఓడిపోవడం డీఎంకే పతనానికి పరాకాష్టగా నిలిచింది. ఇది మాత్రమే కాకుండా కీలకమైన అంశాలు ఏంటంటే 75 ఏళ్ల డీఎంకే పార్టీ చరిత్రలో కరుణానిధి మరణ అనంతరం పెరియార్, అన్నదొరై పేర్లకు మాత్రమే ప్రాముఖ్యత ఇచ్చి అంబేద్కర్‌కి గౌరవ సామాజిక విలువని ఇవ్వకపోవడం, ఎన్నికల సందర్భంగా ఓట్ల కోసం మాత్రమే అంబేద్కర్ నామస్మరణ చేయడంతో దళితుల ఓట్లు చీలి, దళిత హీరో ఐన తలపతి విజయ్ వైపు మొగ్గు చూపారు, నిరుద్యోగ యువతలో ఉన్న ప్రభుత్వ వ్యతిరేకత విజయ్ గుణగణాలకి, నీతి నిబద్ధతకి ఆకర్షితులను చేసి డీఎంకేపార్టీ ఘోర ఓటమికి ముఖ్యమైన కారణంగా సామాజిక రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. విజయ్ విజయం తమిళనాడు రాజకీయాల్లో ఒక సరికొత్త మార్పుకు సంకేతం. కుల, మత రాజకీయాలకు అతీతంగా 'తమిళులే మన బలం' అనే నినాదంతో ఆయన ముందుకు సాగారు. సంప్రదాయ రాజకీయ పార్టీల వ్యూహాలను తిప్పికొట్టి, సామాన్యుడి గొంతుకగా మారడం వల్లే ఈ అద్భుత విజయం సాధ్యమైంది. అంతిమంగా తమిళనాడు ప్రజలు మార్పును కోరుకున్నారని ఈ తీర్పు స్పష్టం చేస్తోంది. డీఎంకే, ఏఐఏడీఎంకే వంటి దిగ్గజ పార్టీలను కాదని ఒక సినీ నటుడికి పట్టం కట్టడం అనేది సామాన్య విషయం కాదు. ఇప్పుడు అందరి దృష్టి విజయ్ పైన, ఆయన అందించబోయే 'వెట్రి' (విజయం) పాలన పైన ఉంది.అయితే తమిళనాడులో ఎక్కువ సీట్లు సాధించిన లార్జెస్ట్ పార్టీగా టీవీకే అవతరించగా, డిఎంకె 60 సీట్లతో రెండవ స్థానాన్ని, ఎఐఎడిఎంకె 47సీట్లతో మూడవ స్థానంలో ఉండగా, కాంగ్రెస్ ఐదు సీట్లు గెలుచుకుంది. లోకల్ పార్టీలు సింగిల్ డిజిట్స్ గెలుచుకున్నాయి. అయితే కాంగ్రెస్ లేదా లోకల్ పార్టీలతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం దలపతి విజయ్‌కి కష్టతరం కాదు అనే విధంగా రాజకీయ ఫలితాలున్నాయి. తమిళనాడులో దళపతి విజయ్ అతి తక్కువ కాలం నుండి ప్రభుత్వాన్ని సింగిల్ గా ఏర్పాటు చేసేలా ప్రభావం చూపిస్తాడని రాజకీయ విశ్లేషకులు మేధావులు కూడా ఊహించలేదు. కానీ తమిళనాడులో ఇలాంటి ఆశ్చర్యకరమైన రాజకీయ ప్రక్షాళన జరగడం తమిళనాడులో కొత్తేమీ కాదు. 75 ఏళ్ల స్వాతంత్ర భారతంలో ప్రాంతీయ పార్టీలైన డీఎంకే, అన్న డీఎంకే పాలన చూసి తమిళ ప్రజలు విసుగెత్తిపోయారు. అంతేకాకుండా తమిళనాడులో అక్షరాస్యత శాతం ఎక్కువగా ఉండటం వల్ల నేటి జంజి జనరేషన్‌కి చెందిన యువత కుల మత పార్టీలకతీతంగా టీవీకె పార్టీ విజయ్ నాయకత్వ గుణగణాలుచూసి అతి స్వల్ప కాలంలోనే విజయ్ ద్వారా తమిళనాడులోగొప్ప సామాజిక రాజకీయ పరివర్తన జరగాలని భావించినట్లుగా తాజా రాజకీయ ఫలితాలు నిరూపణ చేస్తున్నాయి. తమిళనాడుకు చెందిన హీరో స్థాయి నుండి ముఖ్యమంత్రి కాబోతున్న దళపతి విజయ్ ఆదర్శంగా తీసుకొని నిబద్ధత కలిగిన రాజీపడని రాజకీయాలని తెలుగు రాష్ట్రాల్లోని దళిత బహుజన నాయకులు చేసినట్లయితే అతి కొద్ది కాలంలోనే తెలుగు రాష్ట్రాల్లో కూడా జనాభా దామాషా ప్రకారం మెజార్టీగా 90శాతంఉన్న బీసీ ఎస్సీ ఎస్టీలైన రాజ్యాధికారం స్థాపించడం కష్టతరమైన పని ఏమీ కాదు. అంతిమంగా టివికే అధినేత దళపతి విజయ్ ఎన్నికల సమయంలో తాను ఇచ్చిన హామీలను ఎంత వరకు అమలు చేసి భవిష్యత్తులో తమిళనాడు రాజకీయాలనే కాదు, దేశ రాజకీయాలని ఎంతగా ప్రభావితం చేయగలడో భవిష్యత్ కాలమే సమాధానం చెప్పే వరకు వేచి చూడక తప్పదు.

# గల్ఫ్ యుద్ధం సాకుతో పెరుగుతున్న ధరలు

ఎల్లబోయిన వెంకటేశ్వర్లు

ప్రపంచవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న యుద్ధ ఉద్రిక్తతలు, ఆర్థిక అస్థిరతలకు దారితీస్తున్నాయి. కానీ ఆ ప్రభావం ఎంతవరకు సహజమో, ఎంతవరకు కృత్రిమమో అన్నది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ముఖ్యంగా వంటనూనెల ధరల పెరుగుదల నేపథ్యంలో, యుద్ధాన్నిసాకుగా చూపిస్తూ కొందరు వ్యాపారులు కృత్రిమ కొరతలు సృష్టిస్తున్నారనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. ఫలితంగా, పేద,మధ్యతరగతి ప్రజలు ధరల దోపిడీకి బలవుతున్నారు. నెల రోజుల్లోనే వంటనూనెల ధరలు దాదాపు 20-22 శాతం పెరగడం సాధారణ మార్కెట్ పరిణామం కాదు. సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ.200కు చేరడం, పామాయిల్, సోయాబీన్, రైస్‌బ్రాన్ నూనెల ధరలు వరుసగా పెరగడం ఇవి అన్నీ వినియోగదారులపై అదనపు భారాన్ని మోపుతున్నాయి. ఒకవైపు అంతర్జాతీయ మార్కెట్‌లో యుద్ధ ప్రభావం, రవాణా ఖర్చుల పెరుగుదల, ఇంధన ధరలు ఎగసిపడటం వంటి అంశాలు ఉన్నప్పటికీ, మరోవైపు దేశీయంగా కొందరు వ్యాపారులు నిల్వలను దాచిపెట్టి సరఫరాను తగ్గించడం వల్ల పరిస్థితి మరింత విషమిస్తోంది.భారతదేశం వంటనూనెల అవసరాల్లో పెద్ద భాగాన్ని దిగుమతుల ద్వారానే తీర్చుకుంటోంది. అందువల్ల గ్లోబల్ మార్కెట్‌లో చిన్న మార్పుకూడా దేశీయ ధరలపై ప్రభావం చూపుతుంది. కానీ ఈ సహజ ప్రభావాన్నిమించి, కృత్రిమ కొరతలు సృష్టించడం ద్వారా ధరలను పెంచడం అనేది వ్యాపార నైతికతకు విరుద్ధం. ఇది కేవలం ఆర్థిక దోపిడీ మాత్రమే కాదు ప్రజల జీవన ప్రమాణాలను దెబ్బతీసే సామాజిక అన్యాయం.ఇప్పటికే గ్యాస్ సిలిండర్ ధరలు, రవాణాఖర్చులు, ఇతర నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిన నేపథ్యంలో, వంటనూనెల ధరల పెరుగుదల కుటుంబ బడ్జెట్‌ను పూర్తిగా దెబ్బతీస్తోంది. ముఖ్యంగా తక్కువ ఆదాయం కలిగిన కుటుంబాలకు ఇది జీవన పోరాటంగా మారింది.రోజువారీ ఖర్చులను సమతుల్యం చేసుకోవడం కష్టసాధ్యంగా మారుతోంది.ఈ నేపథ్యంలో ప్రభుత్వ పాత్ర అత్యంత కీలకం. మార్కెట్‌లో జరుగుతున్న అక్రమాలను అరికట్టేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలి. గిడ్డంగులపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం,స్టాక్ లిమిట్లు విధించడం,కృత్రిమ కొరతలు సృష్టించే వ్యాపారులపై కఠినచర్యలు తీసుకోవడం అవసరం. ధరల నియంత్రణ కోసం పారదర్శక వ్యవస్థను అమలు చేయడం ద్వారా వినియోగదారులకు న్యాయం చేయాలి. దీర్ఘకాలిక పరిష్కారంగా దేశీయంగా ఆయిల్‌సీడ్స్ ఉత్పత్తిని పెంచడం అత్యవసరం. రైతులకు ప్రోత్సాహకాలు, సాంకేతిక సహాయం అందించడం ద్వారా దిగుమతులపై ఆధారాన్ని తగ్గించవచ్చు. వినియోగదారులు కూడా అప్రమత్తంగా ఉండాలి. అవసరానికి మించి కొనుగోలు చేయడం, నిల్వ చేసుకోవడం వంటి చర్యలు మార్కెట్‌లో మరింత కొరతను పెంచుతాయి. కాబట్టి బాధ్యతాయుత వినియోగంకూడా సమానంగా ముఖ్యం.మొత్తంగా,యుద్ధం ఒక కారణం కావచ్చు కానీ అది ధరల దోపిడీకి న్యాయం చేయదు. కృత్రిమ కొరతలు సృష్టించడం ద్వారా ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం అసహనీయమైన చర్య.

# 'సంయమన శక్తి'కి నిదర్శనమే 'సిందూర్'

సయ్యద్ అతా హుస్సైన్

ఆపరేషన్ సింధూర్' వార్షికోత్సవం గుర్తుంచుకోవాల్సిన తేదీ మాత్రమే కాదు, భారత వ్యూహాత్మక దృక్పథంలో వచ్చిన బలమైన, నిర్ణయాత్మకమైన మార్పుకు ప్రతిబింబం. అనేక విధాలుగా, సంక్లిష్టమైన, బహుముఖ సవాళ్ల మధ్య భవిష్యత్తులో యుద్ధాలను లేదా సంఘర్షణలను భారత్ ఎలా ఎదుర్కోవాలో చెప్పేందుకు నిర్వచనంగా ఆపరేషన్ సింధూర్ నిలిచిపోతుంది. ఈ విజయం వెనుక ఉన్నప్రధాన కారణం తడబాటు లేని రాజకీయ స్పష్టత. దశాబ్దాలుగా, శత్రువుల రెచ్చగొట్టే చర్యలకు భారత్ స్పందించే తీరు తరచుగా స్వయంగా విధించుకున్న పరిమితులకు లోబడే ఉండేది. ఆపరేషన్ సింధూర్ ద్వారా భారత్ తన సంయమనాన్ని వీడలేదు, కానీ దానిని మరింత మెరుగుపరిచింది. అవసరమైన మేరకే శక్తిని ఉపయోగిస్తూనే, ఒక ఖచ్చితమైన వ్యూహాత్మక సందేశాన్ని శత్రువుకు పంపగలమని భారత్ నిరూపించింది. అదే సమయంలో, అవసరమైతే ఈ పోరాటాన్ని మరింత ఉధృతం చేసే సామర్థ్యం కూడా ఉందని స్పష్టంగా చాటిచెప్పింది. రాజకీయ నాయకత్వం కేవలం నిర్ణయాత్మక చర్య తీసుకోవాలనే ఉద్దేశాన్ని చూపడమే కాకుండా, క్షేత్రస్థాయిలో ఉన్న సైనిక కమాండర్లకు పూర్తి కార్యాచరణ స్వేచ్ఛను ఇచ్చే అంతటి ఆత్మవిశ్వాసాన్ని ప్రదర్శించింది. లక్ష్యం పట్ల ఉన్న ఈ స్పష్టత.. వేగం, ఖచ్చితత్వం, సమన్వయంగా మారింది. ఆధునిక సైనిక పోరాటాల విజయానికి ఈమూడు లక్షణాలే అత్యంత కీలకం.రాజకీయ సంకల్పానికి వ్యవస్థాగత సామర్థ్యం తోడైనప్పుడు అది దేశ బలాన్ని ఎన్నో రెట్లు పెంచుతుంది. ఆపరేషన్ సింధూర్ ఈ అద్భుతమైన సమన్వయానికి ఒక గొప్ప ఉదాహరణగా నిలిచింది. అంతే ప్రాముఖ్యత కలిగిన మరొక అంశం, భారతదేశం తన బహుముఖ సామర్థ్యాలను అత్యంత సమర్థవంతంగా అనుసంధానించడం. నేటి ఆధునిక యుద్ధం భూమి, నీరు, ఆకాశానికే పరిమితం కాలేదు. సైబర్, అంతరిక్షం, ఎలక్ట్రోమాగ్నెటిక్ స్పెక్ట్రమ్కు కూడా విస్తరించింది. ఈవిభిన్న రంగాల్లో తన పట్టును ప్రదర్శించడంలో దేశానికున్న ప్రావీణ్యాన్ని ఆపరేషన్ సింధూర్ నిరూపించింది. ఖచ్చితమైన దాడులతో పాటుశత్రువుల సమాచార వ్యవస్థ,సరఫరా గొలుసును దెబ్బతీసే సైబర్ ఆపరేషన్లు తోడయ్యాయి. ఎప్పటికప్పుడు నిఘా, లక్ష్యాలను గుర్తించడంలో అంతరిక్ష వనరులు కీలక పాత్ర పోషించాయి. లక్ష్యాల్ని గుర్తించడంతో పాటు దాడి తర్వాత జరిగిన నష్టాన్ని అంచనా వేయడంలోనూ క్రియాశీలకంగా పని చేశాయి. అదే సమయంలో, ఎలక్ట్రానిక్ వార్ఫేర్ సామర్థ్యాలు శత్రువుల స్పందనను బలహీనపరిచాయి. ఈ ఆపరేషన్ భారత దళాల మధ్య కేవలం సమన్వయాన్నే కాదు, సమష్టి పనితీరు, పరిణతిని ప్రతిబింబించింది. ఈ సమయంలో సివిల్‌సైనిక వ్యవస్థల ఏకీకరణ పోషించిన పాత్ర ప్రత్యేకంగా గమనించాలి. ఆపరేషన్ సింధూర్ కేవలం సైనిక ప్రయత్నమే కాదు, దేశం మొత్తం కలిసి చేసిన కృషి. నిఘా సంస్థలు, సాంకేతిక సంస్థలు, పౌర నాయకత్వం, సాయుధ దళాలతో కలిసి పనిచేశాయి. నిఘా వ్యవస్థల నుంచి ఖచ్చితమైన ఆయుధాల వరకు స్వదేశీ సాంకేతికతలు కీలక పాత్ర పోషించాయి, ఇది స్వయంసమృద్ధిపై మనం నిరంతరం పెట్టిన పెట్టుబడి ఫలితాన్ని చూపించింది. ఈ ఆపరేషన్ భారత నిర్ణయాధికార నిర్మాణంలోని సామర్థ్యాన్ని కూడా ప్రదర్శించింది.



ఇక్కడ వివిధ ఏజెన్సీల మధ్య సమన్వయం, బ్యూరోక్రాటిక్ జాప్యాలకు తావు లేకుండా ఒకే లక్ష్యంతో సాగింది. ఆపరేషన్ ప్రారంభానికి ముందే భారతదేశం ఎంతో దూరదృష్టితో వ్యవహరించింది. మనం తీసుకునే చర్యలను ప్రపంచం ఏవిధంగా చూస్తుందనే విషయంలో భారత్ చాలా జాగ్రత్తగా వ్యవహరించింది. మన దౌత్యవేత్తలు ప్రపంచ దేశాలతో నిరంతరం సంప్రదింపులు జరిపి, భారత్ చేస్తున్న ఈ పోరాటం ఎవరినో ఆక్రమించుకోవడానికికాదని, శత్రువుల రెచ్చగొట్టే చర్యలకు సమాధానంగా చేస్తున్న 'అవసరమైన ఆత్మరక్షణ' అని స్పష్టంగా వివరించారు. దీనివల్ల అంతర్జాతీయ సమాజం కూడా భారత్ తీసుకున్న నిర్ణయం సరైనదేనని గుర్తించింది. ఇలా సైనిక శక్తికి, రాజకీయనేర్పు, దౌత్యనీతి తోడవ్వడం వల్లే ఆపరేషన్ సింధూర్ ఒక చారిత్రక విజయంగా నిలిచింది. దీనికి భిన్నంగా, పాకిస్థాన్ స్పందన ముందే ఊహించినట్లుగా సాగింది. సైనిక పరంగా చూస్తే, భారత్ మెరుపుదాడికి ఆ దేశం కంగుతిన్నది. తమ దగ్గర ఉన్న అరకొర వనరులు, సరిపోని యుద్ధ సామర్థ్యం వల్ల భారత్ను సమర్థంగా ఎదుర్కోవడంలో పాకిస్థాన్ విఫలమైంది. ఇక దౌత్యపరంగా, ఈ అంశాన్ని అంతర్జాతీయ వేదికలపైకి తీసుకెళ్లి ప్రపంచ దేశాల మద్దతు కూడగట్టాలని చూసినా అనుకున్న ఫలితం సాధించలేదు. అయితే, పాకిస్థాన్ ఎక్కువగా దృష్టి పెట్టింది మాత్రం'సమాచార యుద్ధం' మీదనే. క్షేత్రస్థాయిలో జరిగిన అసలు విషయాలను దాచిపెట్టడానికి, వారు తెలివిగా అల్లిన ఎన్నో అబద్ధాలను ప్రచారం చేశారు. కానీ,వారి మాటల్లో నిజాయితీ, పొంతన లేకపోవడంతో ఆ ప్రయత్నాలు ఫలించలేదు. ఆపరేషన్ సింధూర్ అనేది భారతదేశం కావాలనిచేసిన దురాక్రమణకాదు. శత్రువులను ప్రత్యక్షంగా రెచ్చ గొట్టే చర్యలకు భారత్ ఇచ్చిన సరైన సమాధానం. ఈ ఆపరేషన్ లక్ష్యాలు చాలా స్పష్టమైనవి, ఎంచుకున్న స్థావరాలు చట్టబద్ధమైనవి, దీనిని అత్యంత క్రమశిక్షణతో నిర్వహించారు. భారతదేశం ఎప్పుడూ హద్దులు దాటలేదు. అవసర మైన మేరకు మాత్రమే స్పందిస్తూ, అత్యంత సంయమనం తో వ్యవహరించింది. ఆపరేషన్ జరిగినంత కాలం భారత్ నిజమైన సమాచారాన్ని మాత్రమే వెల్లడించింది. ఎంతో పారదర్శకతను పాటిస్తూ, విశ్వసనీయమైన మార్గాల ద్వారా అసలు విషయాలను ప్రపంచానికి తెలియజేయడం వల్ల, వాస్తవాలను వక్రీకరించే శత్రువుల ప్రయత్నాలు పూర్తిగా విఫలమయ్యాయి. ఆపరేషన్ సింధూర్ భవిష్యత్తుకు మార్గనిర్దేశం చేసే కొన్ని విలువైన పాఠాలను నేర్పింది. మొదటిది, రాజకీయ సంకల్పం అత్యంత కీలకం. మనం ఏ విషయంలోనైనా అస్పష్టంగా ఉంటే అది శత్రువులకు బలాన్నిస్తుంది. అదే స్పష్టమైన వైఖరితో ఉంటే వారు భయపడతారు. యుద్ధతంత్రంలో కేవలం సైన్యమే కాదు, సైబర్, అంతరిక్షం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి ఆధునిక రంగాల్లో కూడా మనం పట్టు సాధించాలి. భవిష్యత్తులో మన ఆధిక్యాన్ని నిలబెట్టుకోవడానికి ఈ రంగాల్లో పెట్టుబడులు చాలా అవసరం. దేశంలోని పౌర, సైనిక వ్యవస్థలు మరింతగా కలిసి పని చేయాలి. జాతీయ శక్తిని ఒక పద్ధతి ప్రకారం సమన్వయం చేసుకున్నప్పుడే మనం ఏసవాలునైనా సమర్థంగా ఎదుర్కోగలం. తప్పుడు సమాచారాన్ని గుర్తించడానికి, దానిని తిప్పికొట్టడానికి,అది వ్యాప్తిచెందక ముందే అడ్డుకోవడానికి భారతదేశం తన సామర్థ్యాలను మరింత బలోపేతం చేసుకోవాలి. దీనికోసం కేవలం అత్యాధునిక సాంకేతిక పరికరాలు ఉంటే సరిపోదు, వేగవంతమైన, నమ్మదగ్గ సమాచారాన్ని ప్రజలకు చేరవేసే బలమైన వ్యవస్థలు కూడా ఉండాలి. ఆపరేషన్ సింధూర్ వారసత్వం కేవలం ఆసమయంలో దక్కిన విజయానికే పరిమితం కాలేదు.అది మనలో నింపిన ఆత్మవిశ్వాసంలో,దేశంలోని రాజకీయ, సైనిక,వ్యవస్థాగత యంత్రాంగాలు అన్నీఒకే తాటిపైఉండి,పూర్తిస్పష్టతతో, ఒకే లక్ష్యంతో తమ శక్తినంతా సమన్వయం చేసుకున్నంతకాలం, ఆ ప్రభావం సమతుల్యత భారత్‌కు అనుకూలంగానే ఉంటుంది.

(రచయిత : లెఫ్టినెంట్ జనరల్ (రిటైర్డ్))

# తమిళనాట రిసార్టు రాజకీయం

## - ఎమ్మెల్యేలను రిసార్టుకు తరలించిన అన్నా డీఎంకె
## - టివికెకు మద్దతు ప్రసక్తి లేదు : కెపి మునుసామి

**చెన్నై, మే 7:** తమిళనాడు రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. నూతనంగా ఎన్నికైన 12 మందికి పైగా అన్నాడీఎంకే ఎమ్మెల్యేలను పుదుచ్చేరిలోని ఒక రిసార్టుకు తరలించడంతో తీవ్ర గందరగోళం మొదలైంది. నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే)కు ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతు ఇచ్చే విషయంలో పార్టీలో విభేదాలు తలెత్తాయనే ఊహాగానాలకు ఈ పరిణామం బలం చేకూర్చింది. ఈ వార్తలను తర్వాత విజయ్ పార్టీకి మద్దతుపై పార్టీ అధినేత ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) తొలుత మౌనంగా ఉండటంతోనే ఈ గందరగోళం తలెత్తిందని అన్నాడీఎంకే ర్గాలు తెలిపాయి. ఆయన మౌనం కారణంగా కొందరు ఎమ్మెల్యేలు విజయ్‌కు మద్దతు ఇవ్వాలని భావిస్తున్నారనే ప్రచారం జరిగిందని



అన్నాడీఎంకే నాయకత్వం తీవ్రంగా ఖండించింది. పార్టీలో ఎలాంటి విభేదాలు లేవని, అంతా సవ్యంగానే ఉందని స్పష్టం చేసింది. టీవీకే తమ ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టే అవకాశం ఉందని, వారిని కాపాడుకోవడానికే రిసార్టుకు తరలించామని వివరణ ఇచ్చింది. "టీవీకేకు అన్నాడీఎంకే ఎలాంటి మద్దతు ఇవ్వడం లేదు. పార్టీ చీఫ్ ఈపీఎస్ ఆమోదంతో ఈ విషయం ప్రకటిస్తున్నాను" అని సీనియర్ నేత కేపీ మునుసామి స్పష్టం చేశారు. ఎన్నికల ఫలితాల అంగీకరించాయి. ఇప్పుడు ఈపీఎస్ తన వైఖరిని స్పష్టం చేశారని, టీవీకేకు మద్దతు ఇచ్చే ప్రసక్తే లేదని చెప్పడంతో ఎమ్మెల్యే లంతా ఆయన నిర్ణయానికి కట్టుబడి ఉన్నారని ఆ వర్గాలు వివ రించాయి.

అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే 108 స్థానాలు గెలుచుకుని అతిపెద్ద పార్టీగా అవతరించింది. అయితే, ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన 118 మంది ఎమ్మెల్యేల మ్యాజిక్ ఫిగర్‌కు 10 స్థానాల దూరంలో నిలిచిపోయింది. దీంతో కాంగ్రెస్ (5), వామపక్షాలు (4), వీసీకే (2) పార్టీల మద్దతు కూడగట్టే ప్రయత్నాల్లో విజయ్ ఉన్నారు. బీజేపీతో గతంలో పొత్తు పెట్టుకున్న అన్నాడీఎంకే మద్దతు కోరడానికి విజయ్ సిద్ధంగా లేరని, దానివల్ల భవిష్యత్తులో బీజేపీ ప్రభావం తన ప్రభుత్వంపై పడుతుందని ఆయన భావిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన 118 మంది ఎమ్మెల్యేల జాబితాను సమర్పిస్తేనే ఆహ్వానిస్తామని విజయ్‌కు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ సూచించినట్లు సమాచారం. దీంతో తమిళనాట ప్రభుత్వ ఏర్పాటుపై ఉత్కంఠ కొనసాగుతోంది.

### ప్రభుత్వ ఏర్పాటుకు టివికెను ఆహ్వానించాలి!
### డిఎంకె, సిపిఐ, విసికె పార్టీలు గవర్నర్‌కు విజ్ఞప్తి

అసెంబ్లీ ఎన్నికల లో సింగిల్ లార్జెస్ట్ పార్టీగా నిలిచిన టీవీకే పార్టీ కి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే అవకాశం ఇవ్వాలని, ఆ పార్టీ అధ్యక్షుడు విజయ్ ని ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడానికి ఆహ్వానించాలని డీఎంకే, సీపీఐ, వీసీకే పార్టీలు గవర్నర్ కు విజ్ఞప్తి చేశాయి. అసెంబ్లీలో తన మెజారిటీని నిరూపించుకోవడానికి అవకాశం ఇవ్వాలని సూచించాయి. తమిళనాడులో ప్రభుత్వ ఏర్పాటుపై గవర్నర్ మెజారిటీ మెలికి పెడుతుండటంతో ప్రభుత్వం ఏర్పాటు చేయడంతో జాప్యం జరుగుతోంది. ఈ క్రమంలో వివిధ పార్టీలు స్పందించాయి. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి విజయ్‌కి అవకాశమివ్వాలని వీసీకే గవర్నర్‌ను కోరింది. ప్రభుత్వానికి సహకరించే అవకాశంపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు. ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి సింగిల్ లార్జెస్ట్ పార్టీగా టీవీకేకు తొలుత అవకాశమివ్వాలని డీఎంకే కూడా స్పష్టం చేసింది. గవర్నర్ రాజ్యాంగ పరిధిలో వ్యవహరించాలని సీపీఐ డిమాండ్ చేసింది. ప్రజలు ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ ఇవ్వలేదని, కానీ 108 స్థానాలు గెలుచుకున్న టీవీకేకు మొదట అవకాశమివ్వాలని పేర్కొన్నది. విజయ్ ఇప్పటికే రెండుసార్లు గవర్నర్‌ను కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి ఆహ్వానించాలని కోరారని గుర్తుచేసింది. విజయ్ ప్రమాణ స్వీకారం చేయకముందే మెజారిటీ నిరూపించుకోవాలని గవర్నర్ ఒత్తిడి చేయడం సరికాదని అభిప్రాయపడింది. దీన్ని సీపీఐ వ్యతిరేకిస్తోందని పేర్కొన్నది. అత్యధిక స్థానాలు గెలిచిన విజయ్‌కి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే అవకాశమివ్వాలని, ఆ తర్వాత సభలో మెజారిటీ నిరూపించుకోవడానికి ఛాన్స్ ఇవ్వాలని కోరింది. తమిళనాడులో ఏకైక అతిపెద్ద పార్టీగా టీవీకేను ప్రజలు ఎన్నుకున్నారని, అందువల్ల విజయ్‌కి మొదట అవకాశం ఇవ్వాలని వీసీకే అధ్యక్షుడు తిరుమావళవన్ అన్నారు. గవర్నర్ ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం గందరగోళానికి తావిస్తోందని తిరుమావళన్ అన్నారు. విజయ్‌ని ఆహ్వానించకపోవడం ఆమోదయోగ్యం కాదని చెప్పారు. ప్రధాని నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్ షా రాజకీయ ఒత్తిడి తెస్తున్నారేమోనని ప్రజలకు అనుమానం కలుగుతోందని తమిళనాడు యూత్ కాంగ్రెస్ మరో ప్రకటనలో పేర్కొన్నది. గవర్నర్ నిబంధనల ప్రకారం నడుచుకోవాలని, అత్యధిక మెజారిటీ ఉన్న పార్టీని ప్రభుత్వ ఏర్పాటు కోసం ఆహ్వానించాలని సూచించింది. ప్రభుత్వ ఏర్పాటుకు టీవీకేను ఆహ్వానించకపోతే యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన చేపడతామని, గవర్నర్ ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించింది.



# సువేందు పిఎ హత్య కేసుపై సిఐడి దర్యాప్తు

**కోల్‌కత్తా, మే 7:** పశ్చిమ బెంగాల్ బీజేపీ నేత, ప్రతిపక్ష నాయకుడు సువేందు అధికారి వ్యక్తిగత సహాయకుడు (పీఏ) చంద్రనాథ్ రథ్ దారుణ హత్య కేసు దర్యాప్తును రాష్ట్ర సీఐడీ (క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్) చేపట్టింది. నార్త్ 24 పరగణాల జిల్లాలో జరిగిన ఈ ఘటనపై సీఐడీ అధికారులు విచారణను స్వీకరించారు. ఈ హత్య వెనుక పక్కా ప్రణాళిక ఉన్నట్లు ప్రాథమిక ఆధారాలు సూచిస్తున్నాయి. బుధవారం రాత్రి బీజేపీ కార్యక్రమం ముగించుకుని చంద్రనాథ్ రథ్ తన కారులో ఇంటికి బయలుదేరారు. మధ్యమ్‌గ్రామ్‌లోని దోహరియా క్రాసింగ్ వద్దకు రాగానే, ఆయన వాహనాన్ని మరో కారు అడ్డగించింది. అదే సమయంలో హెల్మెట్ ధరించిన ఓ వ్యక్తి బైక్‌పై వచ్చి రథ్ కారు పక్కన ఆగి, అతి సమీపం నుంచి విచక్షణారహితంగా కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో రథ్ అక్కడికక్కడే మృతి చెందగా, కారు డ్రైవర్ బుద్ధదేవ్ బేరా తీవ్రంగా గాయపడ్డారు. దాడికి ఉపయోగించిన కారు, బైక్‌లకు నకిలీ నంబర్ ప్లేట్లు ఉన్నాయని రాష్ట్ర డీజీపీ సిద్ధ్ నాథ్ గుప్తా ధ్రువీకరించారు. ఘటనా స్థలం నుంచి కొన్ని వాడిన తూటాలు, బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నామని, దర్యాప్తు దృష్ట్యా మరిన్ని వివరాలు వెల్లడించలేమని ఆయన తెలిపారు. గురువారం ఉదయం ఘటనా స్థలానికి చేరుకున్న సీఐడీ అధికారులు, ఆ ప్రాంతాన్ని తమ అధీనంలోకి తీసుకున్నారు. సమీపంలోని సీసీటీవీ కెమెరాల ఫుటేజీలను, హౌసింగ్ కాంప్లెక్స్‌ల బయట ఉన్న కెమెరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఈ హత్యకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్ ద్వారా కొన్ని కీలక ఆధారాలు లభించినట్లు పోలీసులు తనకు తెలిపారని సువేందు అధికారి పేర్కొన్నారు.

**433 మంది అరెస్టు..1100మందికిపైగా నిర్బంధం**

తన కొడుకును కోల్పోయిన చంద్రనాథ్ తల్లి హాసిరాణీ రథ్ విలేకరుల ముందు కన్నీరుమున్నీరయ్యారు. మమతా బెనర్జీ ఓటమిని తట్టుకోలేక తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) నాయకులే పక్కా ప్లాన్‌తో తన కొడుకును హింసించి చంపారని ఆమె ఆరోపించారు. మే 4 తర్వాత మిమ్మల్ని ఢిల్లీ నాయకులకు కూడా కాపాడలేరంటూ టీఎంసీ నేతలు ముందు నుంచే బెదిరింపులకు పాల్పడ్డారని ఆమె పేర్కొన్నారు. నిందితులకు ఉరిశిక్ష కాకుండా జీవిత ఖైదు పడాలని, అప్పుడే వారు చేసిన తప్పుకు రోజూ కుమిలిపోతారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ హత్య తర్వాత బెంగాల్ పోలీసులు రాష్ట్రవ్యాప్తంగా భారీగా తనిఖీలు చేపట్టారు. ఇప్పటివరకు 433 మందిని అరెస్టు చేయగా, 1,100 మందికి పైగా వ్యక్తులను నిర్బంధంలో ఉంచారు. ఈ ఘటనపై 200కు పైగా ఎఫ్ఐఆర్లు నమోదయ్యాయి. ఈ ఘటనపై సువేందు అధికారి స్పందిస్తూ.. ఇది పక్కాగా ప్లాన్ చేసి చేసిన రాజకీయ హత్య అని, తనకు ఇది వ్యక్తిగతంగా తీరని లోటని పేర్కొన్నారు. అయితే బీజేపీ శ్రేణులు సంయమనం పాటించాలని ఆయన కోరారు. మరోవైపు టీఎంసీ ఈ ఆరోపణలను ఖండిస్తూ, ప్రజాస్వామ్యంలో హింసకు తావులేదని, కోర్టు పర్యవేక్షణలో విచారణ జరగాలని డిమాండ్ చేసింది.

# కేరళం సిఎం రేసులో త్రిముఖ పోరు

## - మీరే తేల్చండి.. కాంగ్రెస్ ఎల్పీ ఏకగ్రీవ తీర్మానం
## - సతీషన్, వేణుగోపాల్, రమేష్ చెన్నితాల మధ్య పోటీ



**తిరువనంతపురం, మే 7:** కేరళం తదుపరి ముఖ్యమంత్రి పదవి కోసం పోరు ఇప్పుడు పూర్తిగా న్యూఢిల్లీకి మారింది. నాయకత్వ సమస్యపై తుది నిర్ణయం తీసుకునే అధికారాన్ని పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు అప్పగిస్తూ కాంగ్రెస్ శాసనసభ పక్షం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. గురువారం తిరువనంతపురంలో నిర్వహించిన కీలక శాసనసభ పక్ష సమావేశంలో, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు సన్నీ జోసెఫ్ సంప్రదాయబద్ధంగా ఒకే వాక్యంతో కూడిన తీర్మానాన్ని ప్రవేశపెట్టగా, వి.డి. సతీసన్ దానిని బలపరచడంతో అది ఏకగ్రీవంగా ఆమోదం పొందింది. కానీ సీనియర్ నాయకుడు సతీసన్, ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కె.సి. వేణుగోపాల్, సీనియర్ నాయకుడు రమేష్ చెన్నితాల మధ్య తీవ్రమైన త్రిముఖ పోటీ నెలకొని ఉంది. పార్టీ పరిశీలకులైన అజయ్ మాకెన్, ముకుల్ వాస్నిక్, దీపా దాస్ మున్షీ, హైకమాండ్‌కు తమ నివేదికను సమర్పించే ముందు, మద్దతు సరళిని, రాజకీయ ప్రాధాన్యతలను అంచనా వేయడానికి కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలను వ్యక్తిగతంగా కలిశారు. గత ఐదేళ్లుగా ప్రతిపక్షానికి నాయకత్వం వహించిన సతీసన్ ప్రజల్లో అత్యంత ప్రముఖ అభ్యర్థిగా నిలిచినప్పటికీ, శాసనసభ పక్షంలో సంఖ్యాబలం వేణుగోపాల్‌కు అనుకూలంగా ఉందని భావిస్తున్నారు. సతీసన్‌ను ముఖ్యమంత్రిగా నియమించాలని డిమాండ్ చేస్తూ తిరువనంతపురం, ఎర్నాకులం, తదితర అనేక కేంద్రాలలో కాంగ్రెస్ కార్యకర్తలు కాగడా ప్రదర్శనలు నిర్వహించారు. ప్రభుత్వ వ్యతిరేకతను ఆయన విజయవంతంగా ఓట్లుగా మార్చారని ఆయన మద్దతుదారులు వాదిస్తున్నారు. అయితే, సంస్థాగత బలం, కేంద్ర నాయకత్వంతో ఉన్న సాన్నిహిత్యం వేణుగోపాల్‌కు అనుకూలంగా పనిచేస్తున్నట్లు కనిపిస్తోంది. ప్రభావవంతమైన రాష్ట్ర నాయకులతో పాటు, కొత్తగా ఎన్నికైన పలువురు ఎమ్మెల్యేలు ఆయన అభ్యర్థిత్వానికి మద్దతు తెలిపారని వర్గాలు సూచిస్తున్నాయి. ఢిల్లీలో అపారమైన పలుకుబడి కలిగిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎ.కె. ఆంటోనీ జోక్యం ఈ పోటీకి మరో మలుపును జోడిస్తోంది. ఢిల్లీలో ఆయన అభిప్రాయానికి అపారమైన ప్రాధాన్యత ఉంది. ఆంటోనీ, చెన్నితాల సీనియారిటీ, పరిపాలనా అనుభవాన్ని ఉటంకిస్తూ ఆయనకు అనుకూలంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. సీనియర్ నాయకుడు వి.ఎం. సుధీరన్ మద్దతు చెన్నితాల వాదనను మరింత బలోపేతం చేసింది. దశాబ్ద కాలం తర్వాత కాంగ్రెస్ భారీ మెజారిటీతో తిరిగి అధికారంలోకి రావడంతో, కేరళ తదుపరి ముఖ్యమంత్రిని ప్రకటించే ముందు ప్రజాభిప్రాయం, శాసనసభ మద్దతు, సీనియారిటీల మధ్య సమతుల్యం సాధించే సున్నితమైన సమస్యను ఇప్పుడు పార్టీ హైకమాండ్ ఎలా పరిష్కరిస్తుందో వేచిచూడాలి.


# ఆర్థికసంక్షోభంలోకి నెట్టిన 'ఆపరేషన్ సిందూర్'

**ఇస్లామాబాద్, మే 7:** పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థను ఆపరేషన్ సిందూర్ తీవ్ర సంక్షోభంలోకి నెట్టింది. 2025 మే నెలలో చేపట్టిన ఈ చర్య కారణంగా పెట్టుబడులు, పర్యాటకం, విమానయానం, ఎగుమతుల రంగాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని గ్రీస్‌కు చెందిన గ్రీస్ సిటీ టైమ్స్ అనే మీడియా సంస్థ తన నివేదికలో వెల్లడించింది. ఈ ఆపరేషన్ కారణంగా పాకిస్థాన్‌లో ద్రవ్యోల్బణం పెరిగి, ఆర్థిక వృద్ధి మందగించి, ఇప్పటికే బలహీనంగా ఉన్న ఆర్థిక పునాదులు మరింత క్షీణించాయని నివేదిక విశ్లేషించింది. అధిక అప్పులు, విదేశీ మారకద్రవ్య నిల్వల కొరత, అంతర్జాతీయ సహాయంపై ఆధారపడటం వంటి సమస్యలతో ఇప్పటికే సతమతమవుతున్న పాక్ ఆర్థిక వ్యవస్థపై ఆపరేషన్ సిందూర్ మరింత భారాన్ని మోపింది. గత మూడేళ్లుగా ఆ దేశ జీడీపీ వృద్ధి సగటున 3 శాతం వద్దే స్తబ్దుగా ఉందని, పారిశ్రామిక ప్రగతి మందగించిందని నివేదిక గుర్తుచేసింది. ఈ సైనిక చర్యతో దేశంలో అనిశ్చితి పెరిగి, పెట్టుబడిదారులు వెనక్కి తగ్గారు. ఈ సైనిక చర్య ప్రత్యక్ష ప్రభావం పర్యాటక రంగంపై పడింది. అంతర్జాతీయ పర్యాటకులు తమ పర్యటనలను రద్దు చేసుకోవడంతో హోటళ్లు, రెస్టారెంట్లు, టూర్ ఆపరేటర్లు, పర్యాటకంపై ఆధారపడిన స్థానిక వర్గాలు తీవ్రంగా నష్టపోయాయి. మరోవైపు, విమానయాన రంగం కూడా తీవ్ర ఒడుదొడుకులను ఎదుర్కొంది.

# కేరళం సిపిఎంలో ముసలం

## - విజయన్‌పై పెరుగుతున్న వ్యతిరేకత - ఎల్‌డిఎఫ్ ఘోరపరాజయంపై విమర్శలు
## - పార్టీని కాపాడండంటూ పోస్టర్లు - రంగంలోకి సీనియర్ నేత జయరాజన్

**తిరువనంతపురం, మే 7:** కేరళం అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం పాలైన తర్వాత ఎల్‌డిఎఫ్‌లో లుకలుకలు బయటపడుతున్నాయి. ప్రధానంగా ఎల్‌డిఎఫ్‌కు నేతృత్వం వహిస్తున్న సిపిఎం నాయకత్వం, ముఖ్యంగా మాజీ సిఎం పినరయి విజయన్‌పై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇటీవల ఎన్నికల్లో ఎల్‌డిఎఫ్ కేవలం 35 సీట్లకే పరిమితమైంది. దీంతో పినరయి విజయన్‌పై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సిపిఎం ప్రస్తుత రాష్ట్ర నాయకత్వంపైనా పార్టీలో ఆగ్రహం వ్యక్తమవుతోంది. విజయన్, రాష్ట్ర సిపిఎం కార్యదర్శి ఎం.వి. కేరళలో వామపక్షాలు తమ చరిత్రలోనే అత్యంత ఘోరమైన ఎన్నికల



పరాజయాన్ని చవిచూసిన తర్వాత, గోవిందన్ పార్టీలోనే అపూర్వమైన విమర్శలను ఎదుర్కొంటున్నారు. సిపిఎంకు సుదీర్ఘకాలంగా సైద్ధాంతిక కంచుకోటగా పరిగణించబడుతున్న కన్నూర్‌లో, జయరాజన్ తిరిగి నాయకత్వంలోకి రావాలని డిమాండ్ చేస్తూ పోస్టర్లు వెలిశాయి. ప్రముఖంగా ప్రదర్శించబడిన ఒక నినాదం, "పి. జయరాజన్‌ను పిలవండి, పార్టీని కాపాడండి" అని ఉంది. కన్నూర్ జిల్లా కార్యదర్శి కె.కె. రాగేష్‌పై కూడా కార్యకర్తలలో అసంతృప్తి పెరుగుతోంది.



## ఆపరేషన్ సిందూర్‌తో మన సైనిక సత్తాపై పాక్‌కు వణుకు

### యేడాది పూర్తయిన సందర్భంగా మీడియాతో త్రివిధ దళాధిపతులు

**జైపూర్, మే 7:** ఆపరేషన్ సింధూర్ చేపట్టి నేటికి ఏడాది అయిన సందర్భం పురస్కరించుకుని త్రివిధ దళాధిపతులు గురువారం మీడియాతో మాట్లాడారు. ఎయిర్ మార్షల్ అవదేశ్ కుమార్ భార్తి మాట్లాడుతూ మే 7వ తేదీన ఇండియా 9 ఉగ్ర క్యాంపులను టార్గెట్ చేసిందన్నారు. పాకిస్థాన్ సైనిక చర్యకు దిగడంతో ఆ దాడుల్ని మరింత విస్తరించినట్లు చెప్పారు. 9 ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేసిన ఆధారాలు ఉన్నాయని, ప్రతి ఒక్కరూ ఆ ఆధారాలను పరిశీలించవచ్చు అని భార్తి అన్నారు. పాకిస్థాన్‌కు చెందిన 11 ఎయిర్‌ఫీల్డ్స్‌ను టార్గెట్ చేసినట్లు చెప్పారు. ఆ దేశానికి చెందిన 13 విమానాలను కూల్చినట్లు తెలిపారు. సుమారు 300 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఓ యుద్ధ విమానాన్ని కూడా కూల్చినట్లు ఆయన తెలిపారు. ఆ సంక్షోభ సమయంలో భారత్‌కు ఎటువంటి నష్టాన్ని పాక్ కలిగించలేకపోయిట్లు చెప్పారు. లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘాయ్ మాట్లాడుతూ 9 ఉగ్ర క్యాంపుల్లో ఉన్న సుమారు 100 మంది ఉగ్రవాదులు హతమైనట్లు పేర్కన్నారు. ఆపరేషన్ సింధూర్‌లో పాకిస్థాన్‌కు చెందిన వందకుపైగా ఉగ్రవాదులు హతమైనట్లు చెప్పారు. పాకిస్థాన్ మిలిటరీ చాలా పెద్ద సంఖ్యలో తమ దివంగత సైనికులకు అవార్డులు అందజేసిందని, దీని ద్వారా ఆ దేశ మిలిటరీ చావుదెబ్బ తిన్నట్లు అర్థమవుతోందన్నారు.



## గంగూలీవైపు బిజెపి చూపు! సౌరభ్ ఇంటికి పిఎన్ పాఠక్!

**కోల్‌కత్తా, మే 7:** పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో గత 15 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా అత్యంత కీలకమైన మార్పులు చోటుచేసుకుంటున్న తరుణంలో, బెంగాల్ టైగర్ సౌరవ్ గంగూలీ బీజేపీ నేత పీఎన్ పాఠక్‌తో భేటీ కావడం రాజకీయ వర్గాల్లో పెను సంచలనంగా మారింది. రాష్ట్రంలో మమతా బెనర్జీ ప్రభుత్వం ఓటమి చెంది, బీజేపీ ఘనవిజయం సాధించిన నేపథ్యంలో గంగూలీ నివాసంలో జరిగిన ఈ సుదీర్ఘ భేటీ ప్రాధాన్యతను సంతరించుకుంది. సౌరవ్ గంగూలీ నివాసంలో పీఎన్ పాఠక్ సుమారు రెండు గంటలకు పైగా గడపడం కేవలం మర్యాదపూర్వక భేటీ మాత్రమే కాదని, దీని వెనుక బలమైన రాజకీయ కారణాలు ఉండవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. బెంగాల్‌లో అత్యంత ప్రజాదరణ ఉన్న గంగూలీని పార్టీలోకి ఆహ్వానించడం ద్వారా తమ పట్టును మరింత బలపరుచుకోవాలని బీజేపీ భావిస్తున్నట్లు తెలుస్తోంది.

# హార్ముజ్ తెరిచేందుకు ఇరాన్ - అమెరికా ఒప్పందం

## త్వరలో తెరుచుకోనున్న జలసంధి

**రియాద్, మే 7:** ప్రపంచ దేశాలకు ఇదో శుభవార్త.. కొద్దిరోజులుగా మూసి ఉన్న హార్ముజ్ జలసంధి త్వరలోనే తెరుచుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ జలసంధి విషయంలో అమెరికా, ఇరాన్ మధ్య ఒప్పందం తుది దశకు చేరుకున్నట్లు తెలుస్తోంది. అంతర్జాతీయ సంస్థల అంచనా ప్రకారం.. హార్ముజ్ జలసంధి విషయంలో అమెరికా, ఇరాన్ మధ్య చర్చలు కొనసాగుతున్నాయి. ఈ అంశంపై గురువారం రెండు దేశాలు ఒక ఒప్పందానికి వచ్చినట్లు తెలుస్తోంది. హార్ముజ్‌ను వీలైనంత త్వరగా, దశలవారీగా అందుబాటులోకి తేవాలని ఇరు దేశాలు నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఒకటి రెండు రోజుల్లోనే హార్ముజ్ విషయంలో పూర్తి ఒప్పందం కుదిరి, జలసంధి అందుబాటులోకి వచ్చే అవకాశం కనిపిస్తోంది. అలాగే, ఇక్కడ చిక్కుకు పోయిన నౌకల్ని కూడా ప్రయాణించేందుదకు అనుమతివ్వనున్నారు. ఇరాన్, అమెరికా మధ్య యుద్ధం ప్రారంభమైన ఫిబ్రవరి 28 నుంచి హార్ముజ్ మూసి ఉన్న సంగతి తెలిసిందే. మధ్యలో కొన్ని గంటలు మాత్రమే హార్ముజ్‌ను ఇరాన్ తెరిచింది. ఆ తర్వాత వెంటనే తిరిగి మూసేసింది. తర్వాత అమెరికా కూడా ఈ జలసంధిని దిగ్బంధించింది. ఈ మధ్య కాలంలో కొన్ని నౌకలకు మాత్రం అనుమతి లభించింది. ఇక, ఇక్కడ చిక్కుకుపోయిన నౌకల్ని విడిపించేందుకు అమెరికా ప్రాజెక్టు ఫ్రీడమ్ ప్రారంభించిన సంగతి తెలిసిందే. వాణిజ్య నౌకలకు రక్షణగా, అమెరికా యుద్ధ విమానాల్ని మోహరించాలనుకుంది. కానీ, ఇరాన్‌తో చర్చల్లో ముందడుగు పడటంతో ప్రాజెక్టు ఫ్రీడమ్‌ను ఆపేస్తున్నట్లు అమెరికా తెలిపింది.

మరోవైపు ఇరాన్‌తో చర్చలు సానుకూలంగా సాగుతున్నాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు.



# నితీశ్ కుమారునికి మంత్రి పదవి

## - కేబినెట్‌ను విస్తరించిన సిఎం సామ్రాట్ చౌదరి
## న- ముగ్గురు మాజీ సిఎంల తనయులు కొత్త కేబినెట్‌లోకి
## - హాజరైన ప్రధాని మోడీ, కేంద్రమంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, అమిత్‌షా ప్రభృతులు

**పాట్నా, మే 7:** బీహార్ ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి మంత్రివర్గం గురువారం నాడు పూర్తిస్థాయిలో విస్తరించబడింది. ఈ విస్తరణలో ప్రధాన ఆకర్షణగా, మాజీ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ కుమారుడు నిశాంత్ కుమార్ మంత్రిగా చేరడం నిలిచింది. చౌదరి మంత్రివర్గంలో ఇప్పుడు ముగ్గురు మాజీ ముఖ్యమంత్రుల కుమారులు ఉన్నారు. నితీష్ కుమార్ కుమారుడు నిశాంత్, జగన్నాథ్ మిశ్రా కుమారుడు నితీష్ మిశ్రా, జితన్ రామ్ మాంఝీ కుమారుడు సంతోష్ కుమార్ సుమన్. ఈ ముగ్గురూ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ హాజరయ్యారు. మాజీ ముఖ్యమంత్రి నితీష్ కుమార్, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, జె.పి. నడ్డా, జితన్ రామ్ మాంఝీ, చిరాగ్ పాశ్వాన్, బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్, అలాగే ఆర్‌ఎల్‌ఎం అధినేత ఉపేంద్ర కుష్వాహ్ తదితరులు ఈ కార్యక్రమానికి హాజరైన వారిలో ఉన్నారు. కార్యక్రమం ముగిసిన తర్వాత, ప్రధాని మోడీ, నితీష్ కుమార్, నిశాంత్‌లతో సంభాషించడం కనిపించింది. మొత్తంగా, 32 మంది మంత్రులు ప్రమాణ స్వీకారం చేశారు. వీరిలో బిజెపి నుండి 15 మంది, జెడి(యు) నుండి 13 మంది, ఎల్‌జెపి(ఆర్‌వి) నుండి ఇద్దరు, హెచ్‌ఎఎం(ఎస్), ఆర్‌ఎల్‌ఎం నుండి ఒక్కొక్కరు చొప్పున ఉన్నారు. ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి, జెడి(యు)కి చెందిన ఇద్దరు డిప్యూటీలు బిజేంద్ర ప్రసాద్ యాదవ్, విజయ్ కుమార్ చౌదరిలతో కలిపి మొత్తం 35 మంది అయ్యారు. దీంతో మంత్రివర్గంలో గరిష్టంగా అనుమతించబడిన 36 మంది సభ్యుల సంఖ్య కంటే కేవలం ఒకరు తక్కువగా ఉన్నారు. సీనియర్ బిజెపి నాయకుడు, మాజీ ఆరోగ్య శాఖ మంత్రి మంగళ్ పాండేకు కొత్త మంత్రివర్గంలో చోటు దక్కలేదు. అయితే, జాతీయ స్థాయిలో ఆయనకు కీలకమైన సంస్థాగత పదవిని ఇవ్వవచ్చని అధికారులు తెలిపారు.



# ఓహియో రాష్ట్ర గవర్నర్ ప్రైమరీ ఎన్నికల్లో వివేక్ రామస్వామి విజయం



**వాషింగ్టన్, మే 7:** పారిశ్రామికవేత్త నుంచి రాజకీయ నాయకుడిగా మారిన ఇండో అమెరికన్ వివేక్ రామస్వామి మంగళవారం ఒహి యో రిపబ్లికన్ గవర్నర్ ప్రైమరీ ఎన్నికల్లో నిర్ణయాత్మక విజయాన్ని సాధించారు. ఒకప్పుడు ఆయన అమెరికా అధ్యక్ష స్థానానికి రిపబ్లికన్ అభ్యర్థిగా పోటీపడతారని అందరూ భావించారు. కాగా ప్రైమరీ ఎన్నికల్లో విజయం సాధించిన రామస్వామి నవంబర్‌లో జరిగే ఎన్నికల్లో కొవిడ్ సమయంలో తన వైద్య సేవలతో ప్రముఖ నేతగా గుర్తింపు పొందిన డెమోక్రాటిక్ అభ్యర్థి అమీఆక్టన్‌పై సులభంగా విజయం సాధిస్తారని అంచనాలు ఉన్నాయి. హెల్త్‌టెక్ పారిశ్రామికవేత్త అయిన వివేక్ రామస్వామి రిపబ్లికన్ నామినేషన్‌కోసం క్యాసీ పుష్‌ను ఓడించారు. 2024 అధనయక్ష ఎన్నికల్లో వివేక్‌రామస్వామి ప్రాధాన్యతను పెంచుకున్నారు. డెమొక్రట్ అభ్యర్థి అమి ఆక్టన్ తన పార్టీ నామినేషన్‌ను సాధించగలిగారు. ఓహియో రాష్ట్రాన్ని మరింత అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషిచేస్తానని ఆమెప్రకటించారు.

ఓహియో మాజీ పబ్లిక్ హెల్త్ డైరెక్టర్‌గా కూడా ఆమె పనిచేసారు. ఇండియానాలో కూడా ట్రంప్ ప్రతిపాదించిన అభ్యర్థి నామినేట్ అయ్యారు. ఇదిలా ఉంటే ఓహియో రాష్ట్రంనుంచి ప్రస్తుత ఉపాధ్యక్షుడు జెడివాన్స్ ప్రాతినిధ్యం వహించారు. రామస్వామి విజయం కోసం సిన్‌సినాటికి వెళ్లి తన ఓ టును వేసారు. ప్రస్తుత ఓహియోగవర్నర్ రిపబ్లికన్ మైక్ డివైన్ మరోసారి ఎన్నికయ్యే అవకాశం లేదు. ట్రంప్ అధ్యక్షుడుగా ఎన్నికైన తర్వాత రామస్వామి ప్రభుత్వం స్థాపించిన దోజ్‌ను పర్యవేక్షించారు. ఆ తర్వాత ఈ ప్రాజెక్టును ఎలాన్‌మస్క్‌కు అప్పగించారు. వెనువెంటనే ఓహియో గవర్నర్‌పదవికి తాను రేసులో ఉన్నట్లుప్రకటించారు.

## టిఎంసి ప్రత్యేక సమావేశానికి పది మంది ఎమ్మెల్యేలు డుమ్మా

**కోల్‌కత్తా, మే 7:** అసెంబ్లీ ఎన్నికల లో ఓటమితో ఇప్పటికే తృణమూల్ కాంగ్రెస్ పార్టీ డీలాపడింది. ఈ క్రమంలో తాజాగా మమతాబెనర్జి నిర్వహించిన ఓ కీలక సమావేశానికి పది మంది టీఎంసీ ఎమ్మెల్యేలు గైర్హాజరు కావడం చర్చనీయాంశం అయ్యింది. తృణమూల్ కాంగ్రెస్ నుంచి మొత్తం 80 మంది ఎమ్మెల్యేలు విజయం సాధించగా.. వారిలో కేవలం 70 మంది మాత్రమే మమతాబెనర్జితో సమావేశానికి హాజరయ్యారు. రాష్ట్రంలో అధికారం కోల్పోయిన తర్వాత భవిష్యత్ కార్యాచరణపై చర్చించేందుకు, పార్టీ శ్రేణుల్లో నిరుత్సాహాన్ని తొలగించేందుకు ఈ సమావేశం నిర్వహించారు. కానీ ఈ సమావేశానికి ఏకంగా 10 మంది ఎమ్మెల్యేలు హాజరుకాకపోవడంతో పార్టీలో చీలిక ఏర్పడిందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అయితే ఆ ఊహాగానాలను టీఎంసీ తోసిపుచ్చింది. గైర్హాజరుపై వారు ముందుగానే సమాచారం ఇచ్చారని వెల్లడించింది. ఇదిలా ఉంటే తాను సీఎంగా రాజీనామా చేయబోనని మమతా బెనర్జీ స్పష్టంచేసిన సంగతి తెలిసిందే. నన్ను డిస్మిస్‌చేసుకోమనండి, ఎన్నికల తీరుపై తానుసుప్రీంకోర్టుకు వెళతానని స్పష్టంచేసిన సంగతి తెలిసిందే.

## ఇడి అధికారుల భయంతో నోట్లకట్టలను 9వ అంతస్తునుంచి విసిరేసిన రియాల్టర్

**మొహాలిఖర్(పంజాబ్), మే 7:** పంజాబ్‌లోని రాజకీయ, వ్యాపార వర్గాల్లో గురువారం చోటు చేసుకున్న పరిణామాలు తీవ్ర కలకలం రేపాయి. మొహాలీఖరార్ ప్రాంతంలోని ఓ బహుళ అంతస్తుల భవనంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నిర్వహించిన సోదాల సందర్భంగా ఓ ఫ్లాట్ నుంచి నోట్ల కట్టల సంచులను కిందకు విసిరేయడంతో, రాష్ట్రంలో ఓ భారీ మనీలాండరింగ్, హవాలా నెట్‌వర్క్ నడుస్తోందన్నది బయటపడింది. ఈ కుంభకోణంలో పలుకుబడి కలిగిన బిల్డర్లు, రాజకీయ సంబంధాలున్న వ్యక్తుల ప్రమేయం ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భూ కుంభకోణం కేసుకు సంబంధించిన దర్యాప్తులో భాగంగా ఈడీ అధికారులు ఖరార్‌లోని వెస్టన్ టవర్ భవనానికి చేరుకున్నారు. అధికారులు లోపలికి ప్రవేశించిన కొద్ది క్షణాల్లోనే 9వ అంతస్తులోని ఓ ఫ్లాట్ నుంచి నగదుతో నిండిన సంచిని కిందకు విసిరేసినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. గాల్లో రూ.500 నోట్ల కట్టలు ఎగరడం చూసి స్థానికులు దిగ్భ్రాంతికి గురయ్యారు.



దామోదరం సంజీవయ్యకు నివాళులు అర్పిస్తున్న ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్.

## నేటితరం ప్రజాప్రతినిధులు దామోదరంను ఆదర్శంగా తీసుకోవాలి

### ప్రభుత్వ సలహాదారు విహెచ్

**హైదరాబాద్ (బేగంపేట), మే 7, ప్రభాతవార్త:** నేటితరం ప్రజాప్రతినిధులు దామోదరం సంజీవయ్యను ఆదర్శంగా తీసుకోవాలని, ప్రభుత్వ సలహాదారు, దామోదరం సంజీవయ్య ట్రస్ట్ ఛైర్మన్ వి.హనుమంతరావు అన్నారు. దామోదరం సంజీవయ్య వర్ధంతి వేడుకలు విహెచ్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. అసెంబ్లీ ఎదురుగా ఉన్న ఆయన విగ్రహానికి, సంజీవయ్య పార్క్‌లో ఆయన సమాధి వద్ద పిసిసి ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్‌తో కలిసి విహెచ్.. దామోదరం సంజీవయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో తొలిదళిత ముఖ్యమంత్రిగా ఆనాడు కాంగ్రెస్ పార్టీ ఆయ నకు అవకాశం కల్పించిందన్నారు. కర్నూల్‌లో దామోదరం సంజీవయ్య పుట్టిపెరిగిన చోట స్మృతివనం నిర్మించాలని ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లకు విహెచ్ విజ్ఞప్తి చేసారు. కర్నూల్ జిల్లాకు ఆయన పేరు పెట్టాలన్నారు. కార్యక్రమంలో పిసిసి కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్, ఖైరతా బాద్ జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సన్న వడ్లకు బోనస్‌గా రూ.1,740 కోట్లు చెల్లించాం

### ప్రభుత్వ విప్ సిహెచ్. విజయరమణారావు

**హైదరాబాద్, మే 7, ప్రభాతవార్త:** సన్నవడ్లకు బోనస్‌గా రూ.1740కోట్ల చెల్లించామని గతంలో కెసిఆర్‌పత్తి పెట్టొద్దు.. వరి వేస్తే ఉరే అంటూ భయపెట్టారని మా ప్రభుత్వం మాత్రం మద్దతు ధరకు అన్నీ కొంటున్నదనీ ప్రభుత్వ విప్ సిహెచ్ విజయరమణరావు తెలిపారు. సిఎల్‌పికార్యాలయంలో మీడియాతో గురువారం మాట్లాడుతూ పదేళ్ల బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో రైతులను మోసం చేశారనీ ఆరోపించారు. వరంగలో సభలో సిఎం రేవంత్ రెడ్డి పైన కెటిఆర్ వ్యాఖ్యలను ఖండిస్తున్నామనీ అన్నారు. 12 వేల కోట్ల రుణ మాఫీ మాత్రమే చేశారని కెటిఆర్ పచ్చి అబద్దాలు చెపుతున్నాడనీ దుయ్య బట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం 20 వేల కోట్ల రూపాయల రైతు రుణమాఫీ చేసిందనీ, గతంలో లక్ష రూపాయల రుణమాఫీ చేస్తామని చెప్పి రెండు సార్లు కెసిఆర్ రైతులను మోసం చేశాడనీ అన్నారు. లక్ష రూపాయల రుణమాఫీ నాలుగు విడతలు గా చేశారనీ ఎద్దేవా చేశారు. బిఆర్‌ఎస్ హయాంలో రుణమాఫీ జరిగి మళ్లీ రుణం తీసుకున్న రైతు ఒక్కరైనా ఉన్నారా అని ప్రశ్నించారు. దమ్ము ఉంటే రుణమాఫీ పైన తెలంగాణలో ఏ గ్రామానికైనాకెటిఆర్ రావాలి మేం వస్తాం మీ పనితనమేందో మాదేందో తెలుసుకొందామని అన్నారు. వరి వేయొద్దు, కిలో కూడా కొనమని , వరి వేస్తే ఉరే నని కెసిఆర్ గతంలో చెప్పాడనీ మేం రైతులు పండించిన అన్ని పంటలను మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నామని వివరించారు. గతంలో కెసిఆర్ మక్కలను ఏనాడు కొనలేదనీ, మేం మార్క్ ఫెడ్ ద్వారా మక్కలు కొనుగోలు చేస్తున్నామని వివరించారు. రైతు బంధు ఇచ్చి అదే సర్వరోగ నివారిణి అని కెసిఆర్ వ్యవహరించారని మేం ఆధునిక పనిముట్లు ఇస్తునే నాలుగు పంటలకు మా ప్రభుత్వం రైతు భరోసా ఇచ్చామనీ తెలిపారు. సన్న వడ్లకు 500 రూపాయల బోనస్ ఇస్తున్నామని తెలిపారు.



కుల ఫెడరేషన్ ఛైర్మన్‌లకు, వైస్‌ఛైర్మన్లకు నియామకపత్రాలు అందజేస్తున్న పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్

## ఆర్థికంగా అణగారిన వర్గాల అభివృద్ధికి కృషి

### పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, మే 7, ప్రభాతవార్త:** ఆర్థికంగా అణగారిన వర్గాల అభివృద్ధికి నామినేటెడ్ పోస్టులు పొందిన ప్రతి ఒక్కరు అంకితభావంతో పనిచేయాలని పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు. నూతనంగా నియమితులైన వివిధ కుల ఫెడరేషన్‌ల ఛైర్మన్‌లు, వైస్‌ఛైర్మన్‌లకు పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌గాంధీభవన్‌లో నియామకపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీలో ప్రతి కార్యకర్తకు అవకాశాలు పార్టీ పరంగా ప్రభుత్వ పరంగా అందజేయడానికి నాయకత్వం సిద్ధంగా ఉందని తెలి పారు. ఓటర్ల ప్రత్యేక జాబితా సవరణ అంశంపై ప్రతి కార్యకర్త నాయకుడు దృష్టిసారించాలని ఆయన కోరారు. ఎస్ఐఆర్‌తో ఓట్ల చోరికి చేసే ఎత్తులను అడ్డుకోవాలని కోరారు.

## కెసిఆర్ చేసిన అప్పుల వల్లే రైతు భరోసా ఆలస్యం

### పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

**హైదరాబాద్, మే 7, ప్రభాతవార్త:** కెసిఆర్ చేసిన అప్పుల వల్లనే రైతు భరోసా కొంత ఆలస్యం అవుతోంద వరంగల్ రైతు డిక్లరేషన్ ను మా ప్రభుత్వం అమలు చేస్తోందనీ పరిగతిత ఎమ్మెల్యే టి.రామోహ్మన్‌రెడ్డి అన్నారు. గురువారం సిఎల్‌పిలో విలేఖరులతో మాట్లాడుతూ రాహుల్ గాంధీ చెప్పినట్లు రెండు లక్షల రైతు రుణమాఫీ చేశామనీ తెలిపారు. గజ్వేల్, సిరిసిల్ల, సిద్దిపేట నియోజక వర్గాల్లో గతం కంటే రెట్టింపు స్థాయిలో రుణమాఫీచేశామనీ వివరిం చారు. దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా కెటిఆర్ మాటలున్నాయనీ, రుణమాఫీ పైన అసెంబ్లీ నేను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సవాల్ విసిరితే స్పందించలేదని గుర్తుచేశారు. ప్రతి ఎన్నికల్లో బిఆర్‌ఎస్ చిత్తుగా ఓడిపోయిందనీ, దొంగే దొంగా అని అరిచినట్లుగా కెటిఆర్ తీరు ఉందన్నారు. కెసిఆర్ కుటుంబం ఎనిమిది లక్షల కోట్ల రూపాయల అప్పును తెలంగాణ నెత్తిన పెట్టి పోయారనీ ఆరోపించారు. ఇచ్చిన హామీలను అమలు కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అహర్నిశలు కష్టపడుతున్నాడనీ చెప్పారు. కెటిఆర్ రెనివల్ సిఎంకాలేదు మళ్లీ అధికారాన్ని తెచ్చే సిఎం రేవంత్‌రెడ్డి అని అన్నారు. బిఆర్‌ఎస్ అని పార్టీ పేరు మార్చుకుంటే తెలంగాణ ప్రజలు చిత్తు చేశారనీ అన్నారు. ఇప్పటికే నాలుగుసార్లు రైతు భరోసా ఇచ్చామనీ ప్రతి నియోజక వర్గంలో మూడు వేల ఐదు వందల ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తున్నా మని తెలిపారు. వరి వేస్తే ఉరే అని కెసిఆర్ చెప్పాడని కాని మా ప్రభుత్వం సన్న వడ్లు వేసిన రైతులకు రూ. 500 బోనస్ ఇస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రిని అవమానించేలా మాట్లాడితే కాంగ్రెస్ కార్యకర్తలు తగినశాస్తి చేస్తారని హెచ్చరించారు.

## సైన్స్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ పరిశోధకులకు ఎంతో ఉపయుక్తం

### సిఎస్ఐఆర్‌లో నిర్మాణ పనులను పరిశీలించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపి ఈటల

**హైదరాబాద్, మే 7, ప్రభాతవార్త:** హైదరాబాద్ వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో ఒకటని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం సిఎస్ఐఆర్‌లో నిర్మాణంలో ఉన్నా సైన్స్ ఎక్స్ పీరియన్స్ సెంటర్ పనులను పరిశీలించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపి ఈటల రాజేందర్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ ఇలాంటి నగరంలో ఇప్పటికే అనేక కేంద్ర ప్రభుత్వ సంస్థలు పని చేస్తున్నాయి. ముఖ్యంగా రక్షణ, సైన్స్, ఐటి విద్యారంగాలకు సంబంధించిన అనేక పరిశోధన సంస్థలు ఇక్కడ ఉన్నాయి. వాటి సరసన ఇప్పుడు నేషనల్ సైన్స్ సెంటర్ కూడా హైదరాబాద్‌కు రాబో తుందని వెల్లడించారు. తార్నాకలో నిర్మాణమవుతున్న ఈ హైదరాబాద్ సైన్స్ సెంటర్ పనులను క్షేత్ర స్థాయిలో కేంద్ర మంత్రి పరిశీలించారు. ఈ సైన్స్ సెంటర్ హైదరాబాద్‌లోని ముఖ్యమైన కేంద్ర ప్రభుత్వ సంస్థలలో ఒకటిగా నిలవబో తుంద న్నారు.
యువతకు, విద్యార్థులకు, పరిశోధ కులకు సైన్స్, టెక్నాలజీ రంగాల్లో ఇది ఎంతో ఉపయో గకరంగా ఉంటుందని వెల్లడిం చారు. ప్రధాని నరేంద్ర మోడీ ఈ సెంటర్‌ను మన హైదరాబాద్ నగరానికి మంజూరు చేశారు. వచ్చే ఏడాది చివరి నాటికి దీనిని పూర్తి చేసి, ప్రజలకు అంకితం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. అధికా రుల సమాచారం ప్రకారం, వచ్చే యేడాది మే, జూన్ నెలల నాటికే పనులు పూర్తి చేస్తామని వారు తెలిపారు. మూడు నెలల క్రితమే ప్రారంభమైన ఈ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయనున్నట్లు తెలిపారు.

**ప్రధాని మోడీ పర్యటనలో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు**

ప్రధాని నరేంద్ర మోడీ ఈ నెల 10న హైదరాబాద్‌కు రానున్నారు. ఆ పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారని కేంద్రమంత్రి వెల్లడించారు. జహీరాబాద్ లో ఇండస్ట్రియల్ పార్క్, వరంగల్‌లో ప్రధాన మంత్రి మెగా టెక్స్‌టైల్ కాకతీయ పార్క్ పనులకు భూమి పూజ/ప్రారంభోత్స వాలు చేస్తారు. జాతీయ రహదారులు, రైల్వే నెట్‌వర్క్ అభి వృద్ధి పనులను జాతికి అంకితం చేయనున్నారు. భవిష్యత్తులో వరంగల్ ఎయిర్ పోర్ట్, వరంగల్ రైల్ మాన్యు ఫాక్చరింగ్ యూనిట్, సికింద్రాబాద్, నాంపల్లి రైల్వే స్టేషన్ల ఆధునీకరణ పనులు వేగంగా జరుగుతున్నాయి అలాగే ములుగులో ఏర్పాటు కానున్న ట్రైబల్ యూనివర్సిటీకి, ఎయిమ్స్ వంటి ఆసుపత్రులకు కూడా వచ్చే మూడు నాలుగు నెలల్లో ప్రధానమంత్రి చేతుల మీదుగా భూమి పూజలు, ప్రారంభోత్స వాలు నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తుమని వెల్లడించారు.

## చేతి వృత్తులను ప్రోత్సహించడం అందరి బాధ్యత

### మంత్రి సీతక్క

**హైదరాబాద్ (ముషీరాబాద్), మే 7, ప్రభాతవార్త:** చేతి వృత్తులను ప్రోత్స హించటం మనందరి బాధ్యత అని మంత్రి సీతక్క అన్నారు. గురువారం సాయంత్రం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని ఎన్టీఆర్ స్టేడియం



చేనేత కాటన్ సిల్క్ ఎక్స్‌పో ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క

లో ఏర్పాటుచేసిన చేనేత కాటన్ అండ్ సిల్క్ ఎక్స్‌పో ప్రదర్శనను ఆమె నిర్వాహకురాలు కంభంపాటి పద్మజ, కాంగ్రెస్ మహిళా నేత ఇందిరాశోభన్‌లతో కలసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ రాష్ట్రంలో చేతి వృత్తులను పరిరక్షించు కోవల్సిన అవసరం ఉందని, అందుకోసం చేనేత వస్త్రాలు, గ్రామీణ ఉత్పత్తులను తెలంగాణ ప్రభుత్వం ప్రోత్స హిస్తోందని తెలిపారు. మన హస్తకళలు, చేతి వృత్తులు మన దేశ అస్తిత్వానికి చిహ్నాలని, మహిళా కళాకారులను ప్రోత్స హిస్తూ ప్రతి సంవత్సరం ఈ ప్రదర్శన నిర్వహించటం అభి నందనీయమని కొనియాడారు. గ్రామీణ ఉత్పత్తులను ప్రోత్స హించటం కోసం ప్రభుత్వం కృషి చేస్తోం దని, అందులో భాగంగానే హైటెకెసిటీలో ఇందిరా మహిళా శక్తి బజారులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిర్వాహకురాలు పద్మజ మాట్లాడుతూ డ్వాక్రా గ్రూపులు, చేనేత వృత్తిదా రులు తయారు చేసిన వస్త్రాలను, గృహో పకర ణాలను మార్కెట్ ధరల కంటే తక్కువకే వినియో గదారులకు అందించాలనే లక్ష్యంతో ఈ ఎగ్జిబిషన్ నిర్వ హిస్తు న్నామని పేర్కొ న్నారు. జూన్ 7 వరకు కొనసాగే ఈ ప్రదర్శ నకు జంట నగర వాసులు అందరూ వచ్చి, చేతి వృత్తిదా రులను ప్రోత్స హించాలని కోరారు.

**త్వ రలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల ఖాళీల భర్తీ చేస్తాం**

**హైదరాబాద్ (నాచారం):** అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల ఖాళీలను త్వరలోనే భర్తీ చేస్తామని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క వెల్లడించారు. ఖాళీల భర్తీకి సంబంధించిన ఫైల్‌పై తాను ఇప్పటికే సంతకం చేసినట్లు తెలిపారు. నాచారం పారిశ్రామిక వాడలోని తెలంగాణ ఫుడ్స్ సంస్థలో క్యాంటీన్, నూతన గోదాంల నిర్మాణాలకు గురువారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, దేశంలో మహిళలు, చిన్నారుల సంక్షేమం కోసం మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ప్రారంభించిన ఐసిడిఎస్ సేవలు పేద ప్రజలకు ఎంతో ఉపయోగపడు తున్నాయని అన్నారు. ప్రజలకు పోషకాహారం అందించాలనే ప్రభుత్వ లక్ష్యాన్ని తెలంగాణ ఫుడ్స్ సమర్థవంతంగా అమలు చేస్తోందని తెలి పారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి విజ్ఞప్తి మేరకు నియోజకవర్గంలో కొత్త అంగన్వాడీ కేంద్రాలను మంజూరు చేయనున్నట్లు తెలిపారు.

## తెలంగాణలో భవిష్యత్తు బిఆర్ఎస్‌దే

### మాజీమంత్రి హరీశ్‌రావు

**కోదాడ, మే 7, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రజలు కేసీఆర్ నాయకత్వాన్ని బలంగా కోరుకుంటున్నారని మాజీ మంత్రి, టిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు పేర్కొన్నారు. గురువారం మాజీ శాసన సభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ అధ్యక్షతన స్థానిక గుడి గుంట అప్పయ్య ఫంక్షన్ హాల్ లో జరిగిన కోదాడ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనా వైఫల్యాలను ఎండగడుతూ, స్థానిక కాంగ్రెస్ నాయకత్వంపై ఆయన తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. భవిష్యత్తు బీఆర్ఎస్‌దే అని స్పష్టం చేస్తూ కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. 2 లక్షల ఉద్యోగాలు, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, మహిళలకు రూ. 2500 ఇస్తామని చెప్పి నిరుద్యోగులు, విద్యార్థులు, రిటైర్డ్ ఉద్యోగులు ఇలా అన్ని వర్గాల ప్రజలను ఈ ప్రభుత్వం దారుణంగా మోసం చేసిందన్నారు. ముస్లిం మైనారిటీలకు ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చలేదు. పైగా కేసీఆర్ మైనారిటీలకు ఇచ్చిన ప్రయోజనాలను సైతం రేవంత్ రెడ్డి ఆపేశాడన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ ఒడ్డి తీరు బాత్ కరోడో మే కామ్ పకోడ్ మే అన్నట్లుగా ఉందన్నారు. మాటలు కోటలు దాటుతున్నాయి, చేతలు మాత్రం శూన్యం. ఎస్సీ, ఎస్టీలకు సబ్ ప్లాన్ నిధులు రావడం లేదు. ఎస్సీ ఎస్టీ కార్పొరేషన్ల ద్వారా రెండున్నరేళ్ల పాలనలో ఏ ఒక్కరికీ ఒక్క రూపాయి లబ్ధి కూడా జరగలేదు. కేసీఆర్ పాలనలో ఎంతో అభివృద్ధి జరిగింది. కాళేశ్వరం జలాలతో ఈ ప్రాంతం సస్యశ్యామలం అయిందన్నారు. గతంలో మంత్రిగా ఉన్న ఉత్తమ్ కుమార్ రెడ్డి ఏనాడైనా కోదాడకు గోదావరి జలాలను తీసుకురాగలిగారా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాకే ఎస్సారెస్పీ ఫేజ్ 2 పూర్తి చేసి ఈ ప్రాంతానికి సాగునీరు అందించామన్నారు. ఎన్నికల్లో ఓడిపోయినా మాజీ ఎమ్మెల్యే మల్లయ్య యాదవ్ నిత్యం ప్రజల్లో ఉంటున్నాడు. కానీ గెలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యే మాత్రం కేవలం ఆన్లైన్‌కే పరిమితమైందని ఎద్దేవా చేశారు.

## మన సంస్కృతీ సంప్రదాయాలకు వారధులు కళాకారులే

### పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

### ఆసక్తికరంగా సాగుతున్న ప్రభుత్వ సంగీత నాటక అకాడమీ యువ నాటకోత్సవాలు

**హైదరాబాద్ (రవీంద్రభారతి), మే 7, ప్రభాతవార్త :** మన జాతి సంస్కృతి, సంప్రదా యాలు, కళలను కాపాడుతూ నిలబెడుతున్న వారసులు, వారధులు కళాకా రులేనని, అందుకే తమ ప్రజాప్రభుత్వం కళాకారుల, కళావికాసానికి విశేషకృషి చేస్తుందని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. రాష్ట్ర సంగీత నాటక అకాడమీ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కళాకా రులను గుర్తించి వేదికలు కల్పించి ప్రోత్స హించాలని అకాడమీ అధ్యక్షురాలు ఆచార్య అలేఖ్య పుంజాలకు సూచించారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు నాటకాల్లో ప్రతిబింబించేలా భావితరాలకు అందించాలని కోరారు. తెలంగాణ ప్రజాప్రభుత్వ ప్రజాపాలన ఉత్స వాల్లో భాగంగా తెలంగాణ రాష్ట్ర సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో కళారంగంలో యువత ప్రతిభను ప్రోత్స హిస్తూ 3 రోజులపాటు సాగుతున్న యువనాటకోత్స వాల 2వ రోజు ప్రదర్శనలకు ముఖ్య అతిథిగా హాజరైన మహేష్‌కుమార్ గౌడ్,




సందేశాత్మక 'నశా హీ నశ' వీధినాటకంలో ఒక దృశ్యం

సంగీత నాటక అకాడమీ అధ్యక్షురాలు ఆచార్య అలేఖ్య పుంజాల తదితరులతో కలిసి జ్యోతి ప్రకాసనం చేసి ప్రసంగించారు. రెండో రోజు యువ నాట కోత్స వాల్లో సభకుముందు నిశుంభిత స్కూల్ ఆఫ్ డ్రామా నిర్వహణలో మాదకద్రవ్యాలకు వ్యతి రేకంగా సందేశాత్మక డా. రామ్ హోలగండి రచన దర్శకత్వంలో రూపొందిన వీధినాటకం నశాహి నశ; సభానంతరం చైతన్య కళాభారతి, కరీంనగర్ వారిచే పరమాత్ముని శివరాం రచన, రమేష్ మంచాల దర్శకత్వంలో రూపొందిన సాంఘిక నాటిక స్వప్నం రాల్చిన అమృతం; టి.బి.ఆర్. ఆర్ట్ క్రియేషన్స్, సంగారెడ్డి వారిచే పి.లక్ష్మి కులశేఖర్ రచన, టి.ఇందిరాదేవి దర్శకత్వంలో రూపొందిన స్వామియే శరణం అయ్యప్ప పద్యనాటికలు అద్భు తంగా ప్రదర్శింపబడి యువతను ఇతోధికంగా ఆకట్టుకున్నారు. చివరిగా అతిథుల చేతులమీదుగా నాటక ప్రదర్శ నల్లో పాల్గొన్న యువకళాకారులను ఘనంగా సత్కరించారు.

## ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ చేసిన ఏకైక పార్టీ కాంగ్రెస్

### కెటిఆర్! నువ్వు రూలర్‌వా, జోకర్‌వా?

### ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్, మే 7, ప్రభాతవార్త:** దేశంలో రైతు రుణమాఫీ అమలు చేసిన ఏకైక పార్టీ కాంగ్రెస్ మాత్రమేననీ, రైతులకు ఉచిత విద్యుత్ అందించింది దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద శ్రీనివాస్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ వరంగల్ వేదికగా రైతు సంగ్రామ సభ పేరుతో కెటిఆర్ చేసిన వ్యాఖ్యలు విన్న ప్రజలు ఆశ్చర్య పోతున్నారని అన్నారు. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన ప్రాజెక్టులు దశాబ్దాలైనా నిలకడగా కొనసాగుతున్నాయనీ, బిఆర్ఎస్ హయాంలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు ఇప్పుడు 'కూళేశ్వరం'గా మారిందనీ, కృంగి పోయిందని ఎద్దేవా చేశారు. కెటిఆర్ చదువుకున్న నాయకుడు, విషయ పరిజ్ఞానం ఉన్న వ్యక్తి అని ప్రజలు భావించే వారనీ, అధికారం కోసం ఎంతకైనా దిగజారే స్థాయికి వెళ్లారనే భావన ఇప్పుడిప్పుడే ప్రజల్లో కలుగుతోందనీ చెప్పారు. ముఖ్యమంత్రి కుర్చీ ఎలా దక్కించుకోవాలో చెప్పిన కెసిఆర్, ప్రజల విశ్వాసం ఎలా నిలబెట్టుకోవాలో మాత్రం చెప్పలేకపోయారనీ విమర్శించారు. రైతు రైతుల సభ పెట్టి రైతుల సమస్యలపై మాట్లాడకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదని సరికాదని అభిప్రాయపడ్డారు. అధికారం కోల్పోయిన తర్వాత కాంగ్రెస్‌పై అవాకులు, చవాకులు మాట్లాడటం కెటిఆర్ కు అలవాటైందని మండిపడ్డారు. కెసిఆర్ ఇంట్లో 'బొమ్మ రిల్లు' సినిమాలో వలే కుటుంబ పంచాయితీ నడుస్తోందని ఎద్దేవా చేశారు. గతంలో రేవంత్ రెడ్డికి జడ్పీటిసి సీటు ఇవ్వడానికి కూడా బిఆర్ఎస్ నిరాకరించిందనీ గుర్తుచేశారు. కానీ రేవంత్ రెడ్డి స్వయంకృషితో జడ్పీటిసిగా గెలిచారనీ తెలిపారు. కొడంగల్‌లో ఓడినా, మల్కాజిగిరిలో భారీ మెజారిటీతో గెలిచి ప్రూవ్ చేసుకున్నారనీ చరిత్రను వివరించారు. తెలంగాణ ప్రజలకు కెటిఆర్ జోకరో... రూలరో తెలియడం లేదని తీవ్ర విమర్శలు చేశారు. తమిళనాడు నాయకుడు విజయ్ చూసైనా కెటిఆర్ రాజకీయ సంస్కారం నేర్చుకోవాలనీ హితవుచెప్పారు. ఇదే తీరు కొనసాగితే సిరిసిల్లలో కూడా కెటిఆర్ గెలవలేడనీ జోస్యంచెప్పారు. ప్రజలను తక్కువ అంచనా వేస్తూ మాట్లాడితే రాజకీయంగా ప్రజలే సమాధి చేస్తారని యెన్నం శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు.

## పేద కుటుంబాలకు అండగా సర్కారు

### ఎన్ఎఫ్‌బిఎస్ పథకంపై ప్రత్యేక దృష్టి

### అర్హులైన ప్రతిఒక్కరూ చేరాలి: మంత్రి సీతక్క

**హైదరాబాద్, మే 7, ప్రభాతవార్త:** కుటుంబ పెద్ద అకాలమరణం చెందితే పేద కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకోకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఇందుకు ప్రత్యేకంగా అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీమ్‌ను ప్రజలకు చేరవేయడంపై దృష్టి సారించింది. దీంతో ప్రస్తుతం భారీ సంఖ్యలో లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందుతోంది. ఈ పథకం కింద కుటుంబ పెద్ద మరణించినప్పుడు ఆ కుటుంబానికి ఒకేసారి రూ.20 వేల ఆర్థిక సహాయం అందజేస్తారు. కుటుంబంలోని గృహిణిని కూడా బ్రెడ్ విన్నర్‌గా పరిగణించడం ఈ పథకం ప్రత్యేకత. సహజ మరణం అయినా, అకాల మరణమైనా అర్హులైన పేద కుటుంబాలకు ఈ సాయం అందుతుంది. అయితే కొన్ని సంవత్సరాలుగా ఈ పథకం అమలు నిర్లక్ష్యానికి గురైందని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. 2022-23లో కేవలం 603 మందికి మాత్రమే సాయం అందగా, 2023-24లో 577 మందికి మాత్రమే ప్రయోజనం కలిగింది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన తరువాత పరిస్థితి పూర్తిగా మారింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలోనే ఏకంగా 15,420 మంది లబ్ధిదారులకు రూ.30.84 కోట్ల ఆర్థిక సహాయం అందజేయడం విశేషం. 2014-15 నుంచి 2024-25 వరకు మొత్తం 20,663 మంది లబ్ధిదారులకు సాయం అందగా, ఒక్క 2025-26 సంవత్సరంలోనే 15,420 కుటుంబాలకు సాయం అందింది. తెల్ల రేషన్‌కార్డు కలిగిన బిపిఎల్ కుటుంబాలు ఈ పథకానికి అర్హులు. 18 నుంచి 60 సంవత్సరాల మధ్య వయస్సు గల కుటుంబ పెద్ద మరణించినప్పుడు ఈ సహాయం అందుతుంది. మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకునే సౌకర్యం కల్పించారు. పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధిశాఖ ఈ పథకాన్ని అమలు చేస్తోంది. అర్హులైన వారంతా ఈ పథకంలో చేరాలని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధిశాఖ మంత్రి సీతక్క కోరారు. ఆపద సమయంలో పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన ప్రతీ కుటుంబానికి ఈ పథకం చేరేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.

## సాంఘిక సంక్షేమ గురుకులాల్లో డిప్యుటేషన్లు రద్దు

### ఉత్తర్వులు జారీ చేసిన సంస్థ కార్యదర్శి

**హైదరాబాద్, మే 7, ప్రభాతవార్త:** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల సంస్థలో డిప్యూటేషన్ల రద్దు చేస్తూ ఖ సంస్థ కార్యాదర్శి శారద నిర్ణయించారు. ఈ మేరకు దీనికి సంబంధించి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. తద్వారా గురుకుల వ్యవస్థను మరింత బలోపేతం అవుతుందని భావిస్తున్నారు. గురుకులాల్లో సిబ్బంది కొరత కారణంగా ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, ప్రధాన కార్యాలయంతో పాటు, ఇతర విభాగాల్లో సుదీర్ఘ కాలంగా విధులు నిర్వహిస్తున్న స్టాఫ్ డిప్యూటేషన్లను రద్దు చేశారు. ఇందులో భాగంగా వివిధ హోదాల్లో పనిచేస్తున్న సుమారు 16 మంది సిబ్బందిని తిరిగి వారి పూర్వ స్థానానికి పంపిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కల్వకుట్ల కవిత. చిత్రంలో హరగోపాల్, రవి, సరస్వతి, చలపతిరావు, హేమ తదితరులు

## ప్రజావ్యతిరేక విధానాలకు ప్రభుత్వాలు స్వస్తి పలకాలి

### లేదంటే ఉవ్వెత్తున ఉద్యమాలు

### అఖిలపక్ష సమావేశంలో వక్తలు హెచ్చరిక

**హైదరాబాద్ (సైఫాబాద్), మే 7, ప్రభాతవార్త:** ప్రజావ్యతిరేక విధానాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వస్తి పలకాలని, లేకపోతే ప్రజా ఉద్యమాలు ఉవ్వెత్తున పుట్టుకొస్తాయని పలువురు వక్తలు హెచ్చరించారు. రైతుల నుంచి భూములను గుంజుకుని బడా పారిశ్రామికవేత్తలకు కట్టబెడుతూ భవిష్యత్‌తరాలకు ద్రోహం చేయరాదని, బాధ్యతతో వ్యవహరించాలని వక్తలు సూచించారు. ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ, తెలంగాణ పీపుల్స్ జెఎసి ఆధ్వర్యంలో గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 'ఫార్మాసిటీ ప్రాంతంలో ఏమి జరుగుతుంది?' అంశంపై అఖిలపక్ష సమావేశంలో వక్తలు ప్రసంగించారు. తెలంగాణ రక్షణ సేన (టిఆం ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వం ఫార్మా సిటీ పేరుతో 13,500 ఎకరాలను గుంజుకుందని, కాంగ్రెస్ ప్రభుత్వం నేడు ఫ్యూచర్‌సిటీ కోసం 30 వేల ఎకరాలను గుంజుకునేందుకు ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. హక్కుల నేత ప్రొఫెసర్ జి.హరగోపాల్ మాట్లాడుతూ పాలకులు అభివృద్ధి పేరిట రైతాంగాన్ని, రాజ్యం మధ్య వైరుధ్యాన్ని సృష్టిస్తున్నాయని, దీంతో ప్రజా జీవితం విధ్వంసం అవుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు.

## ధాన్యం లోడింగ్‌లో ఇబ్బందులు రావొద్దు

### లారీలు అందుబాటులో ఉంచండి

### క్షేత్రస్థాయి అధికారులకు రవాణా శాఖ ఆదేశాలు

**హైదరాబాద్, మే 7, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లు చురుకుగా సాగుతున్నందున అవసరమైన మేరకు లారీలు, ట్రాక్టర్లు అందుబాటులో ఉంచా లని రాష్ట్ర రవాణా శాఖ ఆదేశాలు జారీ చేసింది. కొనుగోలు కేంద్రాల నుంచి గోదాములు, రైస్ మిల్లులకు ధాన్యం తరలింపుపై ప్రత్యేక దృష్టి సారించాలని రవాణాశాఖ కార్యదర్శి ఇలంబర్తి స్పష్టం చేశారు. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా వరి ధాన్యం సేకరణ ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు, రవాణాలో ఎలాంటి అడ్డంకులు కలగకుండా చూసేందుకు రవాణాశాఖ కమిషనర్ కార్యాలయం గురువారం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ధాన్యం తరలింపు విషయంలో జిల్లా యంత్రాంగం, పౌర సరఫరాలశాఖతో సమన్వయం చేసుకోవాలని, అవసరాలకు అనుగుణంగా వెంటనే వాహనాలను అందుబాటులో ఉంచాలన్నారు. ధాన్యం తరలించే రవాణా వాహనాలన్నింటికీ చెల్లుబాటయ్యే పత్రాలు తప్పనిసరిగా ఉండాలని ఆదేశించారు. ఆర్‌సి, ఫిట్‌నెస్, పర్మిట్, ఇన్సూరెన్స్, పియుసి, డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో పెద్దఎత్తున ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నందున రవాణా వాహనాల రాకపోకలు సాఫీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సంబంధితశాఖలతో సమన్వయంతో వ్యవహరించాలన్నారు. రవాణా సమయంలో తలెత్తే సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. రవాణా ఏర్పాట్లపై అధికారుల నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. వాహనాల కేటాయింపు, తరలింపులో ఎలాంటి జాప్యం జరగకుండా జిల్లా కలెక్టర్లు, పౌరసరఫరాలశాఖ అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకోవాలని ఉత్తర్వులలో పేర్కొన్నారు. రవాణాలో పాల్గొనే అన్ని వాహనాలకు తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యే రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, ఫిట్‌నెస్ సర్టిఫికేట్, పర్మిట్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికేట్, డ్రైవర్లకు లైసెన్స్ ఉండాలన్నారు. వాహనాల కదలికలో ఏవైనా సమస్యలు ఎదురైతే జిల్లా అధికారుల సాయంతో తక్షణమే పరిష్కరించాలని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ధాన్యం సేకరణ పనులు ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో రవాణా వ్యవస్థలో ఎక్కడా అంతరాయం కలగకుండా చూడటమే లక్ష్యంగా రాష్ట్ర రవాణాశాఖ కమిషనర్ తాజా ఆదేశాలు జారీ చేశారు.

## పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం

### మంత్రి వాకిటి శ్రీహరి

**హైదరాబాద్, మే 7, ప్రభాతవార్త:** ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్య క్రమంలో భాగంగా పశుసంవర్ధక, పాడిపారిశ్రామికాభివృద్ధి, మత్స్యశాఖల్లో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, సాధించిన అభివృద్ధి, భవిష్య త్‌లో ప్రభుత్వం తీసుకోవాల్సి న కార్యాచరణపై 99 రోజులు యాక్షన్ ప్లాన్ అమలు



చేస్తున్నట్లు మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. ఈ యాక్షన్‌ప్లాన్ భవిష్యత్‌లో శాఖాపరంగా ఒక బ్లూ ప్రింట్‌గా ఉపయోగ పడాలన్నారు. ఈ విష యమై గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికా రులు, జిల్లాస్థాయి అధికారులంతా భాగస్వాములై ప్రజా ప్రభు త్వం లక్ష్యాన్ని సాధించే ఉద్యమంలో భాగం కావాలన్నారు. తెలంగాణ రాష్ట్రం ఆర్థిక పరిపుష్టి సాధించాలనే ఆలోచనతో పల్లె నుంచి పట్నం వరకు సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్య క్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. శుక్రవారం అన్ని జిల్లా కేంద్రాల్లో నిర్వహించే ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొని ప్రభుత్వ ఉద్దేశ్యాన్ని ప్రజలకు తెలుపాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు పిలుపునిచ్చారు.

## 12న టిజి ఎడ్‌సెట్ ప్రవేశపరీక్ష

**హైదరాబాద్, మే 7, ప్రభాతవార్త :** టిజి ఎడ్‌సెట్(ఉపాధ్యాయ శిక్షణా కోర్సు)-2026 ప్రవేశ పరీక్షను ఆన్‌లైన్ కంప్యూటర్ పరీక్షా విధానంలో ఈ నెల 12న నిర్వహించనున్నట్లు ఎడ్‌సెట్ కన్వీనర్ ఆచార్య వెంకట్రామిరెడ్డి తెలిపారు. ఈ విషయమై గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రవేశ పరీక్షను రెండు విడతల్లో నిర్వహిస్తామన్నారు. ఉదయం 12 నుండి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుండి 4 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. మొత్తం రాష్ట్ర వ్యాప్తంగా 59 పరీక్షా కేంద్రాల్లో పరీక్ష జరుగుతుందన్నారు. 35, 842 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని చెప్పారు.

## 15న టిజి ఇసెట్-2026 ప్రవేశపరీక్ష

**హైదరాబాద్, మే 7, ప్రభాతవార్త :** టిజి ఈసెట్-2026 ప్రవేశపరీక్షను ఈ నెల 15న శుక్రవారం నిర్వహించనున్నట్లు సెట్ కన్వీనర్ ఆచార్య చంద్రశేఖర్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 9 గంటల నుండి 12 గంటలకు ప్రవేశపరీక్ష ఉంటుందన్నారు. విద్యార్థులు హాల్‌టికెట్లను టిజిఈసెట్ వెబ్‌సైట్ నుండి ఈ నెల 9న ఉదయం 11 గంటల నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. రూ.5వేల ఆలస్య రుసుముతో ఈ నెల 11వరకు, రూ.10వేల ఆసల్య రుసుముతో ఈ నెల 12 వరకు విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. గురువారం వరకు 18637 మంది విద్యార్థుఉలు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, మొత్తం 16 ప్రాంతాల్లో 80 పరీక్షా కేంద్రాల్లో పరీక్షను నిర్వహిస్తామన్నారు.

## సమర్థవంతంగా పిఎం కుసుమ్

### విద్యుత్ పంపిణీ సంస్థ సిఎండి ముషారఫ్

**హైదరాబాద్, మే 7, ప్రభాతవార్త:** తమ సంస్థ పరిధిలోని వినియోగదారుల ఆర్థిక స్థితిని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో పి.ఎం. కుసుమ్ పథకాన్ని సమర్థవంతంగా ప్రభుత్వం అమలు చేస్తోందని ఉచిత విద్యుత్ నిమిత్తం కొత్తగా ఏర్పాటు చేసిన మూడో పంపిణీ సంస్థ సిఎండి ముషారఫ్ ఫరూఖీ తెలిపారు. ఈ పథకం ద్వారా లబ్దిగరులు తమ వ్యవసాయ మరియు బంజరు భూముల్లో సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేసి, ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను పంపిణీ సంస్థలకు విక్రయించడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. ఇంధన శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో వినియోగంలో ఉన్న విద్యుత్‌లో అధిక భాగం బొగ్గు, డీజిల్ వంటి సాంప్రదాయ ఇంధన వనరుల ద్వారా ఉత్పత్తి అవుతోందని, ఇవి పరిమిత లభ్యత కలిగినవే కాక పర్యావరణానికి హానికరమని ఆయన తెలిపారు. సౌరశక్తి ద్వారా పర్యావరణహిత విద్యుత్ ఉత్పత్తి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. పి.ఎం. కుసుమ్ పథకం ద్వారా తమ భూముల్లో 0.5 మెగావాట్ల నుండి 2.0 మెగావాట్ల సామర్థం కలిగిన సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు.

## అందీఅందని అందలం!

>> పార్టీలకు స్థానం కల్పించకూడదన్న వాదన లేవదీస్తున్నారు. ప్రభుత్వంలో చేరి కేబినెట్‌పదవులను డిమాండ్‌చేయవచ్చని, తమిళనాడు ఉనికిని కోల్పోనీయకూడదన్న వాదన తెస్తున్నారు. అలాగే మాజీ సీఎం ఎంకె స్టాలిన్‌సైతం శుక్రవారం తమ నిర్ణయాన్ని తెలియజేస్తామని ప్రకటించారు. సమీకరణాలు హఠాత్తుగా ఎవ్వరూ ఊహించనివిధంగా మారినా ఆశ్చర్యంలేదని రాజకీయ నిపుణులు పేర్కొంటున్నారు.మరోపక్క అటు అన్నాడిఎంకె, ఇటు డిఎంకె పార్టీలు రెండూ కూడా ప్రభుత్వం ఏర్పాటుకు టివికె పార్టీని ఆహ్వానించాలని బలనిరూపణకు అవకాశం ఇవ్వాలని గతంలో కొన్ని రాష్ట్రాల అసెంబ్లీల్లో కూడా ఇవే పరిణామాలుచోటుచేసకున్నాయని నాయకులు తెరపైకి తెస్తున్నారు. ముందునుంచి టివికెకు మద్దతివ్వబోమని చెపుతున్న అన్నాడిఎంకె, డిఎంకెలు కలిసి ప్రభుత్వం ఏర్పాటుచేయాలని భావించినా వాటికి సరైన మెజార్టీకూడాలేదు. ఈలోపు అన్నాడిఎంకెలోనే చీలిక ఏర్పడి చీలికవర్గం టివికె విజయ్‌కు మద్దతిచ్చేందుకు సిద్ధం అవుతున్నట్లు సమాచారం. ఇప్పటికే టివికెకు చెందిన సీనియర్ నాయకులతో మంతనాలు జోరుగా సాగిస్తున్నారు. ఇప్పటికే 12 మంది ఎమ్మెల్యేలతో షణ్ముగం ప్రత్యేక శిబిరం నిర్వహిస్తుంటే అన్నాడిఎంకె ఇతర ఎమ్మెల్యేలను పుదుచ్చేరిలోని ప్రత్యేక శిబిరానికి తరలించి పళనిస్వామి వర్గం తమ వర్గం ఎమ్మెల్యేలను కాపాడుకుంటోంది.

**తెరపైకి మళ్లీ రిసార్ట్ రాజకీయాలు**

తమ ఎమ్మెల్యేలు చేజారిపోకుండా కాపాడుకునేందుకు అన్నాడీఎంకే పార్టీ అప్రమత్తమైంది. బుధవారం 15 మందికి పైగా తమ పార్టీ ఎమ్మెల్యేలను పొరుగున ఉన్న పుదుచ్చేరిలోని ఓ విలాసవంతమైన రిసార్టుకు తరలించింది. ఎన్నికల్లో 108 స్థానాలతో అతిపెద్ద పార్టీగా అవతరించిన విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే), ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన 118 మంది మద్దతును కూడగట్టలేకపోయింది. ఈ క్రమంలో టీవీకేకు కొందరు అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు మద్దతు పలకవచ్చనే ప్రచారం జరగడంతో, పార్టీ అధిష్ఠానం వెంటనే ఎమ్మెల్యేలను తరలించే ప్రక్రియ చేపట్టింది. అన్నాడీఎంకే నేత, ఎంపీ సీవీ షణ్ముగం పుదుచ్చేరిలోని ది షోర్ త్రిశ్వమ్ రిసార్టులో 20కి పైగా గదులను బుక్ చేసినట్లు సమాచారం. మరోవైపు కాంగ్రెస్ (5) మద్దతుతో కలిపి విజయ్ బలం 112కు చేరినప్పటికీ, మెజారిటీకి ఇంకా దూరంలోనే ఉండటంతో టీవీకే కూడా తమ ఎమ్మెల్యేలను చెన్నై సమీపంలోని మామల్లపురంలో ఉన్న రిసార్టుకు తరలించింది. మరోవైపు తమిళ రాజకీయాల్లో ఊహించని పరిణామం చోటుచేసుకుంది. బద్ధ శత్రువులైన డీఎంకే (59), అన్నాడీఎంకే (47) మధ్య తెర వెనుక చర్చలు జరుగుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం ఇవ్వాలని కోరుతూ విజయ్ గవర్నర్ రాజేంద్ర ఆర్లేకర్‌ను కలిశారు. అయితే, 118 మంది ఎమ్మెల్యేల మద్దతును నిరూపించుకున్న తర్వాతే రావాలని గవర్నర్ స్పష్టం చేశారు. దీంతో ప్రధాన పార్టీలన్నీ ఎమ్మెల్యేలను కాపాడుకునే పనిలో పడటంతో తమిళనాడులో ప్రభుత్వ ఏర్పాటు వ్యవహారం మరింత ఉత్కంఠగా మారింది.

**డిఎంకె, అన్నాడిఎంకె కలిస్తే మూకుమ్మడి రాజీనామాలే!**

టివికెను ప్రభుత్వం ఏర్పాటుచేయనీయకుండా డిఎంకె, అన్నాడిఎంకెలు రెండూ కలిసినా వారికి కూడా మెజార్టీ మార్కు చేరుకోవడం కష్టమే. ఈ రెండుపార్టీల్లో ఎవరో ఒకరు మరొకరికి మద్దతు ఇవ్వడంద్వారా ప్రభుత్వం ఏర్పాటుచేసే యోచనలో ఉన్నట్లు సమాచారం. డిఎంకె,ఎఐఎడిఎంకె శిబిరాల్లో ఇందఉకు సంబంధించి ప్రత్యేక అత్యవసర సమావేశాలు కూడా జరిగాయి. టివికె వరకూ విజయ్‌కు 108 స్థానాలున్నప్పటికీ రెండుసీట్లలో పోటీచేయడంవల్ల 107 స్థానాలు మాత్రమే ఉంటాయి.

# ఉచిత విద్యుత్‌కు షాక్

### గృహజ్యోతి నుండి 15 లక్షల మంది ఔట్

### 200 యూనిట్లు పైబడిన మీటర్ రీడింగ్

### ఉష్ణోగ్రతల నేపథ్యంలో భారీగా కరెంట్ వినియోగం

**హైదరాబాద్, మే 7, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని గృహ జ్యోతి పథకం లబ్ధిదారులకు బిల్లుల షాక్ తగి లింది. ప్రస్తుత వేసవి కాలంలో విద్యుత్ వినియోగం అధికంగా ఉండటం వల్ల గృహజ్యోతి లబ్ధిదారులు ఉచితం నుండి వైదొలగాల్సి వచ్చింది. మార్చి నెలలో విద్యుత్ మీటర్లు గిర్రున తిరిగేశాయి. ఫలితంగా 200 యూనిట్ల లోపు ఉండాల్సి న కరెంటు వినియోగం కాస్తా 250 నుంచి 300 యూనిట్లు దాటింది. దీంతో అంతకు ముందు గృహజ్యోతి పథకానికి అర్హులుగా గుర్తించిన వారిలో సుమారు 15 లక్షల మంది లబ్దిదారులు ఒక్కసారిగా ఉచిత పథకానికి దూరమయ్యారు. ఈ లబ్దిదారులు ఇప్పటి వరకూ 200 యూనిట్లు లోపు విద్యుత్ వాడుతుండటంతో ఉచిత పథకంలోకి వచ్చి ఒక్కో సర్వీసుకు నెలకు దాదాపు రూ.800 వరకూ ప్రయోజనాన్ని పొందారు. అయితే ఈ నెలలో గృహజ్యోతి పథకంలో ఉచిత విద్యుత్‌కు దూరం అయ్యారు. ఇప్పటి వరకూ ఉచితంగా కరెంటు వాడుకున్న లబ్దిదారులు ఈ నెల 200 యూనిట్లుకు దాటి రీడింగ్ రావడంతో భారీగా బిల్లులు చెల్లించాల్సి న పరిస్థితి తప్పడం లేదు. వైట్ రేషన్ కార్డు కలిగిన కుటుంబాలకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ నెలలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు పెరగడంతో లక్షలాది మంది లబ్ధిదారులు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పరిమితిని దాటారు. దీనివల్ల వారిని గృహజ్యోతి పథకం నుండి హఠాత్తుగా తొలగించాల్సి వచ్చింది. రాష్ట్రంలోని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ,నఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థల పరిధిలో 200 యూనిట్ల కంటే తక్కువ విద్యుత్ వినియోగించే వినియోగదారులకు జీరో బిల్లులు జారీ చేశాయి. అయితే, వేసవి తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో ఉష్ణోగ్రత 46 డిగ్రీల సెల్సియస్‌కు చేరడంతో పగలు, రాత్రి తేడా లేకుండా వినియోగదారులు ఫ్యాన్‌లతో పాటు, ఎసిలు, ఎయిర్ కూలర్‌లను కూడా ఉపయోగించారు. దీని ఫలితంగా, చాలా మంది వినియోగదారులు గృహజ్యోతి పథకం ప్రయోజనాలను కోల్పోవాల్సి వచ్చింది. తెలంగాణ వ్యాప్తంగా 52.82 లక్షల గృహజ్యోతి కింద 200 యూనిట్ల వరకూ విద్యుత్ వాడిన లబ్దిదారులకు ఉచితంగా సరఫరా చేసింది. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలో 25,35,560 మంది లబ్దిదారులకు విద్యుత్ అందిస్తుండగా, ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలో మరో 27,46,938 మంది ఈ ఉచిత ప్రయోజనాన్ని పొందుతున్నారు. ఈ నేపథ్యంలో ఉచిత విద్యుత్ నిమిత్తం పంపిణీ సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల వరకూ 3,593 కోట్లు రూపాయలు చెల్లించింది. ఈ వేసవి కాలంలో భారీ ఉష్ణోత్రల నేపథ్యంలో ఉచిత విద్యుత్ భారం తగ్గి రాష్ట్ర ప్రభుత్వానికి కాస్తకాస్త ఉపశమనం లభించనుందని విద్యుత్ పంపిణీ సంస్థల అధికారులు తెలిపారు.

### ప్రపంచ అథ్లెటిక్స్ దినోత్సవం సందర్భంగా

## క్రీడాకారులకు సిఎం రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 7:** ఆరోగ్యానికి, ఆత్మ విశ్వాసానికి, యువత భవితవ్యానికి పునాదిగా నిలిచే అథ్లెటిక్స్‌లో రాణిస్తున్న క్రీడాకారులందరికీ 'ప్రపంచ అథ్లెటిక్స్ దినోత్సవం' సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. క్రీడలను ప్రోత్సహిస్తూ మట్టిలో మాణిక్యాలను వెలికి తీయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం కోసం, దేశ భవిష్యత్తు కోసం ప్రజాప్రభుత్వం క్రీడారంగానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తుందని స్పష్టం చేశారు. ఒలింపిక్స్‌లో రాణించాలన్న లక్ష్యంతో ప్రజాప్రభుత్వం క్రీడా పాలసీని తీసుకురావడమే కాకుండా యంగ్ ఇండియా ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీని ప్రారంభించిన విషయాన్ని ప్రస్తావించారు.

ఒలింపిక్స్ లక్ష్యంగా ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలతో గచ్చీబౌలీ స్టేడియంను అత్యాధునికంగా తీర్చిదిద్దుతున్నట్టు తెలిపారు. అందరికీ అందుబాటులో ఉంటే అథ్లెటిక్స్ ప్రతి మనిషిలో దాగి ఉన్న శక్తి సామర్థ్యాలను వెలికితీస్తాయని, ఈ క్రీడలు శరీరాన్ని దృఢంగా, మనసును స్థిరంగా తీర్చిదిద్దుతాయని చెప్పారు. శారీరకంగా, మానసిక దృఢత్వమే కాకుండా క్రమశిక్షణ, పట్టుదల పెంచే అథ్లెటిక్స్‌ను ప్రోత్సహించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ఈ ప్రపంచ అథ్లెటిక్స్ దినోత్సవం సందర్భంగా, ఆరోగ్యంతో పాటు ఆత్మవిశ్వాసం, విజయానికి దారితీసే ప్రయాణాన్ని ప్రారంభిద్దామని ముఖ్యమంత్రి ఆకాంక్షిస్తూ, క్రీడాకారులు, క్రీడాభిమానులకు శుభాభినందనలు తెలిపారు.

## బిజెపి గేట్‌కీపర్‌లా తమిళనాడు గవర్నర్!

### సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా బిజెపి విధానం

### పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, మే 7, ప్రభాతవార్త:** తమిళనాడు ప్రజలు టివికెకు అను కూలంగా ఇచ్చిన తీర్పును రాజ్యాంగేతర శక్తిగా,బిజెపి గేట్ కీపరగ్‌గా వ్యవహరిస్తున్న తమిళనాడు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ అగౌరవపరుస్తున్నారనీ టిపిసిసి అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ విమర్శించారు. గాంధీభవన్‌లో ఆయన గురువారం మాట్లాడుతూ 108 స్థానాలు గెలిచి సింగిల్ లార్జెస్ట్ పార్టీగా అవతరించిన టివికెను ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించకపోవడం దురదృష్టకరమనీ ఆయన ఆవేదన చెందారు. గవర్నర్ తీరు రాజ్యాంగ స్ఫూర్తిని సమాధి చేసేట్లు ఉందనీ ప్రజాతీర్పును గవర్నర్‌లు గౌరవించాలని ఆయన హితవు చెప్పారు. ఢిల్లీలో బిజెపి హైకమాండ్ నుంచి వస్తున్న ఆదేశాలకు అనుగుణంగా గవర్నర్ తీసుకుంటున్న నిర్ణయాలు తీసుకొంటున్నారనే అనుమానాలు కలుగుతున్నాయనీ అన్నారు. సింగిల్ లార్జెస్ట్ పార్టీకి అవకాశమివ్వాలని సర్కారియా కమిషన్, బొమ్మై కేసు సుప్రీంకోర్టు తీర్పులు స్పష్టంగా చెబుతున్నాయనీ మహేష్‌కుమార్ ఈ సందర్భంగా గుర్తుచేశారు.



గవర్నర్‌కు రాజ్యాంగం చదవడం తెలియదా లేక రాజ్యాంగానికి వ్యతిరేఖంగా ప్రవర్తించాలని ఉద్దేశపూర్వకంగా చేస్తున్నారా? అని ప్రశ్నించారు. తమిళనాడులో గవర్నర్ ద్వారా పాలించాలని బిజెపి కుట్రలు చేస్తోందనీ ఆరోపించారు. 59 సంవత్సరాల ద్రావిడ పార్టీల పాలనకు ప్రజలు చెక్ పెట్టిన మార్పును అడ్డుకోవడానికి గవర్నర్‌ను ఆయుధంగా వాడుకుంటోందనీ విమర్శించారు. కాంగ్రెస్ మద్దతు ప్రకటించిన తర్వాత కూడా అవకాశం ఇవ్వకపోవడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమనీ ఆగ్రహం వ్యక్తంచేశారు. గవర్నర్ కేరళ పర్యటన పేరుతో మరింత జాప్యం చేయడం యాదృచ్ఛికం కాదు కుట్ర రాజకీయాల్లో భాగమే అని ఆయన ఆరోపించారు. విజయ్ రెండుసార్లు రాజ్‌భవన్‌కు వెళ్ళినా వట్టిచేతులతో తిరిగిరావడం చూస్తే గవర్నర్ రాజ్యాంగ పదవిలో ఉన్నబిజెపి గేట్‌కీపర్ అని స్పష్టమవుతోందనీ విమర్శించారు. రాజ్యాంగం ప్రకారం గవర్నర్ హోదా నామమాత్రమే విచక్షణాధికారాన్ని బిజెపి కోసం దుర్వినియోగం చేయడం రాజ్యాంగ ద్రోహం అన్నారు. కోట్ల మంది ఓట్లు వేసి విజయ్ పార్టీని గెలిపిస్తే వారి కలలను గవర్నర్ రాజ్‌భవన్‌లో బంధించడం ప్రజాస్వామ్యానికి మంచిదికాదని హెచ్చరించారు. గవర్నర్ పదవి రాజ్యాంగ పదవి దాన్ని బిజెపి రాజకీయ పావుగా వాడుకుంటే దేశంలో ఫెడరల్ వ్యవస్థకే ప్రమాదం అని అన్నారు. సమాఖ్యస్ఫూర్తికి విరుద్ధంగా బిజెపి విధానాలు ఉన్నాయనీ ఇది దేశసమగ్రతకు విఘాతం కలిగిస్తోందని తమిళనాడు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ తీరుపై టిపిసిసిఅధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేస్తూ అన్నారు.

## స్వయం సహాయక మహిళలకు శుభవార్త

### వడ్డీలేని రుణ పరిమితి రూ.10 లక్షలకు పెంపు

### రూ.10 లక్షల వరకు బ్యాంకు రుణాలకు ప్రభుత్వమే వడ్డీ చెల్లింపు: పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

**హైదరాబాద్, మే 7, ప్రభాతవార్త:** ప్రతీ మహిళా సంఘానికి వడ్డీ లేని రుణాల పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పెంచుతున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క ప్రకటించారు. మహిళా సంఘం తీసుకునే రూ. 10 లక్షల రూపాయల బ్యాంకు రుణాలకు వడ్డీ ప్రభుత్వమే చెల్లిస్తోందని హామీ ఇచ్చారు. మహిళా సంఘాల రుణాలకు ఈ ఏడాది వడ్డీల కోసం రూ.2500 కోట్లు ఖర్చు చేస్తామని వెల్లడించారు. మహిళా ఉన్నత తెలంగాణ ప్రగతి అన్న నినాదంతో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు. మహిళల ఆర్థిక సాధికారత కార్యక్రమాన్ని యజ్ఞంలా కొనసాగిస్తున్నామని తెలిపారు. మహిళలు పేదరికం నుంచి బయటపడినప్పుడే రాష్ట్రాభివృద్ధి పరిపూర్ణమవుతుందని, అందుకే వడ్డీ లేని రుణాలు ఇప్పించి ఆర్థికంగా మహిళలను ఎదిగేలా చేస్తున్నామని తెలిపారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే సంకల్పంతో పనిచేస్తున్నామని, అన్ని రంగాల్లో మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఈ మేరకు ప్రజాభవన్‌లో గురువారం నిర్వహించిన మహిళా స్వయం సహాయక బృందాల వార్షిక రుణ ప్రణాళిక 2026-27 ఆవిష్కరణ కార్యక్రమంలో మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా మహిళలను ఉద్యోగార్థుల నుంచి ఉద్యోగ సృష్టికర్తలుగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ఇందిర క్యాంటీన్లు, బస్సులు, పాడి కేంద్రాలు, పెట్రోల్ బంకులు, సోలార్ యూనిట్లు, మహిళా మార్టులు, గోదాములు వంటి రంగాల్లో మహిళలు విజయవంతంగా రాణిస్తున్నారని చెప్పారు.

పంట కొనుగోలు కేంద్రాల్లో 40శాతం కేంద్రాలను మహిళా సంఘాలకు అప్పగించామని, ఈ ఏడాది 26 వేల కోట్లకు పైగా మహిళలకు బ్యాంకు రుణాలు ఇస్తామని ఆమె వెల్లడించారు. మహిళల ఆర్థిక సాధికారతలో ఈ నిర్ణయం ఓ మైలురాయి అని, లక్షలాది కుటుంబాలకు ఆర్థిక భరోసా అని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో మహిళలకు పట్టుమని పదివేల రూపాయల లోన్లు కూడా లభించకపోయేవని విమర్శించారు.

కాని ప్రస్తుతం మహిళలకు బ్యాంకులు లక్షలాది రూపాయలు ఇస్తున్నాయని, పేదరికం వల్లే తాను నక్సలైట్లలో చేరానన్నారు. వడ్డీ వ్యాపారుల దోపిడి కారణంగా సామాన్యులు నష్టపోయారని, వారి బాధ చూడలేక తాను తుపాకిపట్టానని చెప్పారు. ఆ అనుభవంతోనే ప్రస్తుతం గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రిగా మహిళలకు వడ్డీ లేని రుణాలు కల్పించాలని సంకల్పంతో పనిచేస్తున్నామన్నారు. బ్యాంకులకు మహిళా సంఘాలు లోన్ రీ పే మెంట్ బాగా చేస్తున్నాయన్నారు. నిర్మల్ జిల్లా జీరో ఎన్‌పిఎ సాధించిందన్నారు. నిర్మల్ జిల్లా తరహాలోనే అన్ని జిల్లాలు 100శాతం బ్యాంకులకు లోన్ రీపేమెంట్ చేయాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. మహిళా సంఘాలకు సరళమైన పద్ధతిలో లోన్లు ఇవ్వాలని బ్యాంకర్లను ఆదేశించారు. బ్యాంకులకు ప్రభుత్వం గ్యారెంటీ ఇస్తోందని, లోన్ పూర్తిస్థాయిలో రీపేమెంట్ చేసే బాధ్యత ప్రభుత్వానిదన్నారు. వ్యక్తులకు లోన్ ఇస్తే ఎగ్గొట్టే ప్రమాదం ఉంటుందని, అదే మహిళా శక్తికి సహకరిస్తే బ్యాంకు డబ్బులకు భద్రత లభిస్తుందన్నారు. మహిళా సంఘాలకు లోన్‌లు ఇస్తూ సహకరిస్తున్న బ్యాంకర్లకు ధన్యవాదాలు తెలిపారు.

## జనరల్‌కు ఐదేళ్లు, రిజర్వ్ కేటగిరికి పదేళ్లు పెంపు!

### నిరుద్యోగ యువతకు తీపి కబురు అందించే దిశగా అడుగులు

**హైదరాబాద్, మే 7, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన నిరుద్యోగ యువతకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించే దిశగా అడుగులు వేస్తోంది. గత కొన్నేళ్లుగా సరైన ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు లేక, వయోపరిమితి దాటిపోయి ఆందోళనలో ఉన్న లక్షలాది మంది అభ్యర్థులకు ఊరటనిచ్చేలా గరిష్ఠ వయోపరిమితిని పెంచే అంశంపై ప్రభుత్వం తీవ్రంగా కసరత్తు చేస్తోంది. ప్రభుత్వ ఉద్యోగాలకు వయోపరిమిది దాటిన నిరుద్యోగ యువతకు 5 నుండి 10 ఏళ్ల పాటు సడలించేందుకు ప్రాథమికంగా నిర్ణయించినట్లు సమాచారం. తెలంగాణ పర్యాటకం తెలంగాణ ఉద్యమ కాలం నుంచి నేటి వరకు రిక్రూట్‌మెంట్ ప్రక్రియల్లో జరిగిన జాప్యం వల్ల ఎంతోమంది అభ్యర్థులు తమకు అర్హత ఉన్న సమయాన్ని కోల్పోయారు. వయోపరిమితి ముగిసిపోవడం వల్ల లక్షలాది మంది యువత అనర్హులుగా మారే ప్రమాదం ఉండటంతో సర్కార్ ఈ నిర్ణయంతీసుకున్నట్లు తెలుస్తోంది. 2022లో ఇచ్చిన 10 ఏళ్ల వయో సడలింపు గడువు ఈ ఏడాది ఫిబ్రవరితో ముగిసింది. ఉద్యోగ నియామక ప్రకటనల జారీలో ఏర్పడిన భారీ జాప్యం కారణంగా ముఖ్యంగా, కొత్త రాష్ట్రం ఏర్పడిన తర్వాత గ్రూప్1 నియామక ప్రకటనల కోసం అభ్యర్థులు దాదాపు ఐదేళ్లు వేచి ఉండాల్సి వచ్చిన పరిస్థితుల దృష్ట్యా నాటి ప్రభుత్వం వయోపరిమితిని సడలించింది. ఫలితంగా, సాధారణ గరిష్ఠ వయోపరిమితి 34 ఏళ్లుగా ఉన్నప్పటికీ, ఆ సడలింపు వల్ల అభ్యర్థులు 44 ఏళ్ల వయస్సు వరకు నియామక పరీక్షలకు హాజరయ్యే అవకాశం లభించింది. ఈ వయోపరిమితి సడలింపు ముగియడంతో అభ్యర్థుల్లో మళ్లీ ఆందోళన మొదలైంది. ప్రస్తుతం ప్రభుత్వం వయోపరిమితిలో మార్పులను పరిశీలిస్తున్నట్లు సమాచారం. జనరల్ కేటగిరికి చెందిన నిరుద్యోగ యువతకు గరిష్ఠ వయోపరిమితిపై 5 ఏళ్ల సడలింపు ఇచ్చే అవకాశం, రిజర్వ్ కేటగిరీ లోని ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ యువతకు అదనంగా 10 ఏళ్ల వరకు సడలింపు ఇచ్చే ఆలోచన చేస్తోంది. అయితే ఏ వర్గానికి అన్యాయం జరగకుండా అందరికీ సమానంగా 10 ఏళ్ల పాటు వయోపరిమితి సడలింపు ఇవ్వాలని అభ్యర్థులు పట్టుబడుతున్నారు. రాబోయే మెగా డీఎస్సీ, గ్రూప్స్ వంటి భారీ నోటిఫికేషన్లకు ముందే ఈ వయో సడలింపుపై ఒక స్పష్టమైన జీవో విడుదలయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. దీనిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించడంతో లక్షలాది మంది నిరుద్యోగులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఈ నిర్ణయం అమలైతే గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని మధ్యతరగతి కుటుంబాల యువతకు ప్రభుత్వ కొలువు సాధించేందుకు తిరిగి అవకాశం లభిస్తుందని భావిస్తున్నారు.

## చర్లపల్లి సెంట్రల్ జైలులో ప్రభుత్వ ఐటిఐ ఏర్పాటు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 7:** ఖైదీలకు ఉపాధి ఆధారిత సాంకేతిక శిక్షణ అందించి, విడుదల తర్వాత సమాజంలో గౌరవప్రదంగా జీవించేలా చర్యలు చేపట్టేందుకు చర్లపల్లి సెంట్రల్ జైలు ప్రాంగణంలో కొత్త ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ (ఐటిఐ) ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. కార్మిక ఉపాధి శిక్షణ, కర్మాగారాల శాఖ కార్యదర్శి హరిచందన దాసరి ఈ మేరకు గురువారం జిఓ 137 జారీ చేశారు. ఖైదీలకు ఉపాధి ఆధారిత సాంకేతిక కోర్సుల్లో శిక్షణ ఇచ్చి, జైలు నుంచి విడుదలయ్యాక ప్రధాన స్రవంతి ఉపాధి రంగంలోకి వారి మార్పు ను సులభతరం చేయడం ఈ ఐటీఐ ఏర్పాటు ప్రధాన ఉద్దేశం. దీనివల్ల సామాజిక కళంకం, ఆర్థిక అనిశ్చితిని నివారించవచ్చని ప్రభుత్వం పేర్కొంది. చర్లపల్లి సెంట్రల్ జైలులో ఒక ప్రభుత్వ ఐటీఐ ఏర్పాటుకు జైళ్ల శాఖ డీజీకి అనుమతిస్తూ, ప్రభుత్వ ఉత్తర్వులు, డిజిటి నిబంధనలకు లోబడి అన్ని షరతులను పాటించాలని స్పష్టం చేసింది. ఉపాధి, శిక్షణ శాఖ డైరెక్టర్ వెంటనే జైళ్ల శాఖకు లెటర్ ఆఫ్ ఇంటెంట్ జారీ చేయాలని, సంబంధిత నిబంధనలు, విధానాలు పాటించాలని ఆదేశించింది. జైళ్ల శాఖ డిజి, ఉపాధి, శిక్షణ శాఖ డైరెక్టర్ తదుపరి అవసరమైన చర్యలు తీసు కోవాలని ప్రభుత్వం ఆదేశించింది.

### ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలో

## వన్ మినిట్ రూల్.. ప్రత్యేక భద్రతా విధానం అమలు

### ఎన్పీడిసిఎల్ సిఎండి వరుణ్‌రెడ్డి

**హైదరాబాద్, మే 7, ప్రభాతవార్త:** విద్యుత్ రంగంలో పని చేసే సిబ్బంది భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సిఎండి కర్నాటి వరుణ్‌రెడ్డి తెలిపారు. వన్ మినిట్ రూల్" అనే ప్రత్యేక భద్రతా విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు."ఒక్క నిమిషం ఆలోచన - జీవితాంతం భద్రత" అనేది తమ ప్రధాన సందేశమని గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ నియమం ద్వారా ప్రతి పనికి ముందుగా కేవలం ఒక నిమిషం సమయం కేటాయించి అవసరమైన భద్రతా చర్యలను పరిశీలించడం తప్పనిసరి చేయబడిందని పేర్కొన్నారు. క్షేత్ర స్థాయిలో పనిని ప్రారంభించే ముందు సిబ్బంది ఒక్క నిమిషం పాటు ఆగి, అన్ని భద్రతా ప్రమాణాలు సరిగా ఉన్నాయా లేదా అనే విషయాన్ని నిర్ధారించుకోవడం ఈ నియమం యొక్క ముఖ్య ఉద్దేశ్యమన్నారు. చిన్న నిరక్ష్యం పెద్ద ప్రమాదాలకు దారి తీసే అవకాశం ఉన్నందున, ఈ ఒక నిమిషం సమయం ప్రాణాలను కాపాడగలదని వ్యాఖ్యానించారు. పనికి ముందుగా తప్పనిసరిగా లైన్ క్లియర్ పొందం, ఇండక్షన్ టెస్టర్‌తో లైన్‌లో విద్యుత్ లేదని నిర్ధారించుకోవడం, వ్యక్తిగత రక్షణ పరికరాలు సరిగా ధరించడం, ఎర్తింగ్ ఏర్పాటు, పని చేసే ప్రదేశంలో ఇతర ప్రమాదాలు, డబుల్ ఫీడింగ్ లేకుండా జాగ్రత్తలు తదితర అంశాలపై టీమ్ సభ్యులందరూ చెక్ చేసుకుని అప్రమత్తం, సురక్షితం గూర్చి నిర్ధారించుకోవడం దీని ప్రధాన ఉద్దేశ్యమని వివరించారు. ఈ నియమం ద్వారా ప్రమాదాలను తగ్గించడం, సిబ్బంది ప్రాణాలను రక్షించడం, విద్యుత్ సరఫరా వ్యవస్థను మరింత సురక్షితంగా నిర్వహించడం లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. ప్రతి ఉద్యోగి ఈ నియమాన్ని కచ్చితంగా పాటించాలనే దిశగా ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని చెప్పారు.

## విలీన సమస్యలను ముందే పరిష్కరించాలి

### ఆర్టీసీ యాజమాన్యానికి ఎస్‌డబ్ల్యుఎఫ్ యూనియన్ వినతి

**హైదరాబాద్, మే 7, ప్రభాతవార్త:** ఆర్టీసీ కార్మికులను తక్షణమే రాష్ట్ర ప్రభుత్వంలో విలీనం చేయాలని, వీలైనంత త్వరగా అప్పాయింటెడ్ డేను ప్రకటించాలని టిఎస్ఆర్‌టిసి ఎండి నాగిరెడ్డిని ఎస్‌డబ్ల్యుఎఫ్ యూనియన్ కోరింది. విలీన కమిటీలో అన్ని సంఘాలను భాగస్వాములను చేయాలని, విలీనానికి ముందు అన్ని సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేసింది. ఈ విషయమై గురువారం యూనియన్ నేతలు ఆర్టిసి ఎండి నాగిరెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు.కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని,ఆర్టీసీలో ప్రజాతంత్ర హక్కులను పునరుద్ధరించాలని , మెజారిటీ యూనియన్‌ను నిర్ణయించడానికి గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని, కార్మికుల కోసం కార్మికులే నిర్వహించుకుంటున్న క్రెడిట్ కో ఆపరేటివ్ సొసైటీకి ఎన్నికలు నిర్వహించుకునేందుకు ప్రభుత్వం, యాజమాన్యం సహకరించాలని కోరింది.



ప్రధానికి బహిరంగ లేఖను విడుదల చేస్తున్న బిసి నేతలు చిరంజీవులు, బాలరాజ్‌గౌడ్, వెంకన్నగౌడ్, నారాయణగౌడ్ తదితరులు

## 10న ప్రధాని మోడీ తెలంగాణ రాక..

### బహిరంగ లేఖను విడుదల చేసిన బిసి నేతలు

**హైదరాబాద్ (సైఫాబాద్), మే 7, ప్రభాతవార్త:** నరేంద్రమోడీ మూడోసారి ప్రధానమంత్రి అయిన తరువాత తొలిసారిగా ఈ నెల 10న తెలంగాణ రాష్ట్రాన్ని సందర్శించబోతున్న నేపథ్యంలో బిసిల న్యాయ బద్ధమైన హక్కులను దృష్టిలో ఉంచుకుని అమలు చేయాలని బిసి ఇంటెలెక్చువల్స్ ఫోరం, బిసి పొలిటికల్ ఫ్రంట్ కోరింది. ఈ మేరకు గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఫోరం ఛైర్మన్ టి.చిరంజీవుల, ఫ్రంట్ ఛైర్మన్ బాలగోని బాలరాజ్‌గౌడ్ తదితరులు 10 డిమాండ్లతో కూడిన ఒక బహిరంగ లేఖను ప్రధాని కోసం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చట్ట సభలలో బిసిలకు 50 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని, మహిళా రిజర్వేషన్‌లలో బిసి మహిళలకు సబ్‌కోటా కల్పించాలని ఇందుకోసం రాజ్యాంగ సవరణ చేయాలని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బిసిలకు కేటాయించిన 42 శాతం రిజర్వేషన్‌లకు పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పించాలని కోరారు. బిసిల హక్కులపై 10వ తేదీన ప్రధాని ప్రకటన చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బిసి నేతలు అయిలి వెంకన్నగౌడ్, అంబాల నారాయణగౌడ్, భైరీ శేఖర్, వెంకన్ననేత తదితరులు పాల్గొన్నారు.

# ఐపిఎల్‌లో సెంచరీల మోత

## లక్నో తరపున మార్ష్ తొలి సెంచరీ నమోదు



**లక్నో:** ఐపీఎల్‌లో సెంచరీల మోత మోగుతోంది. గురువారం 12వ సెంచరీ నమోదైంది. ఆర్సీబీతో జరిగిన ఈ మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ ఓపెనర్ ఈ ఫీట్ సాధించాడు. ఈ సీజన్‌లో తేలిపోతూ నిరాశపరిచిన మిచెల్ మార్ష్ తొలిసారి తన స్థాయికి తగ్గ బ్యాటింగ్ చేశాడు. భువనేశ్వర్ బంతికి సింగిల్‌తో ఖాతా తెరిచిన మిచెల్ మార్ష్..ఆ తర్వాత ప్రతి బౌలర్‌ను దంచేశాడు. ఈ సీజన్‌లో వికెట్ల వేటతో రెచ్చిపోతున్న భువనేశ్వర్, హేజిల్‌వుడ్‌ను సైతం మార్ష్ బాదుడుకు బలయ్యారు. కుర్రాడు రసిక్ దార్ సలాంతో పాటు స్పిన్నర్ కృనాల్ పాండ్యాను సైతం మిచెల్ మార్ష్ ఉతికేశాడు.

హాజిల్‌వుడ్ బంతికి సిక్స్‌తో మొదలుపెట్టిన మిచెల్ మార్ష్... ఆ తర్వాత ఫోర్లు, సిక్స్‌లు కురిపించాడు. భువనేశ్వర్ ఓవర్లో ఓ సిక్స్, క్రూనాల్ బంతులకు ఫోర్, సిక్స్, రసిఖ్ ఓవర్లో రెండు సిక్స్‌లు, ఓ ఫోర్‌తో 17 పరుగులు సాధించాడు. హాజిల్‌వుడ్ వేసిన ఏడో ఓవర్లో బ్యాక్ టు బ్యాక్ బౌండరీలతో కేవలం 20 బంతుల్లోనే ఫాసెస్ట్ హాఫ్ సెంచరీ సాధించాడు. ఐపీఎల్‌లో మార్ష్‌కు ఇదే వేగవంతమైన హాఫ్ సెంచరీ. లక్నో తరపున అతడు ఏడో ఫాస్టెస్ట్ ఫిఫ్టీ నమోదు చేశాడు. హాఫ్ సెంచరీ దాటినా మిచెల్ మార్ష్ దూకుడు తగ్గలేదు. అదే దూకుడుతో బంతులను స్టాండ్స్‌లోకి పంపాడు. 14వ ఓవర్లో షెఫర్డ్ వేసిన బంతులను వరుసగా రెండు బౌండరీ, ఓ సిక్స్‌తో సెంచరీ పూర్తి చేశాడు. 49 బంతుల్లో ఈ సెంచరీ వచ్చింది. ఇందులో 9 ఫోర్లు, 8 సిక్స్‌లు ఉన్నాయి. ఈ ఐపీఎల్ సీజన్‌లో లక్నో సూపర్ జెయింట్స్ తరపున సెంచరీ చేసిన తొలి బ్యాట్స్‌మెన్‌గా మిచెల్ మార్ష్ నిలిచాడు.

## 200 మ్యాచ్‌ల క్లబ్‌లో భువనేశ్వర్

**లక్నో:** ఐపీఎల్ 2026 సీజన్‌లో సూపర్ ఫామ్ కనబరుస్తున్న రాయల్ చాలెంజర్స్ బెంగళూరు స్టార్ బౌలర్ భువనేశ్వర్ కుమార్.. లక్నో సూపర్ జెయింట్స్‌తో మ్యాచ్‌లో అరుదైన రికార్డు సాధించాడు. ఇది భువనేశ్వర్‌కు 200వ మ్యాచ్. ఐపీఎల్లో ఈ ఘనత సాధించిన తొలి పేసర్‌గా భువనేశ్వర్ ఘనత అందుకున్నాడు. ఓవరాల్‌గా ఐపీఎల్‌లో 200 మ్యాచ్‌లు ఆడిన ఆటగాళ్ల జాబితాలో భువనేశ్వర్ 12వ స్థానంలో ఉన్నాడు. భువీ 200 మ్యాచ్‌ల్లో 215 వికెట్లు పడగొట్టాడు. ఈ సీజన్‌లో ఆర్సీబీ తరపున 10 మ్యాచ్‌ల్లో 17 వికెట్లు తీసి పర్పుల్ క్యాప్ రేసులో ముందున్నాడు. 2011లో ఐపీఎల్‌లో అరంగేట్రం చేసిన భువనేశ్వర్ తొలుత పుణే వారియర్స్ తరపున 26 మ్యాచ్‌లు, ఎస్ఆర్‌హెచ్ తరపున 129 మ్యాచ్‌లు, ఆర్సీబీ తరపున 44 మ్యాచ్‌లు ఆడాడు. అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ఆటగాళ్ల జాబితాలో ధోనీ(278 మ్యాచ్‌లు), రోహిత్ శర్మ(277), విరాట్ కోహ్లీ(276) టాప్ త్రీలో ఉన్నారు.


## తెలంగాణ టీ20 క్రికెట్ లీగ్‌కు బిసిసిఐ గ్రీన్ సిగ్నల్

**హైదరాబాద్, మే 7:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న తెలంగాణ టీ20 క్రికెట్ లీగ్‌కు బిసిసిఐ అధికారికంగా ఆమోదం ఇచ్చింది. టీజీ20 లీగ్‌కు బీసీసీఐ ఆమోదం లభించడంతో హెచ్‌సీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. బీసీసీఐ ప్రధాన కార్యదర్శి దేవజిత్ సైకియాకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ లీగ్‌ను అత్యంత పారదర్శకంగా, అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్వహిస్తామని హెచ్‌సీఏ కార్యదర్శి జీవన్ రెడ్డి అన్నారు. గతంలో ఇతర రాష్ట్రాల్లో విజయవంతమైన టీఎన్‌పీఎల్, కేపీఎల్ తరహాలోనే తెలంగాణ లీగ్ కూడా విజయవంతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ టోర్నీ ద్వారా రాష్ట్రం నుంచి మరికొంత మంది స్టార్ ఆటగాళ్లు తయారయ్యే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం ఫ్రాంచైజీల ఎంపిక, ఆటగాళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియపై కసరత్తు జరుగుతోంది. త్వరలోనే టోర్నీ షెడ్యూల్, వేదికలు, ప్రైజ్ మనీ వివరాలను త్వరలో వెల్లడిస్తారు. టీజీ లీగ్‌లో ప్రతిభ కనబరిచే ప్లేయర్లకు ఐపీఎల్ వంటి మెగా లీగ్‌లలో చోటు దక్కించుకునే సువర్ణావకాశం ఉంటుందని, ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని హెచ్‌సీఏ పేర్కొంది.







# హైదరాబాద్ టాప్ గేర్

(వార్త క్రీడా విభాగం)

**ఇండియన్ ప్రీమియర్ లీగ్ కీలక దశకు చేరుకుంది. ప్లేఆఫ్‌లోని నాలుగు బెర్త్‌ల కోసం మ్యూజికల్ చెయిర్ ప్రారంభమైంది. ఆట ఆగిందో సీటు గోవిందా అన్నట్లుగా తయారైంది. రోజు రోజుకు ప్లే ఆఫ్ సమీకరణాలు మారిపోతూ ఉత్కంఠ రేపుతోంది. టాప్ ప్లేస్ పక్కా అనుకున్న పంజాబ్ హ్యాట్రిక్ పరాజయాలతో వెనకబడగా...మొన్నటివరకు గెలుపు రుచి చూడని జట్లు వరుస విజయాలతో దూసుకువచ్చాయి. దీంతో ప్లే ఆఫ్ చేరే జట్ల మధ్య ఆసక్తికర పోరు నెలకొంది.**

ఉప్పల్‌లో ఉప్పెనలా విరుచుకుపడుతున్న సన్ రైజర్స్ టేబుల్ టాపర్‌గా నిలిచింది. నిజానికి ఈ స్థానానికి చేరుకుంటుందని ఈ సీజన్ ఆరంభంలో సన్‌రైజర్స్ ఆటతీరు చూసిన ఎవ్వరూ ఊహించలేదు. తొలి మ్యాచ్‌లోనే ఆర్సీబీ చేతిలో ఓటమి. ఆపై కోల్‌కతాపై నెగ్గినా ఆ వెంటనే రెండు పరాజయాల వెక్కిరింత. సొంత గ్రౌండ్‌లోనే ఓటమి. ఈ స్థితిలో సన్ రైజర్స్ ఆటతీరు ఒక్కసారిగా టాప్ గేర్‌లోకి వెళ్లింది. ఉప్పల్‌లోనే రాజస్థాన్ రాయల్స్‌పై బిగ్ విక్టరీ అందుకున్న ఆరేంజ్ ఆర్మీ ఆ తర్వాత అదరగొట్టింది. వరుసగా అయిదు విజయాలతో రేసులోకి వచ్చింది. మధ్యలో కేకేఆర్ మ్యాచ్‌లో తలబడ్డా వెంటనే పుంజుకుని టాప్ ప్లేస్‌కు చేరుకుంది. దీనికంతటికీ ఫియర్ లెస్ ఫైటింగే కారణం. సన్‌రైజర్స్ టాప్ ప్లేస్ అందుకుందంటే ప్రతి ప్లేయర్‌ది కీలక రోల్.

### విధ్వంసక ఓపెనింగ్ జోడీ

అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్‌లదే ఐపీఎల్‌లో అత్యంత ప్రమాదకరమైన ఓపెనింగ్ జోడీ. మొదట్లో హెడ్ ఇబ్బంది పడినా.. ఆ లోటు తెలియనీయకుండా అభిషేక్ కవర్ చేసేవాడు. ఇప్పుడు ఆసీస్‌స్టార్ బ్యాటర్ కూడా శివాలెత్తడం మొదలుపెట్టాడు. కీలక సమయంలో ఫామ్ అందుకోవడం సన్‌రైజర్స్‌కు కలిసొస్తోంది. అభి 11ఇన్నింగ్స్‌లో 47.50 సగటుతో 475 రన్స్ సాధించి మోస్ట్‌రన్స్‌లో రెండో స్థానంలో ఉన్నాడు. ఓ సెంచరీ, మూడు హాఫ్ సెంచరీలతో సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. ట్రావిస్ కూడా 11మ్యాచ్‌ల్లో 45.40 సగటుతో 361 రన్స్ సాధించాడు. 2 హాఫ్ సెంచరీలు ఉన్నాయి.



### మూలస్థంభాల్లా ఇషాన్, క్లాసెన్

ఓపెనర్లు ఏడెనిమిది ఓవర్‌కల్లా స్కోరును సెంచరీ దాటించేస్తుంటే ఆ తర్వాత బాధ్యతను ఇషాన్ కిషన్ మోస్తున్నాడు. మెరుపు ఇనింగ్స్‌లతో అదరగొడుతున్నాడు. క్రీజ్‌లోకి వచ్చింది మొదలు భారీ షాట్లతో విరుచుకుపడుతూ పటిష్ట స్కోర్లు అందిస్తున్నాడు. 11ఇన్నింగ్స్‌లో నాలుగు అర్ధసెంచరీతో 409 రన్స్ చేసి టాప్-4లో ఉన్నాడు. ఇక మిడిల్ ఓవర్లలో హెన్రిచ్ క్లాసెన్ ఇన్నింగ్స్ సన్‌రైజర్స్‌కు ప్లస్ అవుతోంది. చివరి వరకూ క్రీజ్‌లో నిలబడి భారీ స్కోరు అందించే బాధ్యత తీసుకుంటున్నాడు. 11 మ్యాచ్‌ల్లో 54.88 బ్యాటింగ్ సగటుతో 494 రన్స్ చేసి టాప్ ప్లేస్‌లో ఉన్నాడు. ఆ మాటకొస్తే టాప్-4 లో ముగ్గురు సన్‌రైజర్స్ ప్లేయర్లే.

### నితీష్ ఆల్‌రౌండర్ షో

ఈ సీజన్‌లో అత్యంత నిలకడైన ఆటతీరుకు క్లాసెన్ మారుపేరుగా నిలిస్తే, అతనికి చక్కని తోడ్పాటు ఇస్తూ సూపర్ ఆల్‌రౌండర్‌గా నితీష్ కుమార్ రెడ్డి నిలుస్తున్నాడు. మిడిల్ ఓవర్ నుంచి చివరివరకూ హెన్రిచ్ క్లాసెన్ నితీశ్ కుమార్ రెడ్డి జోడీ మ్యాచ్‌ను తీసుకెళ్తున్న తీరు అద్భుతం. పది మ్యాచ్‌ల్లో 31,71 బ్యాటింగ్‌సగటుతో 222 రన్స్ సాధించాడు. అలాగే కీలక దశలో వికెట్లూ పడగొడుతూ సన్ రైజర్స్ విజయాల్లో కీ రోల్ పోషిస్తున్నాడు. గత సీజన్‌లో 13 మ్యాచులు ఆడిన నితీష్ కుమార్ కేవలం 182 పరుగులు, 2 వికెట్లు మాత్రమే తీశాడు. ప్రస్తుతం సీజన్‌లో 10 మ్యాచుల్లోనే 222 పరుగులు, ఏడు వికెట్లు తీసి సత్తా చాటాడు.

### అప్పుడప్పుడు ఆ ఇద్దరు

సన్‌రైజర్స్ బ్యాటింగ్ ఆర్డర్‌లో సలీల్ అరోరాతోపాటు అనికేత్ వర్మ సత్తా చాటుతున్నాడు. ఎప్పుడు ఛాన్స్ వచ్చినా నిరూపించుకొనేందుకు సిద్ధంగా ఉండటం ఎస్ఆర్‌హెచ్‌కు సానుకూలాంశం. ఇద్దరూ స్లాగ్ ఓవర్లలో ధాటిగా ఆడుతూ పరుగులు అందిస్తున్నారు.

### సన్‌రైజర్స్ బౌలింగ్ జోరు

ఆరేంజ్ ఆర్మీ బౌలింగ్ ఈ సీజన్‌లో వైవిధ్యంగా ఉంది. పర్పుల్ క్యాప్ రేసులో పోటీపడుతోన్న మలింగ...ఆరంభంలోనే బ్రేక్ అందిస్తూ ఇప్పటి వరకు 16 వికెట్లు పడగొట్టాడు. ఇక ఆలస్యంగా వచ్చినాతనఇంపాక్ట్ ఏంటో కెప్టెన్ ప్యాట్‌కమిన్స్ చూపిస్తున్నాడు. వీరితో పాటు సకిబ్ హుస్సేన్ (10 వికెట్లు) ప్రతి మ్యాచ్‌లోనూ వికెట్ తీస్తూ సత్తా చాటాడు. ప్రఫుల్ హింగే (8), శివాంగ్ (8), హర్ష్ దూబే (8) అదరగొట్టేస్తున్నారు.

టాప్ ప్లేస్‌కు చేరుకున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ ఈ స్థానాన్ని నిలబెట్టుకోవాలంటే ఇదే స్థాయి విజయాలు అవసరం. ఇంకా మూడు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. ఈనెల 12న అహ్మదాబాద్‌లో గుజరాత్ టైటాన్స్‌తో... 18న చెన్నైలో చెన్నై సూపర్ కింగ్స్‌తో, 22న సొంతగడ్డ ఉప్పల్ స్టేడియంలో ఆర్సీబీతో తలపడనుంది. ఈ మూడు మ్యాచ్‌లు నెగ్గితేనే టాప్-2 ఛాన్స్ ఉంటుంది. కనీసం రెండు నెగ్గినా ప్లే ఆఫ్ చేరుకుంటుంది. ఇది జరగాలంటే సన్‌రైజర్స్ టాప్ గేర్‌లోనే వెళ్లాల్సి ఉంటుంది.





## చివరి నిమిషంలో లాభాల స్వీకరణ

# స్వల్ప నష్టాల్లో సెన్సెక్స్,నిఫ్టీ

**ముంబయి, మే 7:** ఎగువస్థాయిలో లాభాల స్వీకరణ పెరగడంతో దేశీయ స్టాక్ మార్కెట్లు స్వల్ప నష్టాలతో గురువారం ట్రేడింగ్ ముగించాయి. అమెరికా ఇరాన్ శాంతి ఒప్పందం కొలిక్కి వస్తుందన్న ఆశలు, భౌగోళిక ఉద్రిక్తతలు సర్దుబాటువుతాయన్న అంచనాలతో స్టాక్ మార్కెట్లు ప్రారంభంలో పెరిగినప్పటికీ ఇంట్రాడే తర్వాత ఎగువస్థాయిలో లాభాలు స్వీకరణ జరిగింది. ముడిచమురు కూడా బ్యారెల్‌కు 100 డాలర్ల దిగువకు రావడం, రూపాయి మారకం విలువల్లో 23 పైసలు రికవరీ వంటివి కొన్ని రంగాలకు కలిసొచ్చాయి. అలాగే నాలుగోత్రైమాసిక ఫలితాలు కూడా కొన్ని సూచీలకు ఊతం ఇచ్చాయి. ఐటి, ఎఫ్ఎంసిజి, కన్స్యూమర్ రంగాల షేర్లు క్షీణించాయి. ఆటో, ప్రైవేటు బ్యాంకింగ్ రంగ షేర్లు మాత్రం లాభాల్లో ముగిసాయి. బిఎస్ఇ సెన్సెక్స్ 114 పాయింట్లు క్షీణించి 77,844.52 పాయింట్లకు చేరితే నిఫ్టీ 50 సూచీ 4.30 పాయింట్లు క్షీణించి 24,326.65 పాయింట్ల వద్ద నమోదయింది. హిందూస్థాన్ యూనిలీవర్ 1.95శాతం, టిసిఎస్ 1.38శాతం, ఐటిసి 0.95 శాతం చొప్పున క్షీణించాయి. బిఎస్ఇలో మిడ్‌క్యాప్ సూచీ 0.99శాతం, స్మాల్‌క్యాప్‌సూచీ 1.07శాతం పెరిగాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ రికార్డుగరిష్టానికి అంటే 22,808.45 పాయింట్లకు పెరిగింది. ఇక గురువారం ట్రేడింగ్‌లో బిఎస్ఇ 2735 షేర్లుపెరిగితే 1521షేర్లు క్షీణించాయి. 174కంపెనీలు స్థిరంగా కొనసాగాయి. పదేళ్ల బాండ్లు 0.03శాతంపెరిగి 6.928 శాతంగా నడిచింది.

విదేశీ కరెన్సీ మార్కెట్‌లో రూపాయి మారకం విలువలు ముందురోజు 94.49 నుంచి 94.24 కి పటిష్టపడింది. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు 0.50శాతం పెరిగి రూ.1,52,896చొప్పున కొనసాగింది. అమెరికా పదేళ్లబాండ్లు 0.57శాతం క్షీణించి 4.330శాతంగా కొనసాగితే కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్ ముడిచమురు బ్యారెల్ ఒక్కింటికి ఫ్యూచర్స్‌లో 2.212డాలర్లు క్షీణించి 99.15 డాలర్లుగా కొనసాగింది. యూరోపియన్ మార్కెట్లు గురువారం క్షీణించాయి.

ఆసియా మార్కెట్లపరంగాచూస్తే జపాన్ ఈక్విటీలు రికార్డుస్థాయికి పెరిగాయి. అమెరికా ఇరాన్ శాంతి డీల్ ఎక్కువ ప్రభావం చూపించింది. అమెరికా స్టాక్స్ రాత్రికిరాత్రే ర్యాలీ తీసాయి. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు తగ్గుతున్నాయన్న అంచనాలే ఇందుకు కీలకం. ఎస్అండ్‌పి 500 1.46శాతం పెరిగితే నాస్‌డాక్ కాంపోజిట్ 2.20 శాతం ర్యాలీ తీసింది. రెండు సూచీలు కూడా రికార్డు గరిష్టాలను తాకాయి. డౌజోన్స్ పారిశ్రామిక సగటు 612.34 పాయింట్లుపెరిగింది. ఎల్అండ్‌టి 0.35శాతం పెరిగితే కార్‌ట్రేడ్ టెక్ కూడా 6,.52శాతం, బజాజ్ ఆటో 2.83శాతం, సిజి పవర్ ఇండస్ట్రియల్ సొల్యూషన్స్ 3.54 శాతం, ఐఐఎఫ్ఎల్ క్యాపిటల్ సర్వీసెస్ 5.99 శాతం పెరిగాయి. భారత్ ఫోర్జ్ 6.23శాతం క్రాఫ్ట్స్‌మాన్ ఆటోమేషన్ 10.96శాతం ట్రిగేడ్ ఎంటర్‌ప్రైజెస్ 4.62శాతం చొప్పున పెరిగాయి. మీషో కూడా 1.07శాతం పెరిగింది. టిడి పవర్ సిస్టమ్స్ 7.23శాతం, యాప్టస్ వాల్యూ హౌసింగ్ ఫైనాన్స్ 3.09శాతం చొప్పున పెరిగితే బిఎం డబ్ల్యు ఇండస్ట్రీస్ 5.11శాతం ర్యాలీ తీసాయి. కాన్సాయ్ నెరోలాక్ పెయింట్స్ 4.94శాతం, అపోటెక్స్ ఇండస్ట్రీస్ 20శాతం ఆర్ సిస్టమ్స్ ఇంటర్నేషనల్ 4.80శాతం, స్యూలా వైన్‌యార్డ్స్ 1.47శాతం చొప్పున పెరిగాయి.




## బిఎస్ఇ నికరలాభం రూ.797 కోట్లు

**ముంబయి, మే 7:** బాంబే స్టాక్ ఎక్స్ఛేంజి నాలుగో త్రైమాసికంలో 32.5శాతం లాభాలను పెచుకోగలిగింది. ఈత్రైమాసికంలో రూ.602 కోట్లనుంచి రూ.797 కోట్లకు లాభం పెరిగింది. ఎక్స్ఛేంజి రాబడులు కూడా 25.7శాతం పెరిగాయి. రూ.1244కోట్లనుంచి రూ.1564 కోట్లకు చేరాయి. ఇక ఎబిడిటా ప్రకారం చూస్తే 43.9శాతంపెరిగి రూ.738 కోట్లనుంచి రూ.1061 కోట్లకు పెరిగింది. పన్నుల వ్యయాలు రూ.199 కోట్లనుంచి రూ.268 కోట్లకు పెరిగాయి. బిఎస్ఇ వాటాదారులకు ప్రతి షేరుకు రూ.10 చొప్పున డివిడెండ్‌ను కూడాప్రకటించింది. అయితే 2018 తర్వాత అతితక్కువ మొత్తం డివిడెండ్ ప్రకటించడం ఇదే మొదటిసారి. కంపెనీ డివిడెండ్ పంపిణీ సుమారు 407.88 కోట్లు వాటాదారులకు అందచేస్తామని చెప్పింది. రికార్డుతేదీ జులై 10గా చెప్పింది. సంస్థ సర్వసభ్యసమావేశంలో వాటాదారుల ఆమోదం తర్వాత డివిడెండ్‌పంపిణీజరుగుతుందని చెప్పింది. ఆమోదం పొందినతర్వాత డివిడెండ్‌ఋ ఈ ఏడాది సెప్టెంబరు 17వ తేదీలోపు చెల్లిస్తుంది. కంపెనీ ఈనెల 14వ తేదీనే ప్రతి వాటాకు రూ.23 డివిడెండ్‌ప్రకటించింది. 2024లో అయితే కంపెనీ రూ.15 ప్రతిషేరుకు డివిడెండ్ ఇస్తామన్నది. అలాగే 2023లో కూడా ప్రతి వాటాకు రూ.12 డివిడెండ్‌ను ప్రకటించింది.

## డాలర్ వర్సెస్ రూపాయి 94.26

**న్యూఢిల్లీ, మే 7:** డాలరుతో రూపాయి విలువలు కొంతమేర పటిష్టం అయ్యాయి. మారకం విలువల్లో గురువారం 23 పైసలవరకూ రూపాయి రికవరీ కనిపించింది. గురువారం ట్రేడింగ్‌ముగిసేనాటికి ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్ఛేంజి కౌంటర్లలో డాలరుకు రూపాయి 94.26వద్ద ముగిసింది. ముడిచమురు ధరలు కొంతమే బ్యారెల్‌కు 100 డాలర్లకు లోబడి నమోదయ్యాయి. దీనికి తోడు అమెరికా ఇరాన్‌మధ్య 14 అంశాలతో కూడిన డిమాండ్లపై చర్చించి సానుకూల ఒప్పందం రెడీ అవుతుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించడం కూడా రూపాయి పటిష్టతకు దారితీసింది. ముడిచమురు దిగమతుల బిల్లులు ఇపుడు తగ్గుతుండటంతో రూపాయి మారకం విలువలు పటిష్టం అయ్యాయి. ఉదయం 94.77వద ప్రారంభం అయిన ట్రేడింగ్ అంతకుముందురోజు 28 పైసలు క్షీణించింది. గురువారం ఇంట్రాడేలో రూపాయి విలువలు 94.90వద్దకు కూడా చేరాయి. ఒకదశలో 94.08వరకూ దిగివచ్చింది. చివరకు 94.26వద్ద ట్రేడింగ్‌ముగిసింది. ముందురోజు ముగింపుకంటే 23 పైసలు బలపడిందని ట్రేడర్లు వెల్లడించారు. బుధవారం రూపాయి 69 పైసలు పెరిగి డాలరుకు 94.49గా ట్రేడ్ అయింది. అయితే దిగుమతిదారులకు డాలర్ చెల్లింపులు, విదేశీ ఇన్వెస్టర్ల ఈక్విటీ విత్‌డ్రాలు వంటి డిమాండ్లు లాభాలను కట్టడిచేస్తాయి. రానున్న రోజుల్లో రూపాయి మారకం డాలరుకు 93.80 నుంచి 94.40వరకూ ఉండవచ్చని మిరాయ్ అసెట్ షేర్‌ఖాన్ విశ్లేషకులు అనూజ్ చౌదరి అన్నారు. ముడిచమురు గ్లోబల్ బెంచ్‌మార్క్‌లో 2.23శాతం తగ్గి బ్యారెల్‌కు 99.01 డాలర్లుగా ఉంది. ముందురోజు విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.5,834.90 కోట్ల పెట్టుబడులను విత్‌డ్రాచేసుకున్నారు.






## ఎన్ఎస్ఇలో ప్రభుత్వ రంగ సంస్థల వాటాదారులు

# 15 వేల కోట్ల ఆఫర్ ఫర్ సేల్

**ముంబయి, మే 7:** నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజిలోని ప్రభుత్వరంగ సంస్థల వాటాదారులు సుమారు రూ.15,500 కోట్లమేర విక్రయించేందుకు నిర్ణయించారు. ఎన్ఎస్ఇ ఇందుకోసం ఆఫర్ ఫర్ సేల్ ప్రకటించింది. ఎన్ఎస్ఇలో 4-5 శాతం వాటాలు ఈ ఒఎఫ్ఎస్‌లో అమ్ముడుపోతాయి. ప్రభుత్వరంగ సంస్థలు ఎన్ఎస్ఇలో 31శాతం వాటాతో ఉన్నాయి. ఇపుడు సమారు 10శాతం వాటాలను విక్రయించాలని నిర్ణయించాయి. ఎన్ఎస్ఇ ఈక్విటీ మొత్తంలో 3.1శాతంగా ఉంటుందని అంచనా. ఎల్ఐసి అతిపెద్ద వాటాదారుగా ఉంది. ఒఎఫ్ఎస్‌కు కూడా ఎక్కువ మొత్తం ప్రకటించింది. సుమారు రూ.5,300 కోట్లు మేర ఒఎఫ్ఎస్‌లో సమీకరిస్తుందని అంచనా. ఎక్ఛేంజిస్థాయిలో ఒకటిశాతం ఈక్విటీ వాటాను విక్రయిస్తోంది. స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ తన వాటాల్లో రూ.2200 కోట్లు షేర్ల విక్రయం ద్వారా ఆర్జిస్తోంది. సుమారు 0.44శాతంగా ఉంటుంది. ఎస్‌బిఐ గ్రూప్ అనుబంధ ంస్థలు కూడా రూ.3700కోట్లు మేర షేర్లు విక్రయిస్తాయి. 0.7శాతం ఈక్విటీ విక్రయిస్తారని అంచనా. ప్రభుత్వ రంగ బీమా సంస్థలు సమిష్టిగా రూ.4వేల కోట్లు విత్‌డ్రాచేస్తాయి. ఎక్స్ఛేంజి విలువల్లో 0.8శాతం వాటాతో ఉంటాయి. ఎన్ఎస్ఇ కూడా సంస్థాగత వాటాదారులను పెట్టుబడులకు ప్రోత్సహిస్తోంది. సంస్థాగతంగా విక్రయాలు కూడా రూ.5 వేలనుంచి రూ.7500 కోట్లుగా ఉంటాయి. మొత్తంగా ఒఎఫ్ఎస్ రూ.20 వేల కోట్లనుంచి రూ.23 వేల కోట్లవరకూ ఉంటుందని అంచనా. ఈ మొత్తంతో ఎన్ఎస్ఇలో ఈక్విటా వాటాల విక్రయం అనేది 4నుంచి 5శాతంగా ఉంటుంది. న్యూ ఇండియా అస్యూరెన్స్, జిఐసి రె, టీమ్‌సెక్, క్రిస్ క్యాపిటల్ వంటిసంస్థలు ఈ ఒఎఫ్ఎస్‌లో పాల్గొనబోతున్నాయి.

## వేదిక్స్,స్కిన్‌క్రాఫ్ట్‌లో ఇమామి వాటా కొనుగోలు

**కోల్‌కత్తా, మే 7:** సౌందర్య ఉత్పత్తుల సంస్థ ఇమామి ఇంక్‌నట్ డిజిటల్‌లో 60శాతం వాటా కొనుగోలుకు ఒప్పందం చేసుకుంది. వినియోగ రంగ బ్రాండ్లు వేదిక్స్, స్కిన్‌క్రాఫ్ట్ సంస్థల్లో రూ. 321 కోట్లతో ఈ వాటాల కొనుగోలు చేస్తోంది. పనితీరు ఆధారంగా సర్దుబాట్లు ఉంటాయిన రెండేళ్ల వ్యవధిలో పూర్తవుతుందని వివరించింది వచ్చే నాలగున్నరేళ్లలో ఇక్‌నట్ డిజిటల్‌లో ఉన్న మిగిలిన వాటాను కూడా కొనేస్తుందని కంపెనీ వర్గాలు వెల్లడించారు. అయితే ఈకొనుగోలు రెండువిడతలుగా ఉంటుంది. ఇందుకు సంస్థ ప్రస్తుత, భవిష్యత్తు పనితీరును కూడా అంచనావేస్తారు. వేదిక్స్, స్కిన్‌క్రాఫ్ట్ రెండు సంస్థలు కూడా నేరు వినియోగరంగ విక్రయాలు అంటే డి2సి ప్లాట్‌ఫామ్‌లో కకేశ సంరక్షణ, చర్మసంరక్షణ ఉత్పత్తులను అందిస్తోంది. వేదిక్స అయితే ఆయుర్వేదిక్ ఫరిష్కారాలు అందిస్తుంది. స్కిన్‌క్రాఫ్ట్ సంస్థ అయితే చర్మసంరక్షణ సంబంధిత పరిష్కారాలు అందిస్తుంది ఇమామి వైస్‌ఛైర్మన్ ఎండి హర్షవర్ధన్ అగర్వాల్‌మాట్లాడుతూ కంపెనీ బ్యూటీ, పర్సనల్‌కేర్ విభాగంలో మరింత ఉనికిని విస్తరించేందుకు ఈ కొనుగోలు తోడ్పడుతుందని చెప్పారు. ఇంక్‌నట్ డిజిటల్ సిఇఒ చైదన్య నల్లాన్‌మాట్లాడుతూ ఇమామి భాగస్వామ్యంతో వేదిక్స్, స్కిన్‌క్రాఫ్ట్ మరింత విస్తరణదిశగా వెళతాయన్నారు. ఇప్పటికే ఇమామి దిమాన్ కంపెనీ, బ్రిల్లెయిర్‌సంస్థలనుకొనుగోలుచేసిన సంగతి తెలిసిందే. ఎఫ్ఎంసిజి రంగంలో అగ్రగామిగా ఉన్న ఈ సంస్థ యాక్సియామ్ ఆయుర్వేద లో మిగిలి ఉన్న 73.5శాతం వాటాను కూడా కొనుగోలు చేసేందుకు నిర్ణయించింది. ఆలోఫ్రూట్ అనే ఉత్పత్తి యాక్సిమోమ్‌నుంచి వస్తున్నది.

## నాలుగుశాతం పెరిగిన వెండిధరలు



**ముంబయి, మే 7:** వెండిధరలు అంతర్జాతీయ మార్కెట్లలో నాలుగుశాతం మేర పెరిగాయి. ఔన్స్ ఒక్కింటికి 80 డాలర్లుగా ఉన్నాయి. దేశీయ ఫ్యూచర్ల పరంగాచూస్తే ఎంసిఎక్స్‌లో కిలో ఒక్కింటికి 2.6 లక్షల వరకూ ఎగబాకింది. స్పాట్ మార్కెట్‌లో వెండి 4.56శాతం పెరిగి ఔన్స్‌కు80.87డాలర్లుగా అమ్మకాలున్నాయి. ఎంసిఎక్స్‌లో జులై 26 సెటిల్‌మెంట్లు 3.54శాతంపెరిగి కిలో ఒక్కింటికిరూ.2,62,238గా ట్రేడ్ అయింది. ఇంట్రాడేలో ఒకదశలో 2లక్షల 62వేల443 గా కూడా నమోదయింది. బంగారం ధరలు కూడా గ్లోబల్ మార్కెట్లలో పెరిగాయి. ముడిచమురు ధరలు కొంతమేర తగ్గడంతో ఇపుడు బులియన్ రంగానికి డిమాండ్‌పెరిగింది. స్పాట్ పసిడి ధరలు 0.94శాతంపెరిగి ఔన్స్ ఒక్కింటికి 5735.27 డాలర్లుగా నడిచింది. ఎంసిఎక్స్ పసిడి ఫ్యూచర్లు 0.6శాతం పెరిగి రూ.1.53 లక్షలుగా పదిగ్రాముల ధరలు కొనసాగాయి. ట్రేడర్లు ఇపుడు రానున్న అమెరికా ఆర్థిక గణాంకాలు, వివిధ దేశాల సెంట్రల్ బ్యాంకుల వడ్డీరేట్ల సవరణలపైనా దృష్టిపెట్టారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., IslamiaJr.College Compound, MGM Road, Warangal-506002. RNI No.64849 Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act.